


# పెన్ పవర్

తెలుగు దిన పత్రిక

ప్రశ్నించడం మన హక్కు




సంపుటి : 1 సంచిక : 90 పేజీలు : 12 సంపాదకులు : జి.ఎ.రావు ( ఆనంద్ గంట్యాడ) ప్రచురణ : హైదరాబాద్ మంగళవారం 10 ఫిబ్రవరి 2026 వెల : 1/-రూ ॥

VOLUME :1 ISSUE : 90 PAGES : 12 EDITOR : G. A. RAO ( ANAND GANTYADA ) PUBLISHED : HYDERABAD TUE 10 FEBRUARY 2026 PRICE : 1/- RS

Simultaneously Published form : Hyderabad, Thadepalligudem, Dr. B.R. Ambedkar Konasema Dist, Narasarao Peta,Bapatla,Visakhapatnam,Kakinada,Ongole, Kadapa,,SPSR Nellore, Circulated by :Srikakulam,manyam,Vizianagaram,East Godavari, Eluru,Guntur, Tirupati,Chittor,Kurnool,Anantapur



తొలి ఎన్నికల బరిలో విజయ్..

## రెండు నియోజకవర్గాల నుంచి పోటీ!

- చెన్నైలోని విరుగంబాక్కం, తిరుచ్చి తూర్పు స్థానాలపై విజయ్ గురి
- పట్టణ, ప్రాంతీయ ఓటర్లను ఆకట్టుకునేందుకు పక్కా వ్యూహం
- రెండు స్థానాల్లోనూ అధికార డీఎంకేతోనే విజయ్ ప్రధాన పోటీ

- మిగతా 2లో...

## అమెరికాతో ఉద్రిక్తతలు..

## 37 ఏళ్ల సంప్రదాయానికి ఖమేనీ బ్రేక్

- 37 ఏళ్లలో తొలిసారి ఎయిర్‌ఫోర్స్ సమావేశానికి గైర్హాజరైన ఇరాన్ సుప్రీం లీడర్ ఖమేనీ
- అమెరికాతో తీవ్ర ఉద్రిక్తతల నడుమ ఈ అనూహ్య పరిణామం
- గల్ఫ్ ప్రాంతంలో భారీగా సైనిక బలగాలను మోహరిస్తున్న అమెరికా
- అమెరికా దాడి చేస్తే యుద్ధం తప్పదని ఇరాన్ తీవ్ర హెచ్చరికలు

- మిగతా 2లో...





# ప్రతి ఓటరునూ కలవండి..

# కాంగ్రెస్ అభ్యర్థి గెలిచేలా చూడండి

- సర్వేలన్నీ కాంగ్రెస్‌కు అనుకూలమే..
- అయినా అప్రమత్తత అవసరం
- నిజామాబాద్, కరీంనగర్ కార్పొరేషన్లు గెలవాలె
- అసంతృప్తులను బుజ్జగించండి.. రెబల్స్ ను తొవ్వకు తెచ్చుకోండి
- ప్రతి ఓటరునూ కలవండి.. కాంగ్రెస్ అభ్యర్థి గెలిచేలా చూడండి
- స్థానికంగానే పీసీసీ పరిశీలకులు.. గాంధీభవన్లో వార్ రూం
- జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల ఫలితాలు రిపీట్ కావాలి
- జూమ్ మీటింగ్లో మంత్రులకు సీఎం రేవంత్ రెడ్డి దిశానిర్దేశం

**హైదరాబాద్ పెన్ పవర్:**రాబోయే 48 గంటలు అత్యంత కీల కమని, మున్సిపల్ ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా సమిష్టిగా పనిచేయాలని సీఎం రేవంత్ రెడ్డి మంత్రులకు పిలుపునిచ్చారు. ఎల్లుండి జరగబో యే మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో ఆయా జిల్లాల్లో ప్రచారంలో పాల్గొం టున్న మంత్రులతో సీఎం జూమ్ మీటింగ్ నిర్వహించారు. రాష్ట్ర వ్యాప్తంగా 116 మున్సిపాలిటీ లు. ఏడు కార్పొరేషన్ల పరిధిలో సర్వేలన్నీ కాంగ్రెస్ పార్టీకి అను కూలంగా ఉన్నాయని సీఎం చెప్పారు. ఉత్తర తెలంగాణలోని నిజామాబాద్, కరీంనగర్ కార్పొరేషన్లలో విజయం సాధించడమే లక్ష్యంగా పనిచేయాల ని అన్నారు. రెబల్స్ కారణంగా ఓట్లు చీలితే పార్టీ విజయావకాశాలు దెబ్బ తింటాయని చెప్పారు. వివిధ డివిజన్లు, వార్డులలో కాంగ్రెస్ రెబల్స్ ను బుజ్జగిం చాలని, ఇందుకోసం మంత్రులు చొరవ చూపాలని అన్నారు. ఈ రెండు రోజులు వారితో కాంగ్రెస్ బీఫాం ఇచ్చిన అభ్యర్థికే ప్రచారం చేయించాలని అన్నారు.

దీంతో పాటు ప్రచారంలో పాల్గొనని అసంతృ ప్తులను కూడా బుజ్జగించి పనిచేసేలా చూడాలని అన్నారు. ప్రతి ఓటరునూ కలవాలని, పార్టీ అభ్యర్థి గెలుపుకోసం

సమిష్టిగా కృషిచేయాలని అన్నారు. పీసీసీ పరిశీలకులు స్థానికంగా అందుబాటులో ఉన్నారని, సమస్య ఏదైనా ఉంటే వారికి సమాచారం అందించి అప్పటికప్పుడు పరిష్కరించుకోవాలని సూచించారు. గాంధీభవన్ లో వార్ రూం సైతం రెడీ

గా ఉందని, సమస్యను వార్ రూంకు తెలియజేసినా పరిష్కార మార్గం దొరుకు తుందని చెప్పారు. జూబ్లీహిల్స్ ఉప ఎన్ని కలో అనుసరించిన ఫార్ములానే ఇక్కడా వాడాలని ఫలితం కూడా అదే విధంగా రిపీట్ కావాలని సీఎం అన్నారు.





## ముగిసిన ఎన్నికల ప్రచారం..

## రేపు పోలింగ్

- రాష్ట్రవ్యాప్తంగా 7 కార్పొరేషన్లు, 116 మున్సిపాలిటీలకు 11వ తేదీన పోలింగ్
- ఉదయం 7 గంటల నుండి సాయంత్రం 5 వరకు పోలింగ్
- ఈ నెల 13న ఓట్ల లెక్కింపు

**హైదరాబాద్ పెన్ పవర్:**తెలంగాణ రాష్ట్రంలో మున్సిపల్ ఎన్నికల ప్రచారం ముగిసింది. రాష్ట్రవ్యాప్తంగా 7 కార్పొరేషన్లు, 116 మున్సిపాలిటీలకు ఎల్లుండి పోలింగ్ జరగనుంది. ఈరోజుతో ప్రచారం ముగియడంతో రాష్ట్రంలో మైకులు మూగబోయాయి. ఈ నెల 11న ఉదయం 7 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు పోలింగ్ జరగనుంది.అనివార్యమైతే ఈ నెల 12న రీపోలింగ్ నిర్వహిస్తారు. ఫిబ్రవరి 13 ఉదయం 8 గంటలకు ఓట్ల లెక్కింపు ప్రారంభిస్తారు. గెలిచిన వారు మరుసటి రోజు వార్డు సభ్యులుగా ప్రమాణ స్వీకారం చేస్తారు. ఫిబ్రవరి 16న మున్సిపల్ ఛైర్మన్, వైస్ ఛైర్మన్, కార్పొరేషన్ మేయర్, డిప్యూటీ మేయర్ ఎన్నిక జరగనుంది.



స్పీకర్ ఓం బిర్లాపై అవిశ్వాసానికి

## విపక్షాల ప్లాన్..

ముదురుతున్న లోక్‌సభ వివాదం

- లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లాపై అవిశ్వాస తీర్మానానికి సిద్ధమైన విపక్షాలు
- ప్రధానిపై దాడి జరగొచ్చన్న స్పీకర్ వ్యాఖ్యలతో రాజుకున్న వివాదం
- 8 మంది కాంగ్రెస్ ఎంపీల సస్పెన్షన్‌తో మరింత పెరిగిన రాజకీయ వేడి

2లో...

పెన్ పవర్ డెస్క్: కేంద్ర ప్రభుత్వం, ప్రతిపక్షాల మధ్య తీవ్రమవుతున్న విభేదాల నేపథ్యంలో లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లాపై అవిశ్వాస



## కేసీఆర్‌ను తిట్టినోళ్లు ఎక్కడ దాక్కున్నా వదలం

- అన్న ఎన్టీఆర్‌ను, చంద్రబాబును చూశాం కానీ ఇలా ఎవరూ మాట్లాడలేదు: కేటీఆర్
- రేవంత్ రెడ్డిలా ఇప్పటి వరకు ఏ ముఖ్యమంత్రి మాట్లాడలేదన్న కేటీఆర్
- కేసీఆర్‌ను, కార్యకర్తలను తిడితే ఊరుకునేది లేదని హెచ్చరిక
- రెండేళ్ల తర్వాత పాతాళంలో దాక్కున్నా ఊరుకునేదని వ్యాఖ్య

**హైదరాబాద్ పెన్ పవర్:**అన్న ఎన్టీఆర్‌ను, ఆ తర్వాత చంద్రబాబు, వైఎస్సార్, కిరణ్ కుమార్ రెడ్డి, కేసీఆర్‌లను చూశామని, కానీ రేవంత్ రెడ్డి లాంటి ముఖ్యమంత్రిని మనం చూడలేదని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ వ్యాఖ్యానించారు. హామీల గురించి అడిగితే 'లాగులో తొండలు విడిచిపెడుతా', 'గుడ్లు పీకి గోటీలు ఆడుతా', 'పేగులు తీసుకుని మెడలో వేసుకుంటా' అని అంటున్నారని,

- మిగతా 2లో...

పంజాబ్ సీఎం విదేశీ పర్యటనకు

## అనుమతినివ్వని కేంద్రం

- వివాదంగా మారిన పొలిటికల్ క్లియరెన్స్ నిబంధన
- సీఎంల ఫారిన్ టూర్లకు విదేశాంగ శాఖ అనుమతి తప్పనిసరి
- కక్ష సాధింపు చర్యలంటూ కేంద్రంపై ఆప్ మండిపాటు

**హైదరాబాద్ పెన్ పవర్:**:పంజాబ్ ముఖ్యమంత్రి భగవంత్ మాన్ విదేశీ పర్యటనపై కేంద్ర ప్రభుత్వం మరోసారి నీళ్లు చల్లింది. యూరప్ లో పర్యటించేందుకు మాన్ విదేశాంగ శాఖ అనుమతి కోరగా తిరస్కరించింది. దీంతో ముఖ్యమంత్రి మాన్

- మిగతా 2లో...





## ఎంఐఎం మద్దతు లేకుండా కాంగ్రెస్ గెలిచిందా?

- రెడ్లు అయినా, రావులు అయినా తమ దగ్గరకు రావాల్సిందే అన్న ఒవైసీ
- మున్సిపల్ ఎన్నికల్లో తమ సత్తా ఏంటో చూపుతామని వ్యాఖ్య
- ముఖ్యమంత్రులే తమ దగ్గరకు రావాలన్న ఒవైసీ

**హైదరాబాద్ పెన్ పవర్:** రెడ్లు అయినా, రావులు అయినా తమ దగ్గరకు రావాల్సిందేనని ఎంఐఎం అధినేత అసదుద్దీన్ ఒవైసీపీ సంచలన వ్యాఖ్యలు చేశారు. ముఖ్యమంత్రుల దగ్గరకు తాము వెళ్లమని, వాళ్లే తమ దగ్గరకు రావాలని అన్నారు. ఇటీవల జరిగిన జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో ఎంఐఎం మద్దతు లేకుండానే కాంగ్రెస్ గెలిచిందా?

- మిగతా 2లో...

## సింగరేణిని రక్షించేది భాజపా మాత్రమే



**హైదరాబాద్ పెన్ పవర్:** సింగరేణి సంస్థ అప్పుల ఊబిలో విలవిలాడుతోందని కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి అన్నారు. మున్సిపల్ ఎన్నికల్లో ప్రజలు ఆలోచించి ఓటేయాలని కోరారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా గోదావరిఖనిలోని గాంధీ చౌరస్తాలో ఏర్పాటు చేసిన సభలో మాట్లాడారు. "బీఆర్ఎస్, కాంగ్రెస్ ప్రభుత్వాలు తెలంగాణకు అన్యాయం చేశాయి. రామగుండం ప్రాంత అభివృద్ధి కోసం గత ప్రభుత్వం చేసిందేమీ లేదు. ఇక్కడ ఎరువుల కర్మాగారం, పవర్ ప్రాజెక్టు తెచ్చింది భాజపా. కేంద్ర ప్రభుత్వం పెట్టుబడులు పెడుతుంటే బీఆర్ఎస్, కాంగ్రెస్ నేతలు దోచుకుంటున్నారు. రామగుండంలో భాజపాను గెలిపిస్తే మరింత అభివృద్ధి చేస్తాం.

- మిగతా 2లో...

## ఎడిటర్ వ్యూ

# ప్రత్యేక వ్యూహంతోనే గిరిజన వికాసం

తెలంగాణ విజన్ 2047, సమగ్ర అభివృద్ధి, మానవ వనరుల వికాసం, సమాన అవకాశాలపై ప్రత్యేక దృష్టి సారిస్తోంది. ఈ లక్ష్యాలను సాధించడంలో గిరిజన యువతపై రాష్ట్రం చేసే పెట్టుబడి చాలా కీలక పాత్ర పోషించనుంది. ఇప్పటివరకు తగిన విధంగా వినియోగించుకోని, అపార సామర్థ్యం కలిగిన గిరిజన యువతకు నైపుణ్యాభివృద్ధి కల్పించడం విజన్- 2047 అమలులో ప్రధాన అంశంగా మారాల్సిన అవసరం ఉంది. జనగణన, రాష్ట్ర అంచనాల ప్రకారం తెలంగాణలో గిరిజనుల జనాభా 32.70 లక్షలు ఉంది. ఇది రాష్ట్ర జనాభాలో సుమారు 10 శాతం. ఇందులో 70 శాతం కంటే ఎక్కువ మంది షెడ్యూల్డ్ ప్రాంతాల్లో, మైదాన ప్రాంతాలలో నివసిస్తున్నారు. ముఖ్యంగా గిరిజన జనాభాలో 55 శాతం పైగా 30 సంవత్సరాల లోపు యువత ఉండటం రాష్ట్రానికి ఒక పెద్ద వరంగా చెప్పవచ్చు. అయితే విద్య, ఉపాధి వంటి రంగాల్లో ఉన్న నిర్మాణాత్మక అసమానతల వల్ల ఈ మానవ వనరు పూర్తిగా సత్ఫలితాలుగా మారడం లేదు. తెలంగాణలో గిరిజనుల అక్షరాస్యత రేటు సుమారు 63 శాతమే ఉండగా, రాష్ట్ర సగటు అక్షరాస్యత 72 శాతానికి పైగా ఉంది. అలాగే మాధ్యమిక స్థాయిలో గిరిజన ప్రాంతాల్లో పాఠశాల విడిచిపెట్టే గిరిజన విద్యార్థుల శాతం ఇంకా ఎక్కువగానే ఉంది. గిరిజన యువతలో సుమారు 70 శాతం మంది వ్యవసాయం, అనుబంధ కార్యకలాపాలపై ఆధారపడుతూ, రైతులుగా లేదా దినసరి కూలీలుగా జీవనం సాగిస్తున్నారు. దీనివల్ల ఆదాయ భద్రత లేకపోవడం ప్రధాన సమస్యగా మారింది. గిరిజన యువతలో దాదాపు 15 శాతం కన్నా తక్కువ మందికే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వం ద్వారా వివిధ నైపుణ్య శిక్షణ లభించిందన్న అంచనాలు ఉన్నాయి. తయారీ, సేవలు, సాంకేతిక రంగాల్లో వారి భాగస్వామ్యం చాలా తక్కువ. ఇది రాష్ట్ర దీర్ఘకాలిక అభివృద్ధికి సవాలుగా ఉండగా, వ్యూహాత్మక గిరిజనుల సుస్థిర అభివృద్ధికి ప్రాధాన్యత అంశాలు: తెలంగాణ విజన్ -2047 రాష్ట్రాన్ని ఆవిష్కరణలు, హరిత వృద్ధి, మౌలిక వసతుల విస్తరణ, జ్ఞానాధారిత పరిశ్రమల కేంద్రంగా తీర్చిదిద్దాలని లక్ష్యంగా పెట్టుకుంది. రాష్ట్రంలోని ప్రతి పౌరుడిని సాధికారతకు, ముఖ్యంగా బడుగు బలహీన వర్గాల సమగ్ర అభివృద్ధి, జీవన ప్రమాణాల మెరుగుదల, స్థిరమైన జీవనోపాధుల సాధనకు ఆరోగ్య సంరక్షణ, విద్య, నైపుణ్యాభివృద్ధి, ఆర్థిక సాధికారత అనే మూడు ప్రధాన రంగాలు కీలకం. వీటి ద్వారా వారి దీర్ఘకాలిక అభివృది, సుస్థిర జీవనం సాధ్యమై, భరోసా కలుగుతుంది. ఈ భవిష్యత్ ఆర్థిక వ్యవస్థకు గిరిజన యువతను అనుసంధానించాలంటే, సంప్రదాయ వృత్తులకే పరిమితం కాకుండా పునరుత్పాదక ఇంధనం, అగ్రి-ప్రాసెసింగ్, ఆహార విలువ గొలుసులు, ఆరోగ్య సేవలు, నిర్మాణ రంగం, లాజిస్టిక్స్, డిజిటల్ సేవలు, ఎకో-టూరిజం వంటి కొత్త రంగాల్లో నైపుణ్య శిక్షణ అందించాలి. ప్రతి ఏడాది కనీసం లక్ష మంది గిరిజన యువతకు ఉపాధి కలిగించే నైపుణ్యాలు అందిస్తే, కుటుంబ ఆదాయాలు గణనీయంగా పెరగడమే కాకుండా స్థానిక ఉపాధి కల్పించడం ద్వారా షెడ్యూల్డ్ ప్రాంతాల నుంచి వలసలు పూర్తిగా తగ్గించవచ్చు. సంప్రదాయ జీవనోపాధి బలోపేతం ఆవశ్యకత: స్థానిక పరిస్థితులకు, గిరిజన సంస్కృతి, జీవన విధానాలకు అనుగుణమైన శిక్షణా కార్యక్రమాలు అవసరం. గిరిజన ప్రాంతాల్లో సహజ వనరులు, మానవ వనరులు సమృద్ధిగా ఉన్నాయి. చిన్న అటవీ ఉత్పత్తులు, వెదురు, ఔషధ మొక్కల ఆధారిత ఉత్పత్తులు, హస్తకళలు, సంప్రదాయ కళలలో విలువ జోడింపు చేయగలిగితే స్థిరమైన జీవనోపాధులు ఏర్పడతాయి. ఆధునిక నైపుణ్యాలు, నాణ్యత ధ్రువీకరణ, బ్రాండింగ్, మార్కెట్ అనుసంధానం కల్పిస్తే అటవీ ఉత్పత్తుల ద్వారా వచ్చే ఆదాయం 30 -50 శాతం వరకు పెరిగే అవకాశం ఉంటుంది. తద్వారా గిరిజన యువతతోపాటు గిరిజన మహిళలకు కూడా ప్రత్యక్ష లాభం చేకూరుతుంది.

గిరిజన యువతకు డిజిటల్ విద్య: ప్రభుత్వ పాలన, విద్య, ఉపాధి రంగాలు డిజిటలైజ్ అవుతున్న తరుణంలో డిజిటల్ భాగస్వామ్యం అత్యంత కీలకం. డిజిటల్ విద్య లేమి గిరిజన యువతను వెనుకబాటుకు నెట్టే ప్రమాదం ఉంది. గిరిజన గ్రామాల్లో ఇంటర్నెట్ వినియోగం, డిజిటల్ పరిజ్ఞానం రాష్ట్ర సగటుతో పోలిస్తే తక్కువగా ఉంది. ప్రాథమిక డిజిటల్ నైపుణ్యాలు, ఐటి సేవలు, మౌలిక సదుపాయాలు అందిస్తే మారుమూల గిరిజన ప్రాంతాల్లో డిజిటల్ ప్లాట్‌ఫామ్ ఆధారిత ఉపాధి అవకాశాలు పెరుగుతాయి. ఇదివిజన్- 2047లో ఊహించిన జ్ఞాన ఆర్థిక వ్యవస్థకు అనుగుణంగా ఉంటుంది. నైపుణ్యాభివృద్ధి ఫలితాలు సాధించాలంటే అనుబంధ కార్యక్రమాలు కూడా కీలకం. ప్రాథమిక, మాధ్యమిక విద్య బలోపేతంచేయడంతో పాటు, పోషణ, ఆరోగ్యం, భాషా మాధ్యమం, ఆర్థిక చేకూర్పు వంటి అంశాలు శిక్షణను ఉపాధిగా మారుస్తాయి. గిరిజన మహిళలు,ఆదిమ గిరిజన తెగలు (పివిటిజిఎస్)పై ప్రత్యేక దృష్టి పెట్టడం అత్యవసరం. ఎందుకంటే వారు అనేక స్థాయిల్లో వెనుకబాటుకు గురవుతున్నప్పటికీ సమాజ స్థిరత్వంలో కీలక పాత్ర పోషిస్తున్నారు. తెలంగాణ విజన్- 2047 విజయవంతం కావాలంటే అభివృద్ధి ఫలాలు అత్యంత మారుముల, ఏజెన్సీ ప్రాంతాలలోన ఉన్న, అట్టడుగు వర్గాల వరకు చేరాలి. గిరిజన యువతకు నైపుణ్యాభివృద్ధి కల్పించడం కేవలం సంక్షేమ చర్య కాదు, ఇది దీర్ఘకాలిక ఆర్థిక అభివృద్ధి వ్యూహం. డేటా ఆధారిత ప్రణాళిక, బలమైన సంస్థాగత వ్యవస్థలు, పరిశ్రమలకు అనుగుణమైన శిక్షణతో గిరిజన యువతను నైపుణ్యవంతులైన ఉద్యోగులుగా, వ్యాపారవేత్తలుగా, ఆవిష్కర్తలుగా తీర్చిదిద్ద గలదు. అలా గిరిజన యువతను రాష్ట్ర అభివృద్ధి ప్రయాణంలో క్రియాశీల భాగస్వాములుగా 2047 నాటికి సమృద్ధి, సమానత్వం, స్థిరత్వం కలిగిన తెలంగాణను నిర్మించవచ్చు.

# సింగరేణిని రక్షించేది భాజపా మాత్రమే

- మొదటి పేజీ తరువాయి
రూ.20వేల కోట్లతో ఎన్టీపీసీని విస్తరిస్తాం. సింగరేణిని రక్షించుకోకపోతే మూతపడే ప్రమాదముంది. కార్మికుల శ్రమను ప్రభుత్వం దోచుకుంటోంది. తెలంగాణలో కారు పంక్చర్ అయింది. ఆ పార్టీలో ఉన్న నాయకులు తలో దారి చూసుకున్నారు. బీఆర్ఎస్‌లో జరిగిన అవినీతిపై కేసీఆర్ కుమార్తె కవిత కూడా చెబుతున్నారు. నిరుద్యోగులకు నెలకు రూ.4వేలు ఇస్తామని చెప్పిన సీఎం రేవంత్‌రెడ్డి.. ఎవరికైనా ఇచ్చారా?కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన ఏ ఒక్క హామీ కూడా అమలు కాలేదు. రౌడీయిజం, గూండాయిజంపై ఆ పార్టీ బతుకుతోంది. కేంద్ర ప్రభుత్వం ఇచ్చే నిధులతోనే మున్సిపాలిటీలు, గ్రామ పంచాయతీలు నడుస్తున్నాయి. కేంద్రం నిధులతోనే రాష్ట్రంలో అభివృద్ధి పనులు జరుగుతున్నాయి. సింగరేణిని రక్షించేది భాజపా మాత్రమే. కోల్‌బెల్ట్ ప్రాంతంలో కాషాయ జెండా ఎగిరితేనే సింగరేణికి మనుగడ ఉంటుంది. గతంలో బీఆర్ఎస్‌కు చెప్పిన విధంగా ఈ ఎన్నికల్లో కాంగ్రెస్‌కు తగిన గుణపాఠం చెప్పాలి. ఈ ఎన్నికల్లో భాజపా అభ్యర్థులను ప్రజలు గెలిపించాలి" అని కిషన్‌రెడ్డి కోరారు.

## కేసీఆర్‌ను తిట్టినోళ్లు ఎక్కడ దాక్కున్నా వదలం

- మొదటి పేజీ తరువాయి
కానీ ఇంతమంది ముఖ్యమంత్రులను మనం చూసినా వారెవరూ ఇలా మాట్లాడలేదని అన్నారు.భూపాలపల్లి, పరకాలలో నిర్వహించిన మున్సిపల్ ఎన్నికల ప్రచారంలో కేటీఆర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, జయశంకర్ భూపాలపల్లి జిల్లాను రద్దు చేయనని ముఖ్యమంత్రి చెబుతున్నారని, అసలు ఆయన రద్దు చేయడానికి, జిల్లాను ఆయన చేశాడా అని ప్రశ్నించారు. జిల్లాను రద్దు చేస్తే భూపాలపల్లి ప్రజలు వీపు చింతపండు చేస్తారని కేటీఆర్ అన్నారు.మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌ను తిడితే ఊరుకునేది లేదని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని హెచ్చరించారు. "నీ టైమ్ అంతా రెండేళ్లే. ఆ తర్వాత గులాబీ జెండా ఎగురుతుంది. ఆ తర్వాత నువ్వు పాతాళంలో దాక్కున్నా వదిలి పెట్టం, పొట్టోడా. కేసీఆర్‌తో పాటు మా కార్యకర్తలను అంటే ఊరుకునేది లేదు" అని అన్నారు. తిడితే తనను, ఇతర నాయకులను తిట్టుకోవచ్చని, కానీ కేసీఆర్‌ను, బీఆర్ఎస్ కార్యకర్తలను తిడితే మాత్రం ఊరుకునేది లేదని హెచ్చరించారు. ఎంతమంది దేవుళ్లు ఉంటే అంతమంది దేవుళ్లను మొక్కుకున్నా అధికారంలోకి వచ్చాక వదిలి పెట్టేది లేదని అన్నారు. ఆయన పేరు అనుముల రేవంత్ రెడ్డి కాదని, లాగుల తొండల్ రెడ్డి అని ఎద్దేవా చేశారు. కాంగ్రెస్ నేతలు రాష్ట్రంలో పాలన పక్కకు పెట్టి కుంభకోణాలకు తెరలేపారని ఆరోపించారు. అధికారంలోకి వచ్చి రెండేళ్లు దాటినా ఇప్పటి వరకు ఒక్క అభివృద్ధి పని కూడా జరగలేదని విమర్శించారు.సింగరేణిని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, బావమరిది కలిసి దోచుకున్నారని ఆరోపించారు. కాంగ్రెస్ పార్టీకి ఓటేస్తే ప్రజలను ఆ పార్టీ నాయకులు ముంచుతారని హెచ్చరించారు. రూ.4 వేల పెన్షన్, తులం బంగారం, రైతుబంధు పెంపు ఏ ఒక్క హామీని నెరవేర్చలేదని మండిపడ్డారు. మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీని ఓడిస్తే హామీలు అమలవుతాయని ఓటర్లకు సూచించారు.

## అమెరికాతో ఉద్రిక్తతలు..

అమెరికాతో తీవ్ర ఉద్రిక్తతలు నెలకొన్న వేళ ఇరాన్‌లో ఒక అనూహ్య పరిణామం చోటుచేసుకుంది. దేశ సుప్రీం లీడర్ అయతొల్లా అలీ ఖమేనీ 37 ఏళ్లుగా పాటిస్తున్న ఒక కీలక సంప్రదాయాన్ని తొలిసారిగా పక్కనపెట్టారు. ప్రతి ఏటా ఫిబ్రవరి 8న జరిగే వైమానిక దళ కమాండర్ల సమావేశానికి ఆయన గైర్హాజరయ్యారు. 1989లో నాయకత్వ పగ్గాలు చేపట్టినప్పటి నుంచి ఖమేనీ ప్రతి సంవత్సరం ఈ సమావేశానికి హాజరవుతూ వస్తున్నారు. ఇరాన్ ఇంటర్నేషనల్ కథనం ప్రకారం కరోనా మహమ్మారి విజృంభణ సమయంలో కూడా ఆయన ఈ సమావేశాన్ని నిర్వహించారు.1979 ఫిబ్రవరి 8న ఇరాన్ ఎయిర్‌ఫోర్స్ అధికారులు పహ్లవి రాజవంశాన్ని కూలదోసి, ఇస్లామిక్ రిపబ్లిక్ వ్యవస్థాపకుడు అయతొల్లా రుహోల్లా ఖమేనీకి మద్దతు ప్రకటించారు. ఆ చారిత్రక ఘటనకు గుర్తుగా ఏటా ఈ తేదీన వైమానిక దళ ఉన్నతాధికారులు సుప్రీం లీడర్‌తో భేటీ అవుతారు. ఈ ఏడాది ఖోమేనీకి బదులుగా ఆర్మీ చీఫ్ అబ్దొల్‌రహీం మౌసవి కమాండర్లతో సమావేశమయ్యారు.

**అమెరికాతో పెరుగుతున్న ఉద్రిక్తతలు**

ఖమేనీ గైర్హాజరు వెనుక అమెరికాతో పెరుగుతున్న ఉద్రిక్తతలే కారణమని అంతర్జాతీయంగా విశ్లేషణలు వెలువడుతున్నాయి. గల్ఫ్ ప్రాంతంలో అమెరికా తన సైనిక ఉనికిని భారీగా విస్తరిస్తోంది. తమపై అమెరికా దాడి చేస్తే, ఈసారి యుద్ధం మధ్యప్రాచ్యం మొత్తం విస్తరిస్తుందని ఇరాన్ ఇప్పటికే హెచ్చరించింది. గతేడాది జూన్‌లో ఇరాన్-ఇజ్రాయెల్ మధ్య 12 రోజుల పాటు జరిగిన యుద్ధాన్ని ఈ సందర్భంగా గుర్తుచేస్తున్నారు.

ఉద్రిక్తతల నేపథ్యంలో అమెరికా తన యూఎస్ఎస్ అబ్రహం లింకన్ విమాన వాహక నౌకను అరేబియా సముద్రానికి పంపింది. డజను ఎఫ్-15 ఫైటర్ జెట్లు, ఎంక్యూ-9 రీపర్ డ్రోన్లు, ఇతర యుద్ధ విమానాలు జోర్డాన్‌లోని వైమానిక స్థావరానికి చేరుకున్నాయని బీబీసీ తన కథనంలో పేర్కొంది. యూఎస్ఎస్ డెల్బర్ట్ డి బ్లాక్ యుద్ధనౌక సూయజ్ కాలువ ద్వారా ఎర్ర సముద్రంలోకి ప్రవేశించినట్టు శాటిలైట్ చిత్రాలను విశ్లేషించి వెల్లడించింది. గల్ఫ్ ప్రాంతంలో నిఘా కోసం పలు డ్రోన్లు, నిఘా విమానాలు కూడా తిరుగుతున్నట్టు సమాచారం. ఇరాన్ క్షిపణి వ్యవస్థపై చర్చ జరగాలని అమెరికా పట్టుబట్టడం, తాము కేవలం అణు కార్యక్రమంపైనే చర్చిస్తామని ఇరాన్ స్పష్టం చేయడంతో ఇరు దేశాల మధ్య ప్రతిష్టంభన కొనసాగుతోంది.

## తొలి ఎన్నికల బరిలో విజయ్.. రెండు నియోజకవర్గాల నుంచి పోటీ!

నటుడు, తమిళగ వెట్రి కజగం (టీవీకే) అధ్యక్షుడు విజయ్ తన రాజకీయ అరంగేట్రానికి పక్కా ప్రణాళికతో సిద్ధమవుతున్నారు. రాబోయే తమిళనాడు అసెంబ్లీ ఎన్నికల్లో ఆయన రెండు నియోజకవర్గాల నుంచి పోటీ చేయాలని నిర్ణయించినట్లు తెలుస్తోంది. చెన్నైలోని విరుగంబాక్కం, మధ్య తమిళనాడులోని తిరుచ్చి తూర్పు స్థానాల నుంచి ఆయన బరిలోకి దిగనున్నట్లు పార్టీ వర్గాలు వెల్లడించాయి.ఇది పార్టీ విస్తరణతో పాటు వ్యవస్థాపకుడైన విజయ్‌కు బలమైన ఆరంభం ఇచ్చేందుకు రూపొందించిన వ్యూహమని టీవీకే నేతలు చెబుతున్నారు. చెన్నైలోని విరుగంబాక్కం నియోజకవర్గం పట్టణ ఓటర్లు, మొదటిసారి ఓటు వేయనున్న యువతలో విజయ్‌కు మంచి ప్రచారం కల్పిస్తుందని అంచనా వేస్తున్నారు. మరోవైపు తిరుచ్చి తూర్పు నుంచి పోటీ చేయడం ద్వారా పార్టీ కేవలం చెన్నైకే పరిమితం కాదనే సంకేతాన్ని రాష్ట్రవ్యాప్తంగా పంపాలని లక్ష్యంగా పెట్టుకున్నారు.వాస్తవానికి వెలచ్చేరి, విక్రవాండి, నాగపట్టణం వంటి నియోజకవర్గాలను కూడా పరిశీలించినా, ఓటర్లతో ఉన్న పరిచయం, క్షేత్రస్థాయిలో పార్టీ సన్నద్ధత ఆధారంగా విరుగంబాక్కం, తిరుచ్చి తూర్పు స్థానాలను ఖరారు చేసినట్లు సమాచారం. విజయ్ తొలిసారి ఎన్నికల్లో పోటీ చేస్తుండటం, అధికార డీఎంకే బలంగా ఉండటంతో గెలుపు అవకాశాలను పెంచుకునేందుకే రెండు చోట్ల పోటీ చేయాలనే జాగ్రత్తతో కూడిన నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది.

ప్రస్తుతం విరుగంబాక్కం, తిరుచ్చి తూర్పు నియోజకవర్గాలకు డీఎంకే ఎమ్మెల్యేలు ఏ.ఎం.వి. ప్రభాకర రాజా, ఇనిగో ఎస్. ఇరుదయరాజ్ ప్రాతినిధ్యం వహిస్తున్నారు. దీంతో ఈ రెండు చోట్లా పోటీ ఆసక్తికరంగా మారనుంది. త్వరలోనే విజయ్ తన ప్రచార వ్యూహాలను ప్రకటించి, బహిరంగ సభలను ముమ్మరం చేయనున్నారు.

## ఎంఐఎం మద్దతు లేకుండా కాంగ్రెస్ గెలిచిందా?

- మొదటి పేజీ తరువాయి
అని ప్రశ్నించారు. మున్సిపల్ ఎన్నికల్లో ఎంఐఎం సత్తా ఏమిటో చూపుతామని అన్నారు. మరోవైపు అసోం సీఎం హిమంత బిశ్వపై హైదరాబాద్ పోలీసులకు ఒవైసీ ఫిర్యాదు చేశారు. ముస్లింలను కాల్చుతున్నట్టుగా ఉన్న వీడియోను పోస్టు చేసినందుకు ఆయనపై చర్యలు తీసుకోవాలని ఒవైసీ అన్నారు. ముస్లింలను రెచ్చగొట్టేందుకు దురుద్దేశపూర్వకంగా ఈ వీడియోను హిమంత పోస్టు చేశారని మండిపడ్డారు. జాతీయ సమైక్యతకు విఘాతం కలిగించేలా ఆయన తీరు ఉందని విమర్శించారు.

## 'పరీక్షా పే చర్చ'లో దేశ నిర్మాణంపై విద్యార్థులకు మోదీ పాఠాలు

10, 12వ తరగతి విద్యార్థులు ఇప్పటి నుంచే 'వికసిత భారత్' నిర్మాణం గురించి ఆలోచిస్తుండటం పట్ల ప్రధాని నరేంద్ర మోదీ హర్షం వ్యక్తం చేశారు. కేవలం పరీక్షలకే పరిమితం కాకుండా దేశ భవిష్యత్తు లక్ష్యాలపై యువత దృష్టి సారించడం గొప్ప విషయమని ఆయన అన్నారు. ఇవాళ 'పరీక్షా పే చర్చ 2026' రెండో ఎపిసోడ్‌లో భాగంగా ఆయన దేశవ్యాప్తంగా విద్యార్థులతో ముచ్చటించారు.ఈ కార్యక్రమంలో తమిళనాడులోని కోయంబత్తూరుతో పాటు పలు ప్రాంతాల విద్యార్థులతో ప్రధాని సంభాషించారు. 2047 నాటికి దేశాభివృద్ధికి దోహదపడాలనే విద్యార్థుల ఆసక్తిని ఆయన అభినందించారు. ఈ సందర్భంగా అభివృద్ధి చెందిన దేశాల పౌరులలో ఉండే క్రమశిక్షణను అలవర్చుకోవాలని సూచించారు. "ఇంట్లో భోజనం చేసేటప్పుడు ప్లేటులో ఒక్క మెతుకు కూడా వృథా చేయకుండా తినడం అలవాటు చేసుకోండి. ఇలా దేశంలోని ప్రతి ఒక్కరూ చేస్తే ఎంత ఆహారం ఆదా అవుతుందో ఊహించండి. ఇలాంటి చిన్న పనులే బలమైన, బాధ్యతాయుతమైన భారత నిర్మాణానికి పునాదులు వేస్తాయి" అని మోదీ విద్యార్థులకు వివరించారు.

అలాగే ట్రాఫిక్ సిగ్నల్ వద్ద రెడ్ లైట్ పడినప్పుడు ఆగడం వంటి చిన్న విషయాలు కూడా వ్యక్తిగత క్రమశిక్షణకు నిదర్శనమని ప్రధాని తెలిపారు. స్ఫూర్తి, ప్రేరణ వంటివి విజయానికి కేవలం అదనపు హంగులు మాత్రమేనని, కానీ క్రమశిక్షణే దానికి అసలైన పునాది అని ఆయన స్పష్టం చేశారు. తొమ్మిదో విడతగా జరుగుతున్న ఈ కార్యక్రమానికి 4.5 కోట్లకు పైగా రిజిస్ట్రేషన్లు రావడం విశేషం. పరీక్షల ఒత్తిడిని తగ్గించడంతో పాటు దేశ ప్రగతిలో తమ పాత్ర గురించి విద్యార్థులను ఆలోచింపజేయడమే ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశం.

## స్పీకర్ ఓం బిర్లాపై అవిశ్వాసానికి విపక్షాల ప్లాన్..

- మొదటి పేజీ తరువాయి
తీర్మానం ప్రవేశపెట్టేందుకు విపక్షాలు సిద్ధమవుతున్నాయి. పార్లమెంట్ సమావేశాల్లో చోటుచేసుకుంటున్న వరుస పరిణామాలు, ఇరుపక్షాల మధ్య అపనమ్మకం ముదరడంతో ఈ నిర్ణయం తీసుకున్నట్టు తెలుస్తోంది.

గత గురువారం ప్రధాని నరేంద్ర మోదీ ప్రసంగించాల్సి ఉండగా, విపక్షాల తీవ్ర నిరసనల మధ్య సభను స్పీకర్ అర్ధాంతరంగా వాయిదా వేశారు. 'ప్రధానిని లక్ష్యంగా చేసుకుని ప్రతిపక్ష ఎంపీలు ఏదో అనుకోనిది చేయొచ్చని సమాచారం అందింది' అని ఓం బిర్లా చెప్పడం వివాదానికి దారితీసింది. అంతకుముందు కొందరు మహిళా ఎంపీలు ప్లకార్డులతో ప్రధాని సీటు వద్దకు (ఆ సమయంలో ప్రధాని అక్కడ లేరు) వెళ్లారు. స్పీకర్ వ్యాఖ్యలను కాంగ్రెస్ నేత ప్రియాంక గాంధీ "పూర్తి అబద్ధాలు" అని కొట్టిపారేశారు. "ప్రధాని ఇప్పుడు స్పీకర్ చాటున దాక్కుంటున్నారు... ఆయనకు ధైర్యం లేదు" అని ఆమె తీవ్రంగా విమర్శించారు.ఈ అవిశ్వాస తీర్మానంలో స్పీకర్‌కు వ్యతిరేకంగా మూడు ప్రధాన అంశాలను ప్రతిపక్షాలు హైలైట్ చేయనున్నాయి. మాజీ ఆర్మీ చీఫ్ జనరల్ ఎంఎం నరవణే రాసిన పుస్తకంలోని కొన్ని భాగాలను చదివేందుకు ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీకి అనుమతి నిరాకరించడం మొదటిది. అదే సమయంలో కాంగ్రెస్‌ను, గాంధీ కుటుంబాన్ని లక్ష్యంగా చేసుకున్న పుస్తకాల నుంచి చదివేందుకు బీజేపీ ఎంపీ నిషికాంత్ దూబేకు అనుమతి ఇవ్వడంపై విపక్షాలు మండిపడుతున్నాయి. నిబంధనలు ఉల్లంఘించిన దూబేపై ఎందుకు చర్యలు తీసుకోలేదని ప్రశ్నిస్తున్నాయి.2020లో భారత్-చైనా సరిహద్దు వివాదంపై ఉన్న ఆ పుస్తక భాగాలను రికార్డుల్లో చేర్చాలని రాహుల్ పట్టుబట్టారు. తాను ఆ సమాచారానికి బాధ్యత వహిస్తానని లిఖితపూర్వకంగా ఇచ్చినా స్పీకర్ అంగీకరించలేదు. దీంతో సభలో తీవ్ర గందరగోళం చెలరేగింది. ఈ క్రమంలో నిరసన తెలిపిన 8 మంది కాంగ్రెస్ ఎంపీలను సమావేశాలు ముగిసే వరకు సస్పెండ్ చేశారు. "రాహుల్ గాంధీకి మాట్లాడే అవకాశం ఇవ్వలేదు. దీనిపై నిరసన తెలిపితే మమ్మల్ని సస్పెండ్ చేశారు. ఇది అంత పెద్ద నేరమా?" అని సస్పెండైన ఎంపీ అమరీందర్ రాజా వారింగ్ ప్రశ్నించారు. ఈ పరిణామాలతో పార్లమెంట్‌లో రాజకీయ వేడి మరింత పెరిగింది.

## పంజాబ్ సీఎం విదేశీ పర్యటనకు అనుమతినివ్వని కేంద్రం

- మొదటి పేజీ తరువాయి
పర్యటన అర్ధాంతరంగా రద్దయింది. ఇటీవల మాన్ విదేశీ పర్యటనలకు అనుమతి నిరాకరించడం ఇది వరుసగా మూడోసారి కావడం గమనార్హం.

పంజాబ్ ప్రభుత్వం వచ్చే నెలలో నిర్వహించ తలపెట్టిన 'ఇన్వెస్టర్స్ సమ్మిట్' కోసం పెట్టుబడులను ఆహ్వానించడానికి భగవంత్ మాన్ చెక్ రిపబ్లిక్ మరియు నెదర్లాండ్స్‌లో పర్యటించాల్సి ఉంది. పారిశ్రామికాభివృద్ధి, విద్య, మరియు విదేశీ పంజాబీల సహకారం కోసమే ఈ పర్యటన ఖరారైంది. అయితే కేంద్రం నుంచి క్లియరెన్స్ రాకపోవడంతో రాష్ట్ర ప్రభుత్వ ప్రయత్నాలకు బ్రేక్ పడింది.

**వివాదాస్పదంగా 'పొలిటికల్ క్లియరెన్స్'**

రాష్ట్రాల ముఖ్యమంత్రులు విదేశాల్లో పర్యటించేందుకు విదేశాంగ శాఖ అనుమతి తీసుకోవడం తప్పనిసరి. దీనినే పొలిటికల్ క్లియరెన్స్ గా వ్యవహరిస్తారు. అయితే, ఈ నిబంధన చుట్టూ వివాదాలు ముసురుకుంటున్నాయి. పంజాబ్ విషయానికి వస్తే.. ముఖ్యమంత్రి భగవంత్ మాన్ పర్యటనలపై కేంద్రం వరుసగా ఆంక్షలు విధిస్తోంది. పొలిటికల్ క్లియరెన్స్ నిరాకరిస్తోంది. ఈ ఏడాది జనవరిలో యూకే మరియు ఇజ్రాయెల్ లో పర్యటించేందుకు మాన్ అనుమతి కోరగా నిరాకరించింది. గతంలో పారిస్ ఒలింపిక్స్ సందర్శనకూ ఇలాగే అడ్డుచెప్పడంతో ఆ పర్యటన రద్దయింది. తాజాగా చెక్ రిపబ్లిక్, నెదర్లాండ్స్ పర్యటనకూ మాన్ కు కేంద్రం అనుమతి ఇవ్వలేదు. అయితే, ఈ అనుమతిని నిరాకరించడానికి గల కారణాలను విదేశాంగ శాఖ బహిరంగంగా వెల్లడించలేదు. ఈ వ్యవహారం ఇప్పుడు కేంద్ర-రాష్ట్ర సంబంధాల మధ్య మరోసారి చిచ్చు రేపింది.

**కేంద్రంపై 'ఆప్' విమర్శ**

కేంద్ర ప్రభుత్వ వైఖరిని ఆమ్ ఆద్మీ పార్టీ(ఆప్) తీవ్రంగా ఖండించింది. ప్రతిపక్ష పార్టీలు అధికారంలో ఉన్న రాష్ట్రాల అభివృద్ధిని కేంద్రం ఉద్దేశపూర్వకంగా అడ్డుకుంటోందని ఆప్ నేతలు మండిపడుతున్నారు. ఇతర రాష్ట్రాల ముఖ్యమంత్రులు విదేశాలకు వెళ్తున్నప్పుడు పంజాబ్ సీఎంకు మాత్రమే అనుమతి ఎందుకు ఇవ్వడంలేదని ప్రశ్నిస్తున్నారు.



స్వామివారికి అదనపు కలెక్టర్ మరియు కలెక్టర్ ప్రత్యేక పూజలు..

# పెన్ పవర్

## తెలంగాణ రౌండప్

కీసర రామలింగేశ్వర స్వామి ఆలయాన్ని సందర్శించిన కలెక్టర్..



# కీసర బ్రహ్మోత్సవాలకు పటిష్ఠ ఏర్పాట్లు

## సామాన్య భక్తులకు ఇబ్బంది లేకుండా చర్యలకు కలెక్టర్ మను ఆదేశాలు..

మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా కీసర శ్రీ రామలింగేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలలో వివిపి దర్శనాలతో సామాన్య భక్తులకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా ఉండేందుకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా కలెక్టర్ మను చౌదరి ఆదేశించారు.. కీసర శ్రీ రామలింగేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు ఈనెల 13వ తేదీ నుంచి 18వ తేదీ వరకు జరగనున్న నేపథ్యంలో అడిషనల్ కలెక్టర్ డి.విజయేందర్ రెడ్డితో కలిసి కలెక్టర్ మిక్కిలినేని మను చౌదరి సోమవారం కీసర గుట్టను సందర్శించారు.. వారితో మల్కాజ్గిరి డిసిపి శ్రీధర్ , ట్రాఫిక్ డిసిపి రాహుల్ రెడ్డి ఐపీఎస్, ఆర్డిఓ రాజేష్, ఆలయ కమిటీ చైర్మన్ తటాకం వెంకటేశ్, ఆలయ ఈవో సుధాకర్‌రెడ్డి లతో కలిసి ఏర్పాట్లను పరిశీలించారు.. ఈ సందర్భంగా ఆలయ పండితులు పూర్ణ కుంభంతో కలెక్టర్‌కు స్వాగతం పలికారు..అడిషనల్ కలెక్టర్ డి.విజయేందర్‌రెడ్డితో కలిసి, కలెక్టర్ మిక్కిలినేని మను చౌదరి స్వామివారికి ప్రత్యేకపూజలు నిర్వహించారు.. అనంతరం ఆలయ ప్రధాన అర్చకులు, అదనపు కలెక్టర్, కలెక్టర్‌కి శాస్త్రోక్తంగా వేద మంత్రోచ్ఛరణలతో ఆశీర్వదించి, శాలువాలతో సత్కరించారు..



పూర్ణ కుంభంతో స్వాగతం పలికిన వేదపండితులు..



మిక్కిలినేని మను చౌదరి.. కలెక్టర్ మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా..

-4లో

### అదనంగా ఆర్టీసీ బస్సులు..! పటిష్ఠ భద్రత..

అనంతరం ఆలయ ప్రాంగణంలోని సమావేశ మందిరంలో, నిర్వహించిన సమీక్షలో కలెక్టర్ మాట్లాడుతూ బ్రహ్మోత్సవాలకు వచ్చే భక్తులకు సౌకర్యవంతంగా ఉండేందుకు క్యూలైన్ లను పెంచాలన్నారు.. వివిధ ప్రాంతాల నుంచి భక్తులు ఎక్కువగా వచ్చే అవకాశం ఉన్నందున ఆర్టీసీ బస్సులు అదనంగా కేటాయించాలని ఆదేశించారు.. భద్రతా లోపాలు తలెత్తకుండా పోలీస్ శాఖ పటిష్ట బందోబస్తు నిర్వహించాలని సూచించారు.. భక్తులకు అత్యవసర చికిత్సకై అవసరమైన వైద్య సిబ్బంది, మందులు అందుబాటులో ఉండాలన్నారు. బ్యారికేడ్, దర్శనం క్యూ లైన్, పార్కింగ్‌కు ప్రత్యేక ఏర్పాట్లు చేయాలని, ప్రస్తుతం రోజురోజుకు ఎండలు పెరుగుతున్నాయని అందుకు జాతరలో భక్తులకు అందుబాటులో అవసరమైన అన్ని చోట్ల త్రాగునీటిని అందుబాటులో ఉంచాలని వాటర్ వర్క్స్ విభాగానికి తెలిపారు..

- ఈనెల 13 నుంచి 18 వరకు కీసర శ్రీ రామలింగేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు..
- అదనపు కలెక్టర్‌తో కలిసి ఏర్పాట్లను స్వయంగా పరిశీలించిన కలెక్టర్..
- ఆలయ ప్రధాన అర్చకులు పూర్ణ కుంభంతో కలెక్టర్ మను చౌదరికి స్వాగతం పలికారు..
- రామలింగేశ్వర స్వామివారికి కలెక్టర్, ప్రత్యేక పూజలు నిర్వహించారు..
- అడిషనల్ కలెక్టర్ విజయేందర్‌రెడ్డి, కలెక్టర్ మను చౌదరిని సన్మానించి, ఆశీర్వాదం..
- క్యూలైన్‌ల విస్తరణ, అదనపు ఆర్టీసీ బస్సులు, పటిష్ట పోలీస్ భద్రతకు ఆదేశాలు..
- అత్యవసర వైద్య సేవలు, త్రాగునీరు, పార్కింగ్, శానిటేషన్‌పై ప్రత్యేక దృష్టి..!
- వృద్ధులు, దివ్యాంగులకు ప్రత్యేక వాహన సదుపాయం కల్పించాలని సూచనలు..!
- జాతరలో ధరల నియంత్రణ, అగ్నిమాపక ఏర్పాట్లు తప్పనిసరి చేయాలని ఆదేశాలు..
- అధికారులు, ప్రజాప్రతినిధులు బ్రహ్మోత్సవాలు విజయవంతం చేయాలి..
- మహాశివరాత్రి సందర్భంగా కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లకు కలెక్టర్ ఆదేశాలు..

01

ఇప్పుడు పెన్ పవర్ దిన పత్రికలో

క్లాసీఫైడ్ యాడ్స్

కేవలం

యాడ్ 100/-కే

'ఐదు రోజులకు'

'4 సెం.మీ 4 సెం.మీ'

'మరిన్ని వివరాలకు సంప్రదించండి'

93948 55244

షరతులు వర్తిస్తాయి

# ధనవంతులు, గుణవంతులకు మధ్య పోటీ



కరీంనగర్: పెన్ పవర్:ఇచ్చిన హామీలు, గ్యారంటీలను కాంగ్రెస్ పార్టీ అమలు చేయడం లేదని కేంద్రమంత్రి బండి సంజయ్ విమర్శించారు. కరీంనగర్‌లో జరుగుతున్న మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికల్లో ధనవంతులు, గుణవంతులకు మధ్య పోటీ జరుగుతోందని చెప్పారు. నగరంలోని పలు ప్రాంతాల్లో భాజపా నేతలతో కలిసి ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. కరీంనగర్ అభివృద్ధికి స్థానికులు సహకరించి కమలం గుర్తుపై ఓటు వేయాలని కోరారు. కాంగ్రెస్ పార్టీకి ఓటేస్తే పన్నులు పెంచుతారన్నారు.

# మేడారం హుండీల లెక్కింపు... ఐదు రోజుల్లో రూ.11.83 కోట్ల ఆదాయం

- ఐదు రోజుల్లో 788 హుండీల లెక్కింపు
- 163 హుండీలను లెక్కించగా 1.12 కోట్ల ఆదాయం
- మిగిలిన హుండీల లెక్కింపునకు మరో రెండు రోజులు పట్టే అవకాశం

హైదరాబాద్ పెన్ పవర్:మేడారం సమ్మక్క సారక్క జాతరకు సంబంధించిన హుండీల లెక్కింపు కొనసాగుతోంది. నేటితో హుండీల లెక్కింపు ఐదో రోజుకు చేరుకుంది. ఇప్పటి వరకు 788 హుండీలను లెక్కించగా రూ.11.83 కోట్ల ఆదాయం వచ్చింది. 163 హుండీలను లెక్కించగా రూ.1.12 కోట్ల ఆదాయం సమకూరింది. మిగిలిన హుండీల లెక్కింపునకు సుమారు రెండు రోజులు పట్టవచ్చునని అధికారులు అంచనా వేస్తున్నారు.మంత్రి కొండా సురేఖ గత గురువారం కొబ్బరికాయ కొట్టి హుండీల లెక్కింపును ప్రారంభించారు. క్రితంసారి మేడారం జాతర ద్వారా రూ.13 కోట్ల ఆదాయం సమకూరింది. హన్మకొండలోని టీటీడీ కళ్యాణ మండపంలో లెక్కిస్తున్నారు. హుండీల లెక్కింపు పూర్తయ్యాక బంగారం, వెండి వస్తువుల విలువను నిర్ధారిస్తారు.



# కీసర బ్రహ్మోత్సవాలకు పటిష్ట ఏర్పాట్లు..


వేద మంత్రోచ్ఛారణల నడుమ ఆశీర్వచనాలు, శాలువాలతో సత్కారం..


ఆలయ ప్రాంగణంలో జిల్లా ఉన్నతాధికారులతో పర్యటిస్తున్న కలెక్టర్ మను..

## వృద్ధులు, దివ్యాంగులలకు ప్రత్యేక వాహన సదుపాయం

కీసర రామలింగేశ్వర స్వామివారి దర్శనార్థం జాతరలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొనే అవకాశం ఉన్నందున.. భక్తులకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా పటిష్టమైన ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు. దర్శనార్థం వచ్చే వృద్ధులు దివ్యాంగులకు ప్రత్యేక వాహన సదుపాయం కల్పించాలని ట్రాఫిక్ పోలీస్ అధికారులకు సూచించారు. జాతరలో పరిశుభ్రమైన వాతావరణం ఉండేలా చూడాలని అందుకు సంబంధించి ఎప్పటికప్పుడు శానిటేషన్ చేయాలని ఈ విషయంలో అవసరమైన ప్రత్యేక ఏర్పాట్లు చేయాల్సిందిగా కలెక్టర్ తెలిపారు..

## అధిక ధరల నియంత్రణకు చర్యలు..

కీసర గుట్ట బ్రహ్మోత్సవాల జాతరలో పూజ సామాగ్రి , ఆహార పదార్థాల నుంచి మొదలుకొని అన్ని రకాల వస్తువుల విక్రయానికి సంబంధించి ధరలు భక్తులకు అందుబాటులో ఉండేలా చూడాలని, ఎక్కువ ధరలకు విక్రయించకుండా అవసరమైన చర్యలు తీసుకోవాల్సిందిగా సంబంధిత శాఖ అధికారులు వ్యాపారులకు తెలపాలన్నారు. జాతర రోజుల్లో ఆలయ పరిసరాల్లో అగ్నిమాపక సిబ్బందితో పాటు ఫైరింజన్‌ను అందుబాటులో ఉంచాలని కలెక్టర్ మను చౌదరి సూచించారు.. ఈ సందర్భంగా కీసర ఆలయానికి సంబంధించి ఏమైనా ఇబ్బందులు, సమస్యలు ఉన్నట్లయితే తన దృష్టికి తీసుకురావాలని ఆలయ ఈవో, ఛైర్మన్‌కు తెలిపారు.. మహాశివరాత్రికి కీసరగుట్టలో రామలింగేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలను అధికారులు, ప్రజాప్రతినిధులు కలిసి విజయవంతం చేయాలని కలెక్టర్ సమావేశంలో స్పష్టం చేశారు.. ఈ సమీక్ష సమావేశంలో జిల్లా అధికారులు, సంబంధిత శాఖల అధికారులు, ఆలయ కమిటీ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.


భద్రతా ఏర్పాట్లపై కలెక్టర్ మను చౌదరి సూచనలు సలహాలు..



- హకీంపేట్‌లో స్పోర్ట్స్ అథారిటీ ఆధ్వర్యంలో ఉత్సాహంగా పోటీలు ప్రారంభం..!
- 500 మంది క్రీడాకారులు పాల్గొన్నట్లు నిర్వాహకులు తెలిపారు..
- తెలంగాణ ప్రభుత్వం, స్పోర్ట్స్ అథారిటీ ఆధ్వర్యంలో జిల్లా స్థాయి పోటీలు ప్రారంభం.
- కబడ్డి, వాలీబాల్, కోకో, ఫుట్‌బాల్, సైక్లింగ్ పోటీలు నిర్వహణ..
- విజేతలకు రాష్ట్రస్థాయికి అవకాశం, నగదు బహుమతుల ప్రకటన..
- మొదటి బహుమతి రూ.1 లక్ష, రెండోది రూ.75 వేలు, మూడోది రూ.50 వేలు..



అడిషనల్ కలెక్టర్ డి.విజయేందర్‌రెడ్డి.


క్రీడాకారులతో అదనపు కలెక్టర్ విజయేందర్‌రెడ్డి..

# చీఫ్ మినిస్టర్ కప్ 2025..!

# జిల్లా స్థాయి క్రీడోత్సవాలు ప్రారంభం..!





## ముఖ్య అతిథిగా మేడ్చల్ జిల్లా అడిషనల్ కలెక్టర్ విజయేందర్‌రెడ్డి..

**మేడ్చల్ జిల్లా బ్యూరో, పెన్ పవర్, ఫిబ్రవరి 9:** తెలంగాణ ప్రభుత్వం మరియు స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ తెలంగాణ సంయుక్తంగా నిర్వహిస్తున్న "చీఫ్ మినిస్టర్ కప్2025" జిల్లా స్థాయి క్రీడోత్సవాలు తెలంగాణ స్పోర్ట్స్ స్కూల్, హకీంపేట్‌లో సోమవారం ఘనంగా ప్రారంభమయ్యాయి.. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మేడ్చల్ జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) డి.విజయేందర్ రెడ్డి, తెలంగాణ స్పోర్ట్స్ స్కూల్ ఓఎస్‌డీ శ్రీమతి మమత, జిల్లా విద్యాశాఖ అధికారి శ్రీమతి ఐ.విజయ కుమారి తదితరులు హాజరై పోటీలను ప్రారంభించారు.. ప్రారంభించిన తొలిరోజు కబడ్డి, వాలీబాల్, కోకో, ఫుట్‌బాల్ మరియు సైక్లింగ్ విభాగాల్లో పోటీలు నిర్వహించగా, సుమారు 500 మంది క్రీడాకారులు ఉత్సాహంగా పాల్గొన్నారు.. ఈ పోటీల్లో విజేతలైన క్రీడాకారులను రాష్ట్ర స్థాయి క్రీడా పోటీలకు ఎంపిక చేసి పంపించనున్నట్లు మేడ్చల్‌మల్కాజ్‌గిరి జిల్లా యువజన మరియు క్రీడల అధికారి ఒక ప్రకటనలో తెలిపారు.. రాష్ట్రస్థాయిలో విజయం సాధించిన క్రీడాకారులకు ఆకర్షణీయమైన నగదు బహుమతులు ప్రకటించగా, మొదటి బహుమతి రూ. 1 లక్ష, రెండో బహుమతి రూ. 75 వేల, మూడో బహుమతి రూ. 50 వేలగా నిర్ణయించినట్లు వెల్లడించారు.. జిల్లాలో క్రీడల ప్రోత్సాహానికి ఈ క్రీడోత్సవాలు దోహదపడతాయని అధికారులు ఆశాభావం వ్యక్తం చేశారు..

# ఫోరెన్సిక్ సైన్స్ ల్యాబొరేటరీ ప్రమాదం.. అన్నీ అనుమానాలే

**హైదరాబాద్, ఫిబ్రవరి 9, పెన్ పవర్:**
హైదరాబాద్‌లోని స్టేట్ ఫోరెన్సిక్ సైన్స్ ల్యాబొరేటరీ లో జరిగిన అగ్నిప్రమాదం సంచలనంగా మారింది. ఈ ప్రమాదంలో ముఖ్యంగా కంప్యూటర్ ల్యాబ్ విభాగం పూర్తిగా దగ్ధమవ్వడంపై పలు అనుమానాలు
వ్యక్తమవుతున్నాయి. రాష్ట్ర రాజకీయాలను కుదిపేసిన ఫోన్ ట్యాపింగ్, గతంలో ప్రకంపనలు సృష్టించిన ఓటుకు నోటు కేసులకు సంబంధించిన అత్యంత కీలకమైన డిజిటల్ సాక్ష్యాలు, ఆడియో రికార్డింగ్‌లు ఈ ల్యాబ్‌లోనేఉన్నట్లు ప్రచారం జరుగుతోంది. ఈ కీలక సాక్ష్యాలన్నీ కాలిపోయాయన్న ప్రచారం జరుగుతోంది.పోలీసులు ధృవీకరించడం లేదు కానీ.. కీలక కేసుల సాక్ష్యాలు కాలిపోయాయని చెబుతున్నారు. ముఖ్యంగా ఫోన్ ట్యాపింగ్‌కేసులో స్వాధీనం చేసుకున్న హార్డ్ డిస్క్‌లు, నిందితుల నుంచి సేకరించిన ఎలక్ట్రానిక్ పరికరాల విశ్లేషణ ప్రక్రియ ప్రస్తుతం ఈ ల్యాబ్‌లోనే కొనసాగుతోంది. అలాగే, ఓటుకు నోటు కేసులో కీలకమైన వాయిస్ శాంపిల్స్‌నివేదికలు కూడా ఇక్కడే భద్రపరిచినట్లు సమాచారం. అకస్మాత్తుగా కంప్యూటర్ ల్యాబ్‌లోనే మంటలు చెలరేగడం, ఇతర విభాగాల కంటే డేటా సెంటర్ ఉన్న ప్రాంతంలోనే నష్టం ఎక్కువగా జరగడంతో.. సాక్ష్యాలను రూపుమాపడానికి ఎవరైనా కావాలనే ఈ ప్రమాదానికి పాల్పడ్డారా? అనే కుట్ర కోణం పై పోలీసులు లోతుగా విచారిస్తున్నారుసాక్ష్యాలు బుగ్గిపాలు కావడం వల్ల ఈ ప్రతిష్టాత్మక కేసుల విచారణ గందరగోళంలో పడే అవకాశంఉంది. డిజిటల్ డేటాకు బ్యాకప్ లేకపోతే, నేరస్తులను కోర్టులో బోనులో నిలబెట్టడానికి అవసరమైన శాస్త్రీయ ఆధారాలు కనుమరుగయ్యే ప్రమాదం ఉందని న్యాయ నిపుణులు చెబుతున్నారు. క్లూస్ టీమ్ ,ఐటీనిపుణులు కాలిపోయిన హార్డ్ డిస్క్‌ల నుంచి కనీసం కొంత సమాచారాన్నైనా రికవరీ చేయగలమా అనే ప్రయత్నాల్లో నిమగ్నమయ్యారు.




02
ఇప్పుడు పెన్ పవర్ దిన పత్రికలో
శుభాకాంక్షలు యాడ్స్
కేవలం
యాడ్ 300/-
'పోస్టుకార్డు సైజు '
'పొ. 12 సెం.మీ, వె.16 సెం.మీ'
'మరిన్ని వివరాలకు సంప్రదించండి '
93948 55244
షరతులు వర్తిస్తాయి

## కొత్తగూడ అడవిలో భారీ అగ్నిప్రమాదం

**వర్ధన్నపేట, ఫిబ్రవరి 9 పెన్ పవర్:**మహబూబాబాద్ జిల్లా కొత్తగూడ మండల కేంద్రం సపంలోని అడవిలో సోమవారం భారీగా మంటలు చెలరేగాయి. ఎండుగడ్డి, ఆకులతో అడవి నిప్పుల కొలిమిలా మారడంతో మూగజీవాలు బుగ్గి పాలవుతున్నాయి. అటవీ శాఖ అధికారులు వెంటనే స్పందించి మంటలను అదుపులోకి తీసుకురావాలని స్థానికులు కోరుతున్నారు. ఈ అగ్నిప్రమాదం మండల కేంద్రం నుండి గుంజేడుకు వెళ్లే ప్రధాన రహదారిలో సంభవించింది.

## కేటీఆర్‌పై తీవ్ర విమర్శలు గుప్పించిన ఎమ్మెల్యే నాగరాజు

**నర్సంపేట, ఫిబ్రవరి 9 పెన్ పవర్:** వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు, మాజీ మంత్రి కేటీఆర్‌పై సోమవారం తీవ్ర విమర్శలు గుప్పించారు. గతంలో అభిప్రాయ సేకరణ లేకుండానే తండాలను మున్సిపాలిటీలో కలిపారని, ఇప్పుడు వారే విమర్శలు చేస్తున్నారని ఆయన ఆరోపించారు. వర్ధన్నపేట మున్సిపాలిటీ పరిధిలో దళిత బంధు కింద 10 లక్షలు ఇస్తామని చెప్పి, ఎంతమందికి ఇచ్చారో చెప్పాలని ప్రశ్నించారు. వర్ధన్నపేటలో దొర అహంకారంతో కేటీఆర్ ఇష్టం వచ్చినట్లు మాట్లాడారని ఎమ్మెల్యే నాగరాజు ధ్వజమెత్తారు.

## ప్రచారంలో దూకుడు పెంచిన నేతలు

**పరకాల, ఫిబ్రవరి 9 పెన్ పవర్:** నర్సంపేట మున్సిపల్ ఎన్నికల చివరి రోజు ప్రచారం హోరాహోరీగా సాగింది. 25వ వార్డు కౌన్సిలర్ అభ్యర్థి నాడెం లక్ష్మీ శాంతి కుమార్ ఇంటింటి ప్రచారం నిర్వహించి మద్దతు కోరారు. మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్ రెడ్డి శాంతి కుమార్ కు మద్దతుగా నిలిచారు. కార్యకర్తల ఉత్సాహం, నాయకుల హాజరుతో ఎన్నికల వేడి పెరిగింది. ప్రచారం ముగింపు దశకు చేరుకోవడంతో అభ్యర్థులు ఓటర్లను ఆకట్టుకునేందుకు తీవ్రంగా ప్రయత్నిస్తున్నారు.

## నీటి సమస్యకు చెక్ పెట్టిన మున్సిపాలిటీ సిబ్బంది

**ములుగు, ఫిబ్రవరి 9 పెన్ పవర్:** వర్ధన్నపేట నియోజకవర్గం 46 డివిజన్ పరిధిలోని ఖండాల డాబా వద్ద గత వారం రోజులుగా మున్సిపాలిటీ త్రాగునీటి సరఫరా పైపు లీకై నీరు వృధాగా పోతోందని స్థానికులు ఫిర్యాదు చేశారు. దీనిపై స్పందించిన కాజీపేట మండలం మున్సిపాలిటీ సిబ్బంది సోమవారం మరమ్మత్తు పనులు చేపట్టారు. చుట్టుపక్కల షాపుల వద్ద అధిక లోడుతో వచ్చే వాహనాలు గంటల తరబడి పార్క్ చేయడం వల్ల ఈ సమస్య తలెత్తిందని, రోడ్డు నుంచి ఐదు అడుగుల వరకు సీసీ రోడ్డు నిర్మాణం చేపడితే సమస్య పరిష్కారమవుతుందని స్థానికులు తెలిపారు.

## రేవంత్ రెడ్డి మెదక్‌కు వచ్చేందుకు భయపడుతున్నారు

**మెదక్, ఫిబ్రవరి 9( పెన్ పవర్:** రెండేళ్ల కాంగ్రెస్ పాలనలో అభివృద్ధి శూన్యమని మాజీ మంత్రి హరీశ్ రావు విమర్శించారు. 420 హామీలు ఇచ్చి ఒక్క హామీ అమలు చేయకుండా మోసం చేశారని మండిపడ్డారు. సిద్దిపేట జిల్లా దుబ్బాక మున్సిపాలిటీ చెల్లాపూర్ వార్డులో ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డితో కలిసి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. మెదక్ రావాలంటే రేవంత్ రెడ్డికి భయం పట్టుకుందన్నారు. అన్ని జిల్లాలు తిరుగుతున్నా ఉమ్మడి మెదక్‌కు వచ్చేందుకు ముఖం లేదని విమర్శించారు. ఇక్కడ హరీశ్‌రావు ఉన్నాడని భయపడుతున్నారని ఎద్దేవా చేశారు.

## విద్యుత్ ప్రమాదంపై గ్రామస్థుల ఆగ్రహం

**నర్సాపూర్, ఫిబ్రవరి 9 పెన్ పవర్:**రజాక్పల్లి గ్రామంలో ట్రాన్స్‌ఫార్మర్ మరమ్మతుల్లో అధికారుల నిర్లక్ష్యం కారణంగా రైతు వజ్జ పరశురాములు విద్యుత్ షాక్‌కు గురై తీవ్రంగా గాయపడ్డారు. ఈ ప్రమాదంలో ఆయన రెండు చేతులు కాలిపోయాయి. ప్రమాదకర స్థితిలో ఉన్న ట్రాన్స్‌ఫార్మర్‌ను మరమ్మతు చేయాలని పలుమార్లు ఫిర్యాదు చేసినా అధికారులు పట్టించుకోలేదని గ్రామస్థులు ఆరోపించారు. ఈ ఘటనకు నిరసనగా సోమవారం గ్రామస్థులు రోడ్డుపై బైఠాయించి ఆందోళన చేపట్టారు, బాధితుడికి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు.

## నా భర్తను సస్పెండ్ చేశారు..

## బీఆర్ఎస్ అభ్యర్థి ఆవేదన

**సిద్దిపేట, ఫిబ్రవరి 9 పెన్ పవర్:**సిద్దిపేట జిల్లా చేర్యాల మున్సిపాలిటీ 2వ వార్డు నుండి బీఆర్ఎస్ అభ్యర్థిగా కమలాపురం గీతాంజలి పోటీ చేస్తున్నారు. అయితే గీతాంజలి పోటీలో నిల్చుందని తన భర్త రమేష్‌ను కానిస్టేబుల్ విధుల నుండి సస్పెండ్ చేశారని ఆమె ఆందో ళనకు దిగారు. తన భర్త ఎలాంటి ఎన్నికల ప్రచారంలో పాల్గొనలేదన్నారు. తన భర్తను విధుల నుండి సస్పెండ్ చేయడం కాంగ్రెస్ నాయకుల కక్షపూరిత చర్యల్లో భాగమని, వెంటనే సస్పెన్షన్ ఎత్తివేయాలని డిమాండ్ చేస్తూ అంబేద్కర్ విగ్రహానికి వినతి పత్రం ఇచ్చారు.

## డిస్ట్రిబ్యూషన్ పక్రియ సజావుగా జరిగేలా ఏర్పాట్లు చెయ్యాలి

**గజ్వేల్, ఫిబ్రవరి 9 పెన్ పవర్** సిద్దిపేట జిల్లా గజ్వేల్ మున్సిపల్ ఎన్నికలకు సంబంధించి, పట్టణంలోని ఎడ్యుకేషన్ హబ్ లో పోలింగ్ మెటీరియల్ డిస్ట్రిబ్యూషన్ సెంటర్, రిసెప్షన్ సెంటర్, కౌంటింగ్ హాల్, స్ట్రాంగ్ రూమ్ ల ఏర్పాట్లను జిల్లా ఎన్నికల అధికారి కలెక్టర్ హైమావతి క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ నెల 10న పోలింగ్ మెటీరియల్ డిస్ట్రిబ్యూషన్ పక్రియ సజావుగా జరిగేలా, పోలింగ్ స్టేషన్లలో అన్ని సౌకర్యాలు ఉండేలా చర్యలు తీసుకోవాలని ఆమె అధికారులను ఆదేశించారు.

# భారత్ తో మ్యాచ్ పై పాక్ యూ టర్న్..

**లాహోర్, ఫిబ్రవరి9, పెన్ పవర్:**
ఫిబ్రవరి 15న భారత్‌తో జరిగే మ్యాచ్‌ను బహిష్కరించాలని పాకిస్థాన్ ఇప్పటికే నిర్ణయించుకుంది. దీంతో ఈ నిర్ణయం ప్రస్తుతం 2026 టీ20 వరల్డ్‌కప్ మొదలయ్యాక మరోసారి ఉత్కంఠభరితంగా మారింది. ఈ సమస్యను పరిష్కరించేందుకు బంగ్లాదేశ్ క్రికెట్ బోర్డు (బీసీబీ) అధ్యక్షుడు అమీనుల్ ఇస్లాం బుల్బుల్ కీలక సమావేశం కోసం లాహోర్‌కు వెళ్లాడు. బీసీబీ పీసీబీ మధ్య జరగనున్న సమావేశానికి ఇద్దరు ఐసీసీ అధికారులు కూడా లాహోర్‌కు వెళు న్నారు.భద్రతా కారణాలు చూపిస్తూ, గ్రూప్ దశ మ్యాచ్‌ల కోసం భారతదేశానికి తమ జాతీయ జట్టును పంపేందుకు బంగ్లాదేశ్ క్రికెట్ బోర్డు (బంగ్లాదేశ్ తాత్కాలిక ప్రభుత్వ మద్దతుతో) నిరాకరించింది. టోర్నమెంట్ సహ-ఆతిథ్య దేశమైన శ్రీలంకకు తమ మ్యాచ్‌లను మార్చాలని బీసీబీ అధికారికంగా ఐసీసీని కోరింది.అయితే, స్వతంత్ర భద్రతా సమీక్షలో ఎలాంటి ప్రత్యేక ముప్పు లేదని తేలడంతో, అంతర్జాతీయ క్రికెట్ మండలి (ఐసీసీ) ఆ ప్రతిపాదనను తిరస్కరించింది. జనవరి చివర్లో పాల్గొనాల్సిన గడువు మిస్ కావడంతో, ఐసీసీ బంగ్లాదేశ్‌ను ఈ ద్వైవార్షిక టోర్నమెంట్ నుంచి తప్పించి, గ్రూప్‌సీలో స్కాట్లాండ్‌ను చేర్చింది.

**పాకిస్థాన్ జోక్యంతో వివాదం..**

పాకిస్థాన్ ప్రభుత్వం, పాకిస్థాన్ క్రికెట్ బోర్డు (పీసీబీ) బంగ్లాదేశ్‌కు బహిరంగంగా మద్దతు ప్రకటించాయి. ఫిబ్రవరి 15న కొలంబోలో భారత్‌తో జరగాల్సిన కీలక మ్యాచ్‌ను బహిష్కరించాలని జాతీయ జట్టుకు ఆదేశించినట్లు పాకిస్థాన్ ప్రధాని షెహబాజ్ షరీఫ్ ధృవీకరించిన సంగతి తెలిసిందే.బంగ్లాదేశ్‌ను టోర్నమెంట్ నుంచి తప్పించడం "అన్యాయం", "రాజకీయ ప్రేరేపిత నిర్ణయం" అని పీసీబీ చైర్మన్ మొహ్సిన్ నక్వీ విమర్శించారు.
భద్రతపై అనుమానాలు ఉన్న చోట ఆడమని ఏ క్రికెట్ బోర్డుపై ఒత్తిడి తేవడం సరికాదని ఆయన వ్యాఖ్యానించారు.బుల్బుల్ నక్వీ సమావేశం ప్రస్తుత గొడవకు ఫుల్ స్టాప్ పెట్టడమే లక్ష్యంగా జరగనుంది. ఆ తర్వాత ఇరు దేశాల బోర్డులు కలిసి ఐసీసీ అధికారులతో సమావేశమై ఏకాభిప్రాయంతో తమ వాదనను వినిపించనున్నట్లు తెలుస్తోంది.క్రికెట్ ప్రపంచం మొత్తం ఈ పరిణామాలను ఆసక్తిగా గమనిస్తోంది. టోర్నమెంట్‌లో అత్యంత భారీ వాణిజ్య విలువ కలిగిన భారత్ పాకిస్థాన్ మ్యాచ్‌కు కేవలం వారం రోజులు మాత్రమే మిగిలి ఉండటంతో, టోర్నమెంట్ ప్రతిష్టకు భంగం కలగకుండా అన్ని పక్షాలను సంతృప్తిపరిచే పరిష్కారం కనుగొనాల్సిన ఒత్తిడి ఐసీసీపై భారీగా ఉంది.భారత్‌తో మ్యాచ్‌ను బహిష్కరించే ప్రణాళికను కొనసాగిస్తే తీవ్ర శిక్షలు తప్పవని ఐసీసీ ఇప్పటికే పీసీబీని హెచ్చరించింది. భారీ ఆర్థిక జరిమానాలు, పాయింట్ల కోల్పోవడం నుంచి భవిష్యత్తు అంతర్జాతీయ టోర్నమెంట్‌ల ఆతిథ్య హక్కులు కోల్పోవడం వరకు, అవసరమైతే బోర్డు సభ్యత్వాన్ని కూడా నిలిపివేసే అవకాశాలు ఉన్నాయని స్పష్టం చేసింది.

**వైఖరి మార్పుపై ఐసీసీ ఆశలు..**

ఐసీసీ సీఈఓ సంజోగ్ గుప్తా కూడా కొలంబోకు వెళ్లి శ్రీలంక క్రికెట్ బోర్డు అధ్యక్షుడు షమ్మీ సిల్వాను కలిశారు. షమ్మీ సిల్వానే భారత్‌తో వరల్డ్‌కప్ మ్యాచ్ ఆడాలని పీసీబీ చైర్మన్ నక్వీకి ఈమెయిల్ పంపినట్లు సమాచారంద
.'ఫోర్స్ మేజ్యూర్' నిబంధనను ఆధారంగా చూపిస్తూ భారత్‌తో టీ20 వరల్డ్‌కప్ మ్యాచ్ ఆడకపోవడానికి పాకిస్థాన్ ప్రయత్నించడంపై ఐసీసీ ఇప్పటికే వివరణ కోరింది. ప్రభుత్వంపై బాధ్యత నెట్టివేసి పీసీబీ ఈ పరిస్థితి నుంచి తప్పించుకోవాలని ప్రయత్నించిందని ఐసీసీ అసంతృప్తి వ్యక్తం చేసింది.అయితే, తాజా సమాచారం ప్రకారం పీసీబీ చర్చల కోసం ఐసీసీని సంప్రదించడంతో కొంత ఆశ కనిపిస్తోంది. చివరకు ఆ 'మార్కీ క్లాష్' (భారత్ పాకిస్థాన్ మ్యాచ్) జరుగుతుందని ఒక ఐసీసీ డైరెక్టర్ ఆశాభావం వ్యక్తం చేశారు.

# మున్సిపల్స్ కు అంతా సిద్ధం

# ఎన్నికలు జరిగే ప్రాంతాల్లో సెలవు

**హైదరాబాద్, ఫిబ్రవరి 9, పెన్ పవర్:** రాష్ట్రంలో జరగనున్న మున్సిపల్ ఎన్నికల నిర్వహణ కోసం రాష్ట్ర ఎన్నికల సంఘం విస్తృత ఏర్పాట్లు చేస్తోంది. ఇందులో భాగంగా, పోలింగ్ జరిగే రోజైన ఫిబ్రవరి 11న ఓటర్లు తమ ఓటు హక్కును ఎటువంటి ఆటంకం లేకుండా వినియోగించుకోవడానికి వీలుగా ఆయా ప్రాంతాల్లో స్థానిక సెలవు ప్రకటించాలని జిల్లా కలెక్టర్లను ఆదేశించింది.పోలింగ్ జరిగే మున్సిపల్ పరిధిలోని అన్ని ప్రభుత్వ కార్యాలయాలు, స్థానిక సంస్థలు, సహకార సంఘాలు, ఇతర ప్రభుత్వ రంగ సంస్థలకు సెలవు వర్తిస్తుంది.విద్యాసంస్థల మూసివేత: రాష్ట్రంలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలు, కళాశాలలు, ఇతర విద్యాసంస్థలకు ఆ రోజున సెలవు ప్రకటించాలని ఎస్ఈసీ స్పష్టం చేసింది. చాలా విద్యాసంస్థలను పోలింగ్ కేంద్రాలుగా వినియోగిస్తున్న నేపథ్యంలో ఈ నిర్ణయం తీసుకున్నారు.ప్రైవేట్ కంపెనీలకు సూచన: సాఫ్ట్‌వేర్ సంస్థలు, షాపింగ్ మాల్స్, ఇతర ప్రైవేట్ పరిశ్రమలలో పనిచేసే సిబ్బందికి కూడా ఓటు వేయడానికి వెసులుబాటు కల్పించాలని, అవసరమైతే వేతనంతో కూడిన సెలవు ఇవ్వాలని ఎన్నికల సంఘం సూచించింది.కలెక్టర్లకు పర్యవేక్షణ బాధ్యతలు: ప్రతి జిల్లాలో సెలవు ప్రకటన అమలును జిల్లా కలెక్టర్లు పర్యవేక్షించాల్సి ఉంటుంది. ఓటర్లు తమ ప్రాంతాల్లో పోలింగ్ కేంద్రాలకు తరలివచ్చేలా అవగాహన కల్పించాలని ఎస్ఈసీ ఆదేశించింది.నిబంధనల ఉల్లంఘన: సెలవు ప్రకటించకుండా సిబ్బందిని విధులకు హాజరుకావాలని ఒత్తిడి చేసే సంస్థలపై కఠిన చర్యలు తీసుకునే అవకాశం ఉందని అధికారులు హెచ్చరించారు.పోలింగ్ శాతం పెంచడం, ప్రజాస్వామ్య ప్రక్రియలో ప్రతి పౌరుడిని భాగస్వామిని చేయడమే లక్ష్యంగా ఈ సెలవును ప్రకటించారు.
రేవంత్ రాజ్యం..మున్సిపల్ ఎన్నికల వేళ తెలంగాణ రాజకీయం రేవంత్ రెడ్డి సెట్ చేసిన అజెండా చుట్టూనే తిరుగుతోంది. పట్టణ ప్రాంతాల్లో ప్రభుత్వ వ్యతిరేకత ఉందని, దానినే అస్త్రంగా చేసుకుని అధికార పక్షానికి బుద్ధి చెబుతామని బీఆర్ఎస్ మొదట్లో ప్రకటనలు చేసిందిది. కానీ, క్షేత్రస్థాయిలోకి వెళ్లేసరికి పరిస్థితి పూర్తిగా మారిపోయింది. రేవంత్ రెడ్డి అమెరికా పర్యటన ముగించుకుని వచ్చిన కొద్ది రోజుల్లోనే ఎన్నికల వాతావరణాన్ని తన నియంత్రణలోకి తీసుకున్నారు. ఆయన ఎంచుకున్న అజెండాలో ఎక్కడా పట్టణ సమస్యలు గానీ, అభివృద్ధి గానీ ప్రధానంగా లేవు. పూర్తిగా రాజకీయ విమర్శలే అస్త్రాలుగా మారి ప్రత్యర్థులపై విరుచుకుపడుతున్నారు .రేవంత్ రెడ్డి ఈ ఎన్నికలను కేవలం మున్సిపాలిటీల గెలుపు కోణంలో చూడకుండా, తన రాజకీయ ప్రత్యర్థులైన కేసీఆర్, మోదీల విశ్వసనీయతను దెబ్బతీసే రిఫరెండంగా మార్చేశారు. కేసీఆర్ జాతిపిత కాదు , ఫోన్ ట్యాపింగ్ కేసులో అసలు నిందితులు ఎవరు , బీజేపీ-బీఆర్ఎస్ మధ్య ఉన్నది పెవికాల్ బంధం అంటూ ఆయన సంధిస్తున్న ప్రశ్నలు ప్రజల్లో చర్చకు దారితీస్తున్నాయి. ముఖ్యంగా కేసీఆర్‌ను ఎందుకు అరెస్ట్ చేయడం లేదంటూ బీజేపీని నిలదీయడం ద్వారా.. ఆ రెండు పార్టీల మధ్య రహస్య అవగాహన ఉందనే అభిప్రాయాన్ని బలంగా కల్పించడంలో రేవంత్ సఫలమయ్యారు.ముఖ్యమంత్రి ఇంత వేగంగా రాజకీయ ట్రాక్ మారుస్తారని బీఆర్ఎస్, బీజేపీ ఊహించలేకపోయాయి. కేటీఆర్ తన పార్టీ శ్రేణులకు స్థానిక సమస్యలపై పోరాడాలని లేఖలు రాస్తున్నప్పటికీ, రేవంత్ విసిరిన ట్రాప్‌లో చిక్కుకుని ప్రతిపక్షాలు కూడా అవే అంశాలపై కౌంటర్లు ఇవ్వడానికి ప్రాధాన్యత ఇస్తున్నాయి. ఫలితంగా, పట్టణాల్లో ఉండాల్సిన రోడ్లు, డ్రైనేజీలు, హైడ్రా వంటి అంశాల కంటే కేసీఆర్ అరెస్ట్, ఫోన్ ట్యాపింగ్ వంటి అంశాలే ఎన్నికల ప్రధాన అజెండాగా మారిపోయాయి. రేవంత్ సెట్ చేసిన ఈ ఎజెండాలో ప్రతిపక్షాలు ఆయనను అందుకోలేక ఆయాసపడుతున్నాయి.ఒకవేళ ఇదే పద్ధతిలో ఎన్నికల ప్రచారం ముగిసి, పోలింగ్ జరిగితే రేవంత్ రెడ్డి రాజకీయ చాణక్యం ముందు రెండు ప్రధాన ప్రతిపక్షాలు తేలిపోవడం ఖాయంగా కనిపిస్తోంది. స్థానిక సమస్యల కంటే రాష్ట్ర స్థాయి రాజకీయాల ప్రభావమే ఓటరుపై ఎక్కువగా పడుతోంది. ప్రభుత్వ వ్యతిరేకతను ఓట్ల రూపంలోకి మలచుకోవడంలో విపక్షాలు విఫలమవుతుండగా, రేవంత్ మాత్రం ప్రత్యర్థుల మధ్య ఉన్న పొత్తులను, అవినీతి ఆరోపణలను ఎండగట్టడం ద్వారా తన ఇమేజ్‌ను మరింత పెంచుకుంటున్నారు. ఇది కాంగ్రెస్ పార్టీకి మున్సిపాలిటీల్లో ఊహించని మెజారిటీని ఇచ్చే అవకాశం ఉంది. అభివృద్ధి మంత్రం కంటే ప్రత్యర్థుల బలహీనతలను ఎత్తిచూపడం ద్వారా ఎన్నికల్లో గెలవచ్చనే తన పాత ఫార్ములాను రేవంత్ ఇక్కడ కూడా సమర్థవంతంగా అమలు చేస్తున్నారు.

# హైదరాబాద్ రీజినల్ రింగు రోడ్డు. భూసేకరణ అడుగులు

**హైదరాబాద్, ఫిబ్రవరి 9, పెన్ పవర్:**
హైదరాబాద్ రీజినల్ రింగు రోడ్డు ఉత్తర భాగం పనులపై కీలక అప్డేట్ వచ్చింది. ఈ భాగానికి త్వరలో టెండర్లు పడనుండగా.. 1,895 హెక్టార్ల భూసేకరణ జరగాల్సి ఉంది. వీటితో పాటు.. ఆర్మూర్-మంచిర్యాల, మహబూబ్‌నగర్ మార్గాల్లో 1,372 హెక్టార్లకు గానూ కేవలం 255 హెక్టార్లే పూర్తయ్యాయి. భూసేకరణ ప్రక్రియ వేగవంతమైతేనే ఎన్‌హెచ్‌ఏఐ పనులు పట్టాలెక్కనున్నాయి.తెలంగాణ గేమ్ ఛేంజర్‌గా హైదరాబాద్ రీజినల్ రింగు రోడ్డును రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకున్న సంగతి తెలిసిందే. రాష్ట్రంలోని మౌలిక సదుపాయాల కల్పనలో అత్యంత కీలకమైన ఆర్‌ఆర్‌ఆర్ ఉత్తర భాగం పనులకు సంబంధించి త్వరలోనే టెండర్లు పిలవాలని జాతీయ రహదారుల ప్రాధికార సంస్థ భావిస్తోంది. ఆర్‌ఆర్‌ఆర్‌తో పాటు పలు జాతీయ రహదారుల నిర్మాణానికి భూసేకరణే ప్రధాన అడ్డంకిగా మారింది.హైదరాబాద్ రీజినల్ రింగు రోడ్డు ఉత్తర భాగం పనులు ప్రారంభించేందుకు ఎన్‌హెచ్‌ఏఐ వేగంగా అడుగులు వేస్తోంది. ఈ ప్రాజెక్టు కోసం మొత్తం 1,895 హెక్టార్ల భూమి అవసరం. కాగా ఇప్పటికే 1,862 హెక్టార్లకు సంబంధించి 3డీ నోటిఫికేషన్ ప్రక్రియ పూర్తయ్యింది. భూసేకరణ ప్రక్రియ తుది దశకు చేరుకోవడంతో.. మరోసారి టెండర్లను ఆహ్వానించేందుకు అధికారులు రెడీ అవుతున్నారు. ఈ ప్రాజెక్టు కార్యరూపం దాల్చితే నగరం చుట్టూ రవాణా వ్యవస్థలో విప్లవాత్మక మార్పులురానున్నాయి.రాష్ట్రంలో కేవలం రీజినల్ రింగు రోడ్డే కాకుండా, మరిన్ని కీలక జాతీయ రహదారుల పనులు కూడా భూసేకరణ గండం దాటాల్సి ఉంది. ఆర్మూర్ నుండి మంచిర్యాల వరకు, మహబూబ్‌నగర్ పరిధిలో పనులు ప్రారంభం కావాల్సి ఉంది. జగిత్యాల- మంచిర్యాల, మహబూబ్‌నగర్- గూడెబల్లూర్, ఆర్మూర్- జగిత్యాల, జగిత్యాల- కరీంనగర్ ప్రాజెక్టులో పెండింగ్‌లో ఉన్నాయి. ఈ నాలుగు రహదారుల కోసం మొత్తం 1,372 హెక్టార్ల భూమి అవసరం. ఇప్పటి వరకు కేవలం 255 హెక్టార్లు మాత్రమే సేకరించారు. మిగిలిన భూసేకరణ వివిధ దశల్లో పెండింగ్‌లో ఉండటం ప్రాజెక్టుల నిర్మాణం ఆటంకంగా మారింది.జగిత్యాల -కరీంనగర్ రహదారి విస్తరణకు సంబంధించి రైల్వే శాఖ నుంచి రావాల్సిన అనుమతులు ఇంకా పెండింగ్‌లో ఉన్నాయని అధికారులు తెలిపారు. మరోవైపు, ఈ రహదారుల పనులకు సంబంధించి టెండర్ల ప్రక్రియ ఇప్పటికే పూర్తి అయింది. పనుల పర్యవేక్షణ కోసం త్వరలోనే కన్సల్టెన్సీ సంస్థలను ఎంపిక చేయాలని ఎన్‌హెచ్‌ఏఐ డిసైడ్ అయింది. భూసేకరణ కొలిక్కి వస్తేనే కన్సల్టెన్సీల నియామకం, క్షేత్రస్థాయి పనులకు అడ్డంకులు తొలిగిపోతాయని అధికారులు చెబుతున్నారు.ఈ ప్రాజెక్టుల కోసం భారీ నిధులను కేటాయించినప్పటికీ.. రాష్ట్ర ప్రభుత్వం భూసేకరణ ప్రక్రియను ఎంత వేగంగా పూర్తి చేస్తుందనే దానిపైనే వీటి భవితవ్యం ఆధారపడి ఉందని నిపుణులు చెబుతున్నారు. భూసేకరణ పూర్తయి, క్లియరెన్స్ లభిస్తేనే కాంట్రాక్టర్లు పనులు మొదలుపెట్టే అవకాశం ఉంటుందన్నారు. ఆర్‌ఆర్‌ఆర్ వంటి ప్రతిష్టాత్మక ప్రాజెక్టులు అందుబాటులోకి వస్తే తెలంగాణ ఆర్థిక ముఖచిత్రం మారడమే కాకుండా.. జిల్లాల మధ్య కనెక్టివిటీ కూడా పెరుగుతుందని అంటున్నారు.

# కరీంనగర్ లో కాషాయ ప్రభంజనం



**హైదరాబాద్ పెన్ పవర్:** మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో కరీంనగర్ లో కబడ్డీ ఆట మొదలైందని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ అన్నారు. ఇండియా పేరుతో బీజేపీ, పాకిస్తాన్ పేరుతో కాంగ్రెస్, ఎంఐఎం పార్టీలు కలిసి కబడ్డీ ఆటను ప్రారంభించాయన్నారు. కరీంనగర్ కార్పొరేషన్ ఎన్నికల్లో బీజేపీకి 50 సీట్లు ఖాయమని తేలడంతో కబడ్డీ కప్ బీజేపీ గెలుచుకోవడం తథ్యమని తేలడంతో కాంగ్రెస్, ఎంఐఎం మధ్య రూ.100 కోట్ల డీల్ (మ్యాచ్ ఫిక్సింగ్) కుదిరిందని సంచలన వ్యాఖ్యలు చేశారు. ఆ డబ్బుతో ఓట్లను కొనుగోలు చేసి బీజేపీని ఓడించడమే లక్ష్యంగా పెట్టుకున్నారని ఆరోపించారు. కరీంనగర్ లోని మీడియా, సోషల్ మీడియాసహా యువకులంతా కుల, మతాలకు అతీతంగా ఒక్కటై కాంగ్రెస్, ఎంఐఎం చేస్తున్న కుట్రలను వివరించి బీజేపీని బంపర్ మెజారిటీతో గెలిపించాలని పిలుపునిచ్చారు.

ఈరోజు సాయంత్రం కేంద్ర మంత్రి బండి సంజయ్ ఆధ్వర్యంలో కరీంనగర్ లో భారీ ఎత్తున "విజయ సంకల్ప ర్యాలీ" నిర్వహించారు. బీజేపీ తెలంగాణ ఇంఛార్జీ, మహారాష్ట్ర ఐటీ మంత్రి ఆశీష్ షెల్లార్, మాజీ ఎంపీ, సినీ నటి నవనీత్ కౌర్ ముఖ్య ఈ ర్యాలీకి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు.

కరీంనగర్ కలెక్టరేట్ రెవిన్యూ గార్డెన్ నుండి ప్రారంభమైన ఈ ర్యాలీలో కనీవినీ ఎరగని రీతిలో వేలాది మంది కాషాయ పగిడీలు ధరించి ర్యాలీలో పాల్గొన్నారు. ఈ ర్యాలీలో అత్యధికంగా మహిళలు పాల్గొనడం, ర్యాలీలో ఆద్యంతం వారు ఉత్సాహంగా నడుస్తూ జై బీజేపీ, జై మోదీ, జైజై బండి సంజయ్ అంటూ చేసిన నినాదాలతో కరీంనగర్ కాషాయ సంద్రమైంది. కరీంనగర్ రెవిన్యూ గార్డెన్ నుండి ప్రతిమ మల్టిప్లెక్స్, వన్ టౌన్ పోలీస్ స్టేషన్, వెంకటేశ్వర టెంపుల్, అమరవీరుల స్థూపం, పోస్టాఫీస్ మీదుగా టవర్ సర్కిల్ దాకా నిర్వహించిన ఈ ర్యాలీ ఒక ప్రభంజనంగా మారింది. అనంతరం టవర్ సర్కిల్ వద్ద కాషాయ ప్రభంజనాన్ని ఉద్దేశించి బండి సంజయ్, నవనీత్ కౌర్ ప్రసంగించారు.

**బండి సంజయ్ చేసిన ప్రసంగంలోని ముఖ్యాంశాలు....**

అభివృద్ధి నినాదంతో మేం ప్రజల వద్దకు పోతే కరీంనగర్ ఎన్నికలకు వెళితే ఏం జరుగుతోందో... ఏ విధంగా కాషాయ సంద్రమైందో చూస్తున్నారు కదా... కరీంనగర్ కార్పొరేషన్ లో బీజేపీ 50 సీట్లు గెలిచి మేయర్ పీఠాన్ని కైవసం చేసుకోబోతోందని సర్వేలన్నీ తేల్చడంతో కాంగ్రెస్, ఎంఐఎం నేతల వెన్నులో వణుకు మొదలైంది.అందుకే ఒవైసీ నిన్న రాత్రి కరీంనగర్ కు వచ్చి ఎంఐఎం గేర్ మారుస్తుందని మాట్లాడుతున్నడు.అరే ఒవైసీ.. కరీంనగర్ లో ఆల్రెడీ కబడ్డీ ఆట మొదలెట్టినం బేటా.. మా కరినగర ప్రజలంతా... బీజేపీ .. బీజేపి అనే కూత కూస్తున్నారు. బైరి కొస్తున్నారు. ఆ కూత పాత బస్తీదాక వినపడే సరికి భయపడి నువ్వు కరీంనగర్ కి ఉరికొచ్చినవ్ బిడ్డా.. నీకు నీ చెయ్యి పట్టుకుని నడిపిస్తున్న కాంగ్రెస్. . పార్టీకి, కరీంనగర్ లో బండి సంజయ్ కార్పొరేషన్ లో ఆడుతున్న కబడ్డీ ఆట గుర్తొచ్చి.. ఒకరి వెనుక ఇంకొకరు ఇక్కడికి ఉరికొచ్చింంద్రు.. కదా..! కరీంనగర్లో బీజేపి ఆడుతున్న కబడ్డీ ఆటకు నీ చోటా బాయి రేవంత్ రెడ్డి ఈడకు రాలేక చొప్పదండి నుండే పారిపోయి నిన్ను పంపిండా?

ఈ కబడ్డీ ఆటలో ఇండియా టీం పక్షాన బీజేపీ ఆడుతుంటే... పాకిస్తాన్ టీం పక్షాన కాంగ్రెస్, ఎంఐఎం కలిసి అడుతున్నయ్. బీజేపీ టీంను ఓడించేందుకు నిన్న రాత్రి కాంగ్రెస్, ఎంఐఎం నేతలు రహస్యంగా సమావేశమై రూ.100 కోట్ల (డీల్) మ్యాచ్ ఫిక్సింగ్ చేసుకున్నరు. రూ.100 కోట్లు ఖర్చు పెట్టి అయినా సరే ఓట్లు కొనుగోలు చేసి బీజేపీని ఓడించాలని కుట్రకు ప్లాన్ చేశారు. వాళ్లు ఎన్ని కుట్రలు చేసిన ఈనెల 11న జరిగే ఫైనల్ లో బీజేపీ టీం కబడ్డీ కప్ గెలుచుకోవడం తథ్యం.

బండి సంజయ్ కు, బిజెపి వాళ్లు వాళ్ల భార్యల కంటే నన్నే ఎక్కువ ఇష్టపడతారని ఒవైసీ మాట్లాడుతున్నడు. అరే ఓవైసీ... నీకు తెలుసా? బీజేపీ నేతలకు కుటుంబం కంటే.. దేశం, ధర్మమే ముఖ్యం.. దుష్ట శిక్షణ కోసం కొన్నిసార్లు ఇంటిని కూడా మర్చిపోతం. రామాయణం లో రాముడికి ఎప్పుడు రావణుడే గుర్తొచ్చాడు కదా.. మహాభారతం లో పాండవులకు కౌరవులే గుర్తొచ్చారు కదా. ఈ బండి సంజయ్ కు కూడా ఒవైసీనే గుర్తుకొస్తున్నడు. రామాయణం, మహాభారతంలో రావణుడు, కౌరవులకు ఏం గతి పట్టిందో ఎంఐఎంకు కూడా అదే గతి పట్టించేదాకా విశ్రమించే ప్రసక్తే లేదు. నా కరీంనగర్ ప్రజలారా... ఈ కరీంనగర్ కు రక్షణ కవచంగా నేనుంటా. మీ జెండాలను పక్కన పెట్టండి. అందరూ ఒక్కటై ఆ రెండు పార్టీలకు బుద్ది చెప్పండి. ట్రిపుల్ తలాఖ్ రద్దుతో ముస్లిం మహిళల జీవితాల్లో వెలుగు నింపుతోంది మోదీ ప్రభుత్వం. ముస్లిం మహిళలు సైతం ఎంఐఎంను ఛీ కొట్టి బీజేపీవైపు నడుస్తుంటే... ఓర్వలేక ఎంఐఎం నేతలు కాంగ్రెస్ తో కలిసి బీజేపీని దెబ్బతీసేందుకు కుట్ర చేస్తున్నాయి. కరీంనగర్ కార్పొరేషన్, టవర్ సర్కిల్ మీద పొరపాటున మజ్లిస్ పచ్చ జెండా ఉంటే ఎట్లుంటదో ఆలోచించండి. అదే సమయంలో ఈ కార్పొరేషన్, టవర్ సర్కిల్ పై కాషాయ జెండా రెపరెపలాడుతుంటే ఎంతటి కనువిందు చేస్తుందో ఆలోచించాలని కోరుతున్నా. మున్సిపల్ ఎన్నికలకు ఇంకా ఉన్నది రెండ్రోజులే. మీడియా, సోషల్ మీడియా కార్యకర్తలతోపాటు యువకులంతా ఈ రెండ్రోజుల సమయం మాకు ఇవ్వండి. రాజకీయాలకు అతీతంగా బీజేపీని గెలిపించండి. ఈ కరీంనగర్ కు రక్షణ కవచంగా నేను ఉంటా. వాడవాడలా, బూత్ బూత్ లో తిరిగి ప్రతి ఒక్కరినీ కలిసి కాంగ్రెస్, ఎంఐఎం కుట్రలను, మతం పేరుతో మారణ హోమం సృష్టించడానికి జరుగుతున్న కుట్రలను వివరించండి. బీజేపీని గెలిపించండి. కరీంనగర్ లో కాంగ్రెస్, ఎంఐఎం కలిసి వచ్చినా, కుట్రలు చేసినా ఒక్క సీటు కూడా గెలవలేకపోయిందని నిరూపించండి. నరేంద్రమోదీ ఎదుట గల్లా ఎగరేసి చెప్పుకునే అవకాశం ఇవ్వండి. కులాలు, వర్గాలు, వర్ణాల, డివిజన్ల పేరుతో విడిపోతే పచ్చ పార్టీ గెలిస్తే కరీంనగర్ పరిస్థితి ఎట్లుంటదో ఒక్కసారి ఆలోచించండి. ఈ నెల 11 న జరిగే పోలింగ్ నాడు దేశాన్ని, ధర్మాన్ని, మన హిందూ సమాజాన్ని గుర్తు చేసుకుని కమలం పువ్వు గుర్తుకు ఓటేయాలని కోరుతున్నా..

# భారత్, అమెరికా ట్రేడ్ డీల్... తగ్గనున్న ఆహార పదార్థాలు...

**హైదరాబాద్, ఫిబ్రవరి 9, పెన్ పవర్:**

భారత్–అమెరికా మధ్య తాత్కాలిక వాణిజ్య ఒప్పందం జరిగినట్లు రెండు దేశాలు ప్రకటనలు విడుదల చేశాయి. ఈ నేపథ్యంలోనే ఇప్పుడు అమెరికా నుంచి భారత్‌లోకి దిగుమతి అయ్యే ఆహార పదార్థాల ధరలు దిగిరానున్నాయి. అయితే భారత రైతులకు ఎలాంటి నష్టం లేకుండా.. కొన్ని వస్తువులపై మాత్రమే సుంకాలను ఈ ఒప్పందంలో భాగంగా తగ్గించారు. ఈ క్రమంలోనే ఇప్పుడు ఏ ఏ ఆహార వస్తువుల ధరలు తగ్గుతాయి అనేది ఈ స్టోరీలో తెలుసుకుందాం.భారత్‌పై సుంకాల మోత మోగించిన అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్.. ఇటీవలె 50 శాతం నుంచి సుంకాలు 18 శాతానికి తగ్గించినట్లు వెల్లడించారు. సుదీర్ఘ నిరీక్షణ తర్వాత.. ఇటీవల భారత్–అమెరికా మధ్య కుదిరిన కొత్త తాత్కాలిక వాణిజ్య ఒప్పందం కారణంగా అమెరికా నుంచి భారత్‌లోకి దిగుమతి అయ్యే పలు రకాల ఆహార పదార్థాల ధరలు తగ్గి.. ఊరట కలగనుంది. అయితే దేశ ప్రధాన వ్యవసాయ రంగానికి ఎలాంటి నష్టం కలగకుండా.. కొన్ని వస్తువులపై మాత్రమే సుంకాలను తగ్గించి.. ధరలు దిగివచ్చేలా ఈ ఒప్పందాన్ని కుదుర్చుకున్నట్లు సంబంధిత వర్గాల ద్వారా తెలుస్తోంది. అమెరికా సుంకాలు తగ్గించినందుకు బదులుగా.. అమెరికా నుంచి భారత్‌కు వచ్చే కొన్ని ఆహార, పారిశ్రామిక ఉత్పత్తులపై దిగుమతి సుంకాలను తగ్గించడం లేదా తొలగించడం చేయాల్సి ఉంటుంది.ఏ ఏ ఆహార పదార్థాల ధరలు తగ్గుతాయి?

**డ్రై ఫ్రూట్స్**

అమెరికా నుంచి భారత్‌లోకి దిగుమతి అయ్యే బాదం, పిస్తా, వాల్‌నట్స్ వంటి డ్రై ఫ్రూట్స్ ధరలు దిగి రానున్నాయి.

పండ్లు

యాపిల్స్, తాజా పండ్లు, ప్రాసెస్ చేసిన పండ్లపై దిగుమతి సుంకాలు తగ్గనున్నాయి. అయితే భారతదేశ రైతులను కాపాడేందుకు వీటిపై కనీస దిగుమతి ధర రూల్ మాత్రం కొనసాగుతుంది.

**సోయాబీన్ ఆయిల్**

భారత్‌లో వంట నూనెల అవసరాలు చాలా ఎక్కువగా ఉన్నందున.. అమెరికా నుంచి వచ్చే సోయాబీన్ ఆయిల్‌పై భారత్ సుంకాలను తగ్గించింది.

**పశువుల దాణా**

పశువులు, కోళ్ల మేతలో వాడే ప్రోటీన్ పదార్థాలు, ఎర్ర జొన్నలపై దిగుమతి సుంకాలు తగ్గుతాయి. దీనివల్ల దాణా తయారీ ఖర్చు తగ్గి.. పరోక్షంగా దానిపై ఆధారపడే పలు రంగాలకు భారీ ఊహట కలగనుంది.

**వైన్, స్పిరిట్స్**

అమెరికన్ వైన్, ఇతర స్పిరిట్‌ల ధరలు కూడా తగ్గనున్నాయి. కనీస దిగుమతి ధర కొనసాగుతున్నప్పటికీ.. భారత మార్కెట్లో ఇలాంటి డ్రింక్స్ ధరలు తగ్గే అవకాశాలు ఉన్నాయి.

**కొన్ని వస్తువులపై పాత సుంకాలే**

అయితే భారతదేశంలో ఎక్కువ శాతం మంది వ్యవసాయంపైనే ఆధారపడి జీవిస్తారు. అమెరికా నుంచి దిగుమతి అయ్యే ఉత్పత్తులపై సుంకాలు తగ్గించడం, పూర్తిగా తొలగించడం వల్ల మన దేశ రైతులకు తీవ్ర అన్యాయం జరుగుతుందని అనేక భయాందోళనలు వ్యక్తం అయిన సంగతి తెలిసిందే. దీంతో మోదీ సర్కార్ అలర్ట్ అయింది. అత్యంత సున్నితమైన వ్యవసాయ రంగాలపై ఎలాంటి ఎఫెక్ట్ పడకుండా చూసేందుకు ఆయా ఉత్పత్తులపై పాత సుంకాలే కొనసాగుతాయని కేంద్ర ప్రభుత్వం తేల్చి చెప్పింది.

ప్రధాన ధాన్యాలు

గోధుమలు, వరి, మొక్కజొన్న, చిరుధాన్యాలైన జొన్న, సజ్జ, రాగి, కొర్రలు, బార్లీ, ఓట్స్ వంటి ఉత్పత్తులు ఈ వాణిజ్య ఒప్పందం నుంచి మినహాయించారు. దీనివల్ల వీటికి పాత సుంకాలే అమలు కానున్నాయి.

**పాల ఉత్పత్తులు**

పాలు, వెన్న, నెయ్యి, పెరుగు, వెన్న నూనె వంటి ఉత్పత్తులపై పూర్తి రక్షణ కల్పించారు.

**మాంసం, కూరగాయలు**

చికెన్, ఇతర మాంసాలు, బంగాళాదుంపలు, బఠానీలు, చిక్కుళ్లు, పుట్టగొడుగులు వంటి వాటిపై పాత సుంకాలే అమలు కానున్నాయి. మరోవైపు.. తాజాగా కుదిరిన ట్రేడ్ డీల్‌లో భాగంగా అమెరికా కూడా కొన్ని భారతీయ ఉత్పత్తులపై సుంకాలను 50 శాతం నుంచి 18 శాతానికి తగ్గించింది. ఇందులో టెక్స్‌టైల్స్, లెదర్, ఫార్మాస్యూటికల్స్, విమాన విడిభాగాలు మొదలైనవి ఉన్నాయి. వీటివల్ల భారతీయ చిన్న, మధ్య తరహా పరిశ్రమలకు (ఎంఎస్ఎంఈ) భారీగా లబ్ధి చేకూరుతుందని కేంద్ర ప్రభుత్వ వర్గాలు భావిస్తున్నాయి.

# టూ టైర్ సిటీస్ లో రియల్

**హైదరాబాద్, ఫిబ్రవరి 9, పెన్ పవర్:**

తెలంగాణ , ఆంధ్రప్రదేశ్‌లోని ప్రధాన టైర్-2 నగరాల్లో రియల్ ఎస్టేట్ రంగం అనూహ్యమైన మార్పులు చోటు చేసుకుంటున్నాయి. వరంగల్, కరీంనగర్, తిరుపతి వంటి నగరాల్లో ఓపెన్ ప్లాట్ల వ్యాపారం గత ఏడాదితో పోలిస్తే ఏకంగా 15 శాతం వృద్ధిని నమోదు చేసింది. హైదరాబాద్ వంటి మెట్రో నగరాల్లో ధరలు సామాన్యులకు అందుబాటులో లేకపోవడం, ఐటీ , పారిశ్రామిక రంగాలు ద్వితీయ శ్రేణి నగరాలకు విస్తరిస్తుండటంతో పెట్టుబడిదారులు ఇప్పుడు ఈ ప్రాంతాల వైపు మొగ్గు చూపుతున్నారు.ముఖ్యంగా మధ్యతరగతి వర్గాల వారు భవిష్యత్తు అవసరాల కోసం ఈ నగరాల శివార్లలో ప్లాట్లు కొనడానికి ప్రాధాన్యత ఇస్తున్నారు. తెలంగాణలో హైదరాబాద్ తర్వాత అతిపెద్ద నగరంగా ఎదుగుతున్న వరంగల్‌లో రియల్ ఎస్టేట్ బూమ్ కనిపిస్తోంది. స్మార్ట్ సిటీ ప్రాజెక్టులు, కాజీపేట రైల్వే కోచ్ ఫ్యాక్టరీ ,వరంగల్ ఎయిర్‌పోర్ట్ పునరుద్ధరణ వార్తలు ఇక్కడి భూముల ధరలకు రెక్కలు తెచ్చాయి. కరీంనగర్‌లో ఐటీ టవర్లు, పర్యాటక రంగ అభివృద్ధి వల్ల పట్టణ సరిహద్దులు వేగంగా విస్తరిస్తున్నాయి. గతంలో కేవలం వ్యవసాయ భూములుగా ఉన్న ప్రాంతాలు నేడు



డీటీసీపీ అనుమతి పొందిన లేఅవుట్లుగా మారుతున్నాయి. ఇక్కడ గత ఏడాదితో పోలిస్తే ప్లాట్ల అమ్మకాల్లో సుమారు 14 నుంచి 16 శాతం వరకు ధరల పెరుగుదల కనిపించడం గమనార్హం.ఆంధ్రప్రదేశ్‌లోని తిరుపతిలో కూడా ఇదే విధమైన ట్రెండ్ కొనసాగుతోంది. ప్రపంచ ప్రఖ్యాత ఆధ్యాత్మిక కేంద్రం కావడంతో పాటు, అక్కడ ఏర్పాటవుతున్న కొత్త టౌన్‌షిప్‌లు ,పారిశ్రామిక కారిడార్లు రియల్ ఎస్టేట్ వృద్ధికి ప్రధాన కారణమయ్యాయి. తిరుపతి–మదనపల్లి , తిరుపతి–చెన్నై హైవేల వెంట వెలుస్తున్న ఓపెన్ ప్లాట్ వెంచర్లకు డిమాండ్ భారీగా పెరిగింది. ఈ నగరాల్లో 15 శాతం వృద్ధి నమోదు కావడానికి మెరుగైన కనెక్టివిటీ ప్రధాన కారణమని విశ్లేషకులు చెబుతున్నారు. కొత్తగా నిర్మిస్తున్న బైపాస్ రోడ్లు, అండర్ పాస్లు ,మెరుగైన డ్రైనేజీ వ్యవస్థలు పెట్టుబడిదారుల్లో నమ్మకాన్ని పెంచాయి. అపార్ట్‌మెంట్ల కంటే ఓపెన్ ప్లాట్లపై పెట్టుబడి పెడితే తక్కువ కాలంలోనే ఎక్కువ లాభం వస్తుందని భావించడం కూడా ఈ రంగం పుంజుకోవడానికి కారణం.

## మెట్ పల్లిలో పాన్ టేల దగ్ధం: 10 వేల ఆస్తి నష్టం

**చొప్పదండి, ఫిబ్రవరి 9 పెన్ పవర్:** జగిత్యాల జిల్లా మెట్ పల్లి పట్టణంలో సోమవారం ఉదయం ఒక పాన్ టేల ప్రమాదవశాత్తు అగ్నికి ఆహుతైంది. పట్టణానికి చెందిన మద్దురి గోపి తన పాన్ టేల దుకాణం తెరిచి, దేవుని ఫోటోల వద్ద దీపం పెట్టి మార్కెట్ కు వెళ్లి తిరిగి వచ్చేసరికి దుకాణంలో మంటలు చెలరేగాయి. స్థానికులు మంటలను ఆర్పివేసేలోపే దుకాణం పూర్తిగా కాలి బూడిదైంది. ఈ ఘటనలో దాదాపు పదివేల రూపాయల ఆస్తి నష్టం జరిగినట్లు బాధితుడు గోపి తెలిపారు.

## సమస్యలను పరిష్కరిస్తాం: మంత్రి అడ్లూరి లక్ష్మణ్

**మానకొండూరు, ఫిబ్రవరి 9 పెన్ పవర్:**మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో ధర్మపురి పట్టణంలో మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ సోమవారం ప్రచారం నిర్వహించారు. పట్టణంలో పటేల్ చౌరస్తా, తెనుగు గద్దె, బ్రాహ్మణ సంఘం, నంది చౌరస్తా, గాంధీ చౌరస్తా ఏరియాల్లో మంత్రి ప్రచారం చేశారు. ఈ సందర్భంగా వార్డుల్లోని ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఎన్నికల ప్రక్రియ పూర్తి కాగానే దశల వారీగా అన్ని సమస్యలు పరిష్కరిస్తామని మంత్రి హామీ ఇచ్చారు. ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులను భారీ మెజార్టీతో గెలిపించాలని ఓటర్లను కోరారు.

### కాంగ్రెస్‌ను గెలిపిస్తే నగర ప్రగతి

**సిరిసిల్ల, ఫిబ్రవరి 9 పెన్ పవర్:** కరీంనగర్‌లో కాంగ్రెస్‌ను భారీ మెజారిటీతో గెలిపిస్తే, స్థానిక సమస్యల పరిష్కారానికి ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్తానని జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి, వ్యవసాయ శాఖ తుమ్మల నాగేశ్వరావు అన్నారు. కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌ఛార్జి వెలిచాల రాజేందర్‌రావుతో కలిసి ఆయన కరీంనగర్ పలు డివిజన్లలో ప్రచారంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా తుమ్మల మాట్లాడుతూ.. ఎన్నికలలో ఓడిపోతామనే భయంతో కొందరు కార్యకర్తలను బెదిరింపులకు గురి చేస్తున్నట్లు తమ దృష్టి కొచ్చిందని, వారిని ఉపేక్షించబోమన్నారు. నగర అభివృద్ధి కాంగ్రెస్‌తోనే సాధ్యమన్నారు. అంతకుముందు తుమ్మల నాగేశ్వరరావు మంత్రి పొన్నం ప్రభాకర్‌తో కలిసి జ్యోతినగర్‌లో ప్రచారం చేశారు.

## మంగాపురం తండా గ్రామపంచాయతీ లో ఉపాధి హా పనులు ప్రారంభించిన సర్పంచ్

**ఖమ్మం, ఫిబ్రవరి 9 పెన్ పవర్:** ఖమ్మం జిల్లా నేలకొండపల్లి మండలం మంగాపురం తండా గ్రామపంచాయతీ పరిధిలో సోమవారం నాడు గ్రామపంచాయతీ సర్పంచ్ కొబ్బరికాయ కొట్టి ఉపాధి హా పనులను ప్రారంభించారు. ప్రజలకు ఉపయోగపడే ఈ కార్యక్రమం ద్వారా వ్యవసాయ కూలీలకు ఉపాధి కల్పించి, జీవన ఉపాధికి అవకాశాలు కల్పిస్తున్నట్లు సర్పంచ్ తెలిపారు. గ్రామ ప్రజలందరూ ఈ అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని ఆయన హా ఇచ్చారు.

### ఖమ్మంలో 10న జాబ్ మేళా

**మధిర, ఫిబ్రవరి 9 పెన్ పవర్:** ఖమ్మం టేకులపల్లి ఎంఎ మోడల్ కెరీర్ సెంటర్ నందు ఈ నెల 10న జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా ఉపాధి అధికారి శ్రీరామ్ తెలిపారు. ఒక ప్రైవేట్ కంపెనీలో ఖాళీగా ఉన్న పోస్టుల భర్తీకి ఈ మేళా జరుగుతుంది. 21–35 సంవత్సరాల వయస్సు కలిగి, ఏదైనా డిగ్రీ పూర్తి చేసిన వారు అర్హులు. ఎంపికైన వారికి సంవత్సరానికి రూ.2.4 లక్షల నుంచి రూ.3.5 లక్షల వరకు వేతనం లభిస్తుంది. నిరుద్యోగులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

## పాత కక్షలతో దాడి... వ్యక్తిపై కేసు నమోదు

**వైరా, ఫిబ్రవరి 9 పెన్ పవర్:** కూసుమంచి మండలంలోని నాయకన్ గూడెంలో అమ్మటి శివయ్య అనే వ్యక్తిపై అమ్మటి ఉదయ్ బీరు సీసాతో దాడి చేశాడు. బంధువు దశదిన కర్మలో భోజనం చేస్తుండగా ఈ ఘటన జరిగింది. పాత కక్షల నేపథ్యంలోనే దాడి జరిగినట్లు స్థానికులు చెబుతున్నారు. గాయపడిన శివయ్యను ఆస్పత్రికి తరలించారు. బాధిత వ్యక్తి భార్య ఫిర్యాదు మేరకు పోలీసులు ఉదయ్ పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఈ ఘటనపై ఎస్ఐ నాగరాజు వివరాలు అందించారు.

### సాగర్ నీరు విడుదల చేయాలని రైతుల రాస్తారోకో

**పాలేరు, ఫిబ్రవరి 9 పెన్ పవర్:** సాగునీరు అందక మొక్కజొన్న పంట ఎండిపోవడంతో ఆగ్రహించిన రైతులు సోమవారం రోడ్డెక్కారు. సాగర్ కాలువ ద్వారా పది రోజులుగా నీరు నిలిచిపోవడంతో కొనిజర్ల మండలం గుబ్బగుర్తి వద్ద ఏనుకూరు – పల్లిపాడు రహదారిపై రాస్తారోకో నిర్వహించారు. కంకి ముదురుతున్న సమయంలో నీరు లేక పంట దెబ్బతింటోందని అన్నదాతలు ఆవేదన వ్యక్తం చేశారు. అధికారుల నిర్లక్ష్యంపై మండిపడుతూ బైఠాయించడంతో వాహనాల రాకపోకలు నిలిచిపోయాయి.

### సాగునీటి కోసం మొక్కజొన్న రైతుల ఆందోళన

**సత్తుపల్లి, ఫిబ్రవరి 9 పెన్ పవర్:** ఖమ్మం జిల్లా కొనిజర్ల మండలం గుబ్బగుర్తి గ్రామంలో సాగర్ ఆయకట్టు పరిధిలో వారబందీ పద్ధతిలో విడుదల చేస్తున్న సాగునీటిని వెంటనే విడుదల చేయాలని రైతులు రోడ్డెక్కారు. ఈ ఏడాది మొక్కజొన్న, వరి పంటలు సాగు చేసిన రైతులు, ఎండల తీవ్రత పెరుగుతున్న దృష్ట్యా పైర్లకు నీటి అవసరం ఎక్కువగా ఉందని, ప్రస్తుతం మొక్కజొన్న కంకి దశలో ఉండటంతో నీరు లేక దిగుబడి తగ్గే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. వారం రోజులుగా నీటిని నిలిపివేయడంతో పంటలు ఎండిపోతున్నాయని ఆగ్రహించిన రైతులు రోడ్డుపై కూర్చుని నిరసన తెలిపారు.

### భూపాలపల్లి జిల్లా తొలగిస్తే ఊరుకోము.. కేటీఆర్

**భూపాలపల్లి, ఫిబ్రవరి 9 పెన్ పవర్:** జయశంకర్ భూపాలపల్లి జిల్లా మున్సిపల్ ఎన్నికల ప్రచారంలో భాగంగా సోమవారం బిఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ భూపాలపల్లి పట్టణానికి చేరుకున్నారు. ఆయన ప్రొఫెసర్ జయశంకర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం అంబేద్కర్ సెంటర్ వరకు ర్యాలీగా వెళ్లి కార్నర్ టింగ్ లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ, భూపాలపల్లి జిల్లాను కేసీఆర్ ఏర్పాటు చేశారని, దానిని తొలగిస్తే ఊరుకోబోమని అన్నారు.

### డయాగ్నస్టిక్ సెంటర్లో అగ్నిప్రమాదం

**వరంగల్ వెస్ట్, ఫిబ్రవరి 9 పెన్ పవర్:** హనుమకొండలోని ం బినీ జి డయాగ్నస్టిక్ సెంటర్‌లో షార్ట్ సర్క్యూట్ కారణంగా సోమవారం అగ్నిప్రమాదం సంభవించింది. మంటలు చెలరేగడంతో స్థానికులు భయాందోళనకు గురయ్యారు. అగ్నిమాపక సిబ్బంది సకాలంలో స్పందించి మంటలను అదుపు చేయడంతో పెను ప్రమాదం తప్పింది. ఈ ఘటనలో ఎవరికీ గాయాలు కాలేదని, ఆస్తి నష్టంపై అంచనా వేస్తున్నామని సుబేదారి సీఐ రంజిత్ తెలిపారు. ప్రస్తుతం పరిస్థితి అదుపులోనే ఉంది.

### చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

**వరంగల్ ఈస్ట్, ఫిబ్రవరి 9 పెన్ పవర్:** మహబూబాబాద్ జిల్లాలో రోడ్డు ప్రమాదం ఘటనలో కొత్తగూడెం జిల్లా కరకగూడెం మండలానికి చెందిన సాదు శ్రీను(41) మృతి చెందాడు. బంధువుల ఇంటికి వెళ్లి వస్తుండగా, లారీని తప్పించే ప్రయత్నంలో ద్విచక్ర వాహనం అదుపుతప్పి రోడ్డుపై పడిపోవడంతో తీవ్ర గాయాలయ్యాయి. హైదరాబాద్‌లోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతూ ఆయన తుదిశ్వాస విడిచాడు.

## అమెరికా, ఇరాన్ మధ్య యుద్ధం తప్పదా..!

**హైదరాబాద్ పెన్ పవర్:** అమెరికా- ఇరాన్ మధ్య ఉద్రిక్తత పరిస్థితులు రోజురోజుకూ జఠిలమవుతున్నాయి. ప్రభుత్వ వ్యతిరేక నిరసన అణిచివేత, ఇరాన్ అణుకార్యక్రమాన్ని తగ్గించాలని ట్రంప్ ఇరాన్‌పై ఒత్తిడి పెంచారు. స్పందించకపోతే దాడి చేస్తామని కూడా హెచ్చరించారు. అయితే, ఇటీవల ఇరాన్ విదేశాంగ మంత్రి అబ్బాస్ అరఘ్చి మాట్లాడుతూ.. న్యాయపరమైన చర్చలకు తాము సిద్ధంగా ఉన్నామని, ట్రంప్ డిమాండ్లను మాత్రం తాము ఒప్పుకోబోమని ప్రకటించారు. రక్షణ వ్యూహాలు, క్షిపణి వ్యవస్థలు ఎప్పటికీ చర్చల అంశం కావని చెప్పారు. ఇదిలాఉంటే ఇరాన్ ఉద్రిక్తతలకు అమెరికా, ఇజ్రాయిల్ కారణమని మరోసారి ఇరాన్ అధ్యక్షుడు మసౌజ్పె జెష్కియన్ స్పష్టం చేశారు. ట్రంప్, నెతన్యాహు యూరప్‌లో ఆందోళనలను పెంచారని, తద్వారా ప్రజలను రెచ్చ గొడుతున్నారని ఆరోపించారు. ఇరాన్ సైన్యాధ్యక్షుడు అమీర్ హతామి 'గత పన్నెండు రోజుల యుద్ధం తర్వాత దేశ రక్షణ సామర్థ్యాలను బలోపేతం చేశామని, భవిష్యత్ దాడులకు ఇరాన్‌ను దీటుగా సమాధానం చెబుతుందని' మాట్లాడాడు. ఈ అందరి వ్యాఖ్యల్నిబట్టి చూస్తే అమెరికా, ఇరాన్ మధ్య యుద్ధం తప్పదన్న వాదనలు వినిపిస్తున్నాయి. గల్ఫ్‌లో ఇరుకైన ముఖద్వారం హార్ముజ్ జలసంధి. ఇక్కడినుంచే ప్రపంచంలోని మిగిలిన ప్రాంతాలకు దారి. ఈ జలసంధిలో ఇరాన్, ఒమన్ దేశాలకు ప్రాదేశిక జలాలు ఉన్నప్పటికీ, దీన్ని అన్ని దేశాల నౌకలు ప్రయాణించగల అంతర్జాతీయ జలమార్గంగా పరిగణిస్తారు. యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ కూడా ఈ మార్గానికి సమీపంలోనే ఉంది.యుఎస్ ఎనర్జీ ఇన్ఫర్మేషన్ అడ్మినిస్ట్రేషన్‌కు ఇదే చాలా కీలకమైన ప్రాంతం. ఇదే హార్ముజ్ జలసంధిలో ఇటీవల రెండు రోజుల లైవ్-ఫైర్ నావికా విన్యాసాలను ఇరాన్ ప్రకటించింది. ఇరాన్‌కు దగ్గరగా అమెరికా యుద్ధనౌకలు మోహరింపు, అమెరికా అధ్యక్షుడి హెచ్చరికల ప్రకటనలు యుద్ధానికి కాలుదువ్వినట్టుగానే కనిపిస్తున్నాయి. ఇరాన్ అణు కేంద్రాలు, సైనిక స్థావరాలు లక్ష్యంగా అమెరికా దాడి చేయెుచ్చు! ఇరాన్, దాని ప్రాక్సీలు(హౌతీలు, హమాస్ సంస్థలు) అమెరికా స్థావరాలు, మిత్రదేశాలైన ఇజ్రాయిల్, గల్ఫ్ దేశాలపై ప్రతీకార దాడులుచేసే అవకాశాలూ లేకపోలేదు. ఇరాన్ గనక హార్ముజ్ జలసంధిని మూసివేస్తే ప్రపంచ ఇంధన సరఫరాలకు అంతరాయం ఏర్పడటమే కాదు, ప్రాంతీయ అస్థిరత నెలకొంటుంది. అది ప్రపంచంపై తీవ్ర ఆర్థికపరమైన ప్రభావం పడుతుంది. ఇంధన ధరల భారీ పెరుగుదల (ముడి చమురు), స్టాక్ మార్కెట్ల పతనం, హార్ముజ్ జలసంధిలో వాణిజ్య అంతరాయం కలిగించవచ్చు. చమురు, గ్యాస్ ఎగుమతులకు తీవ్ర ఆటంకం ఎదురుకావచ్చు. పశ్చిమాసియాలో అస్థిరత, భౌగోళిక రాజకీయ ఉద్రిక్తతలు పెరిగి, ప్రపంచ ఆహార, రవాణా రంగాలు దెబ్బతింటాయని నివేకలు హెచ్చరిస్తున్నాయి. మరోవైపు అమెరికా, ఇరాన్ మధ్య యుద్ధాన్ని ఆపేందుకు మిడిల్ ఈస్ట్ దేశాలు గట్టిగానే కృషిచేస్తున్నాయని స్థానిక కథనాల సమాచారం. ప్రత్యక్ష చర్చలు లేనప్పటికీ ఖతార్, తుర్కియేతో సహా ఇతర మధ్యవర్తులుగా చర్చలు సాగిస్తున్నట్టు తెలుస్తోంది. ఏం జరగనుందో వేచిచూడాల్సిందే!

## కేవైసీ అప్‌డేట్ చేయించుకోండి?

## జిల్లా కలెక్టర్ రాజర్షి షా




**ఆదిలాబాద్, ఫిబ్రవరి 9 పెన్ పవర్:** ఖాతాదారులు తమ కేవైసీ వివరాలను ఎప్పటికప్పుడు అప్‌డేట్ చేసుకోవాలని ఆదిలాబాద్ కలెక్టర్ రాజర్షిషా సూచించారు. " కేవైసీని అప్‌టు డేట్ ఉంచండి ? అంతరాయం లేని బ్యాంకింగ్ సేవలు పొందండి" అనే అవగాహన పోస్టర్లు, ఫ్లెక్సీలను ఆయన ఆవిష్కరించారు. కేవైసీ అప్‌డేట్ చేయకపోతే ఖాతాలపై పరిమితులు విధించే అవకాశం ఉందని, అలాగే ఫేక్ కాల్స్‌పై అప్రమత్తంగా ఉండాలని ఆయన ఖాతాదారులకు సూచించారు.

## అక్రమంగా నిల్వ ఉంచిన మద్యం స్వాధీనం

**బోథ్, ఫిబ్రవరి 9 పెన్ పవర్:** ఆదిలాబాద్ లోని కొత్తకొమ్మరివాడలో విశ్వసనీయ సమాచారం మేరకు రామిలి పోశెట్టి నివాసంలో ఎఫ్ఎస్టి బృందం, వన్ టౌన్ పోలీసులు సంయుక్తంగా తనిఖీలు చేపట్టారు. ఎన్నికల నిబంధనలకు విరుద్ధంగా ఇంట్లో నిల్వ ఉంచిన రూ. 7,699 విలువైన మద్యం స్వాధీనం చేసుకున్నారు. ఎఫ్ఎస్టి ఫిర్యాదు మేరకు వన్ టౌన్ పోలీసులు కేసు నమోదు చేశారు. ఎన్నికల నిబంధనలు ఉల్లంఘించిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని సీఐ సునీల్ కుమార్ హెచ్చరించారు.

## బీజేపీ రాష్ట్ర అధ్యక్షులకు స్వాగతం పలికిన ఎమ్మెల్యే ఏలేటి

**ముథోల్, ఫిబ్రవరి 9 పెన్ పవర్:** సోమవారం నిర్మల్ జిల్లా కేంద్రానికి వచ్చిన భారతీయ జనతా పార్టీ రాష్ట్ర అధ్యక్షులు రామచందర్ రావుకు బీజేఎల్పీ నేత, ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్ రెడ్డి పుష్పగుచ్ఛం అందించి, శాలువాతో సత్కరించి స్వాగతం పలికారు. ఈ సందర్భంగా, జిల్లాలోని నిర్మల్, బైంసా, ఖానాపూర్ మున్సిపాలిటీలను కైవసం చేసుకోవాలని రామచందర్ రావు సూచించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ కిసాన్ సెల్ రాష్ట్ర అధ్యక్షులు, మున్సిపల్ ఎన్నికల ఇంచార్జి బస్వపురం లక్ష్మి నర్సయ్య తదితరులు పాల్గొన్నారు. రాబోయే మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో ఈ సమావేశం ప్రాధాన్యత సంతరించుకుంది.

## స్వచ్ఛందంగా ఓటు హక్కును వినియోగించుకోవాలి.. కలెక్టర్

**నిర్మల్, ఫిబ్రవరి 9 పెన్ పవర్:** ప్రజలంతా మున్సిపల్ ఎన్నికలలో స్వచ్ఛందంగా తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ తెలిపారు. సోమవారం నిర్మల్ జిల్లా కేంద్రంలోని ఆర్డీవో కార్యాలయం నుంచి, ఎన్టీఆర్ మినీ స్టేడియం వరకు స్వీప్ ఆధ్వర్యంలో ఓటరు అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఓటు హక్కు అనేది రాజ్యాంగం కల్పించిన గొప్ప వరమని, అది వజ్రాయుధం లాంటిదని కలెక్టర్ వివరించారు. మున్సిపల్ ఎన్నికల్లో ఓటర్లందరూ తమ ఓటు హక్కును వినియోగించుకొని, పట్టణాలలో ఓటింగ్ శాతాన్ని పెంచాలని, ఎటువంటి ప్రలోభాలకు లొంగకుండా నిర్భయంగా ఓటు వేయాలని కోరారు.

## ఉత్సాహంగా జిల్లా స్థాయి సీఎం కప్ పోటీలు

**ఖానాపూర్, ఫిబ్రవరి 9 పెన్ పవర్:** జిల్లా కేంద్రంలోని ఇందిరా ప్రియదర్శిని క్రీడా ప్రాంగణంలో సోమవారం జిల్లాస్థాయి సీఎం కప్ పోటీలు ఉత్సాహంగా సాగాయి. ముఖ్య అతిథులుగా జిల్లా గిరిజన క్రీడల అధికారి పార్థసారథి, జిల్లా యువజన క్రీడల అధికారి శ్రీనివాస్ హాజరయ్యారు. కరాటే, జూడో, బేస్ బాల్, సైక్లింగ్, చదరంగం, క్యారమ్స్, షటిల్ బ్యాడ్మింటన్ క్రీడా పోటీలను ప్రారంభించారు. అంతకుముందు వారు మాట్లాడుతూ గతేడాది ఆదిలాబాద్ జిల్లా పతకాల పట్టికలో అగ్రస్థానంలో నిలిచిందని, ఈసారి కూడా అదే స్ఫూర్తితో అత్యధిక పతకాలు సాధించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఆయా క్రీడా సంఘాల బాధ్యులు దయానంద రెడ్డి, సాయికుమార్, స్వామి, హరిచరణ్ తదితరులు పాల్గొన్నారు.

## మార్కెట్ యార్డుకు 2 రోజులు సెలవు

**హుజూరాబాద్, ఫిబ్రవరి పెన్ పవర్:** జమ్మికుంట వ్యవసాయ మార్కెట్ యార్డుకు మున్సిపాలిటీ ఎన్నికల నేపథ్యంలో ఈ నెల 10, 11 తేదీల్లో సెలవు ప్రకటించినట్లు మార్కెట్ చైర్ పర్సన్ స్వప్న తెలిపారు. ఈ రెండు రోజుల్లో ప్రైవేట్ కొనుగోళ్లు, సీసీఐ ద్వారా జిన్నింగ్ మిల్లుల్లో పత్తి కొనుగోళ్లు, స్లాట్ బుకింగ్‌లు నిలిపివేయబడతాయి. ఫిబ్రవరి 12 నుంచి యథావిధిగా కార్యకలాపాలు కొనసాగుతాయి. రైతులు, ఆర్తి దారులు ఈ విషయాన్ని గమనించాలని సూచించారు.

## ధర్పల్లి మండల కేంద్రంలో మాదిగ జాగృతి సంఘం మండల కమిటీ ఏర్పాటు

**నిజామాబాద్ రూరల్, ఫిబ్రవరి 9 పెన్ పవర్:** ధర్పల్లి మండల కేంద్రంలో డా: విశారదన్ మహారాజ్ ఆదేశాల మేరకు మాదిగ జాగృతి సంఘం మండల కమిటీని సోమవారం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో ఓఏం రాష్ట్ర డైరెక్టర్స్ నాగేశ్వరరావు, సంతోష్, బాగేంద్ర, ఓఏం జిల్లా ప్రధాన కార్యదర్శి ప్రశాంత్ మహారాజ్ ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. మహిపాల్ మహారాజ్ సమన్వయపరచిన ఈ కార్యక్రమంలో పెద్దిదకా కిషన్ మహారాజును మండల అధ్యక్షుడిగా, నగేష్ మహారాజ్ ఉపాధ్యక్షుడిగా, సాయిలు మహారాజ్ ప్రధాన కార్యదర్శిగా, వాణిష్ మహారాజ్ కార్యదర్శిగా, గోపిమహారాజ్ కోశాధికారిగా, బాలయ్య, అశోక్, దిలీప్, శంకర్, రాజేశ్వర్, సుభాష్, గంగాధర్, కిషన్, సాయి నరసయ్య మహారాజులను కమిటీ సభ్యులుగా ఎన్నుకున్నారు.



03
ఇప్పుడు పెన్ పవర్ దిన పత్రికలో
కోర్టు పబ్లికేషన్ యాడ్స్
కేవలం
యాడ్ 500/-
'పో. 12 సెం.మీ, వె. 8 సెం.మీ'
'మరిన్ని వివరాలకు సంప్రదించండి '
93948 55244
షరతులు వర్తిస్తాయి

# ఇంటర్‌నెట్ వినియోగంలో తగు జాగ్రత్తగా తీసుకోలేమా !

**హైదరాబాద్ పెన్ పవర్:** ఆధునిక మానవుడు అంతర్జాల వలయంలో మునిగి తేలుతున్నాడు. స్మార్ట్‌ఫోన్ రాకతో అతి సామాన్యుల ముంగిట్లో కూడా ఇంటర్నెట్ ప్రవేశించింది. మితిమీరిన వాడకంతో ఇంటర్నెట్ దురలవాటు బారిన కూడా యువత, పిల్లలు పడడం చూస్తున్నాం. అంతర్జాల రాకతో విశ్వ విజ్ఞానం మన అరచేతిలో ఇమిడి పోయింది. అంతర్జాలంతో అసంఖ్యాక ప్రయోజనాలు ఉన్నప్పటికీ దాని పట్ల జాగ్రత్తగా ఉండని యెడల పలు ప్రమాదకర నష్టాలు కూడా మన అనుభవంలోకి వస్తున్నాయి. అంతర్జాలాన్ని వినియోగిస్తున్న నెటిజెన్లు పలు సందర్భాల్లో ప్రతికూల అనుభవాలు, సైబర్ బుల్లీయింగ్, తిట్ల దండకాలు, అక్రమ వినియోగాలు, అసభ్యకర అవమానకర మాటలను వినవలసి వస్తున్న వేళ సురక్షిత ఇంటర్నెట్ పట్ల అవగాహన కల్పించాల్సిన అగత్యం ఏర్పడింది. అంతర్జాలం వాడడం తప్పనిసరి అవుతున్న దాని పట్ల కనీస పరిజ్ఞానం, తగు జాగ్రత్తలు తీసుకోవడం కనీస అవసరం అవుతున్న వేళ ఇంటర్నెట్‌ను సురక్షితంగా వినియోగించుకునే మార్గాలను అవగాహన పరచడానికి 2004 నుంచి ప్రతి ఏట 10 ఫిబ్రవరిన ప్రపంచ దేశాలు "సురక్షిత అంతర్జాల దినం" లేదా "సేఫర్ ఇంటర్నెట్ డే"పాటించడం ఆనవాయితీగా మారింది. నేటి సమాజంలో విద్యాలయాలు, కుటుంబాలు, బంధు

మిత్రులు, సహచర వర్గాలు, పౌర సమాజాల్లో సురక్షితంగా అంతర్జాలాన్ని ఎలా వినియోగించాలో ప్రజలకు, విద్యార్థులకు తెలుపవలసిన అవసరం వచ్చింది. ఆన్‌లైన్‌లో గౌరవంగా మాట్లాడడం, సత్ప్రవర్తనతో వినియోగించడం, సహానుభూతి ప్రదర్శించడం, హానికరమైన చర్యలకు దూరంగా ఉండడం లాంటివి మనం ఆచరణలో పెట్టాలి. సురక్షిత అంతర్జాల దినం-2026 ఇతివృత్తంగా "అందరు కలిసి సురక్షిత అంతర్జాలాన్ని నిర్మించుకుందాం" అనబడే అంశాన్ని తఈసుకున్నారు. అంతర్జాల ప్రధాన దుర్వినియోగాల్లో సైబర్ బుల్లీయింగ్, ఆన్‌లైన్ ఆర్థిక మోసాలు, ఫిషింగ్ స్కామ్, డాటా బ్రీచింగ్, అనధికారిక చొరబాట్లు, మాల్‌వేర్, ఆన్‌లైన్ గేమింగ్, వ్యక్తిగత సమాచార దుర్వినియోగం, ఆన్‌లైన్ ప్రిడేటర్స్, సెక్స్‌టింగ్, రాన్‌సమ్‌వేర్, సైబర్ క్రైమ్స్, ఆన్‌లైన్ బెట్టింగ్ మోసాలు,

ఆన్‌లైన్ అప్పుల వేధింపులు, డిజిటల్ అరెస్టులు, వ్యక్తిగత సమాచారాన్ని దోచేసి వేధించడం లాంటి పలు అంశాల పట్ల తగు జాగ్రత్తగా ఉండడం అనివార్యం అయ్యింది. వీటి పట్ల అవగాహన లేని యెడల పలు చిక్కులను ఎదుర్కోవలసి వస్తుందని తెలుసుకోవాలి. మోసపోయిన తర్వాత దుఃఖించి ప్రయోజనం లేదని, ముందు జాగ్రత్తలు తీసుకుంటూ ఇంటర్నెట్‌ను సురక్షితంగా వాడడం నేర్చుకొని భద్రంగా అంతర్జాల వలలో ఆనంద తాండవం ఆడుదాం, మోసాలు చేయజూస్తున్న ఆన్‌లైన్ మోసగాండ్లకు ముచ్చెమటలు పట్టిస్తూ వారి భరతం పడదాం.

# మూర్ఛరోగంపై దాడి చేయలేమా !

**హైదరాబాద్ పెన్ పవర్:** మెదడులో అసాధారణ విద్యుత్ కదలికల మూలంగా నాడీమండలంలో ప్రతికూల మార్పులు చోటు చేసుకొనే రుగ్మతను "మూర్ఛరోగం" లేదా "కాకిసోమాల" లేదా "ఎపిలెప్సీ" పేరుతో పిలుస్తున్నాం. ప్రపంచవ్యాప్తం మిలియన్ల అభాగ్యుల జీవితాల్లో చీకట్లు నింపుతున్న మూర్ఛరోగం వల్ల అప్పుడప్పుడు మూర్ఛపడిపోయి కాళ్లు, చేతులు విచిత్ర కదలికలను చూపడాన్ని ఎపిలెప్సీ ప్రధాన లక్షణాలుగా తీసుకోవాలి. అనాదిగా మానవాళికి శాపంగా మారుతున్న మూర్ఛరోగం పట్ల సమాజంలో అపార్థాలు, భయాలు, దాని గూరించి చర్చించడమే పాపమనే భావనలు, అవగానలోపాలు అలుముకొని ఉన్నాయి. సాధారణ పౌరుల కన్న మూర్ఛరోగులు "సుడెప్ (సడెన్ అన్ఎక్స్‌ప్లేన్డ్ డెత్ ఇన్ ఎపిలెప్సీ)" అనే అనారోగ్యంతో అకాల మరణాలు పొందడం విచారకరం. పౌర సమాజంలో మూర్ఛరోగుల ఎదుర్కొంటున్న అపోహలు, అపరిమిత వివక్షల వల్ల మూర్ఛరోగం పెట్టే బాధ కన్న అధికంగా మానసిక బాధలను అనుభవిస్తున్నారు. మూర్ఛరోగం పట్ల అపోహలు, అనుమానాలు, వివక్షలు, అవగాహనాలోపాలను నివృత్తి చేయడంతో పాటు వ్యాధి లక్షణాలు, నిర్ధారణ, వైద్య చికిత్సలు, ఎపిలెప్సీ పరిశోధనల గూర్చి చర్చించడానికి ప్రతి ఏట ఫిబ్రవరి నెల 2వ సోమవారం రోజున, అనగా 09 ఫిబ్రవరి 2026న ప్రపంచ దేశాలు "అంతర్జాతీయ మూర్ఛరోగ దినం" లేదా "వరల్డ్ ఎపిలెప్సీ డే"ను 2015 నుంచి పాటించుట ఆనవాయితీగా మారింది. మూర్ఛరోగుల మానవ హక్కుల పరిరక్షణ, ఆత్మవిశ్వాసం పెంపొందే విధంగా పౌరసమాజ గౌరవం ఇవ్వడం వల్ల ఆ అభాగ్యుల తమ పూర్తి జీవితకాలం సంతోషంగా బతికే అవకాశం ఉంటుందని తెలుసుకొని తగు విషయ పరిజ్ఞానాన్ని ప్రజలకు కల్పించాలని మరువరాదు. మూర్ఛరోగులతో పాటు వారి కుటుంబాలు, రోగుల సహాయకులు అనుభవించే మానసిక క్షోభకు కూడా దృష్టిలో పెట్టుకొని మనం గట్టి ప్రయత్నాలు చేయడం తప్పనిసరి అని భావించాలి. ప్రపంచవ్యాప్తంగా దాదాపు 70 మిలియన్ల మూర్ఛరోగులు ఉండగా, అందులో దాదాపు 12 మిలియన్ల భారతీయ రోగులు ఉన్నారని అంచనా. మూర్ఛరోగుల్లో 90 శాతం మంది అభివృద్ధి చెందుతున్న దేశాల్లోనే ఉండడం గమనించారు. పట్టణ ప్రాంతాలతో పోల్చితే గ్రామీణ భారతంలో మూర్ఛరోగులు అధికంగా ఉండడం, అవగాహన లేపంతో వారి జీవితాలు అంధకారంలోకి నెట్టబడడం చూస్తున్నాం. ప్రతి వెయ్యి మందిలో 3 -11 మంది మూర్ఛరోగ లక్షణాలను కలిగి ఉన్నట్లు, వారికి సకాలంలో వైద్య సహాయం అందక పోవడంతో రోగం ముదిరి ప్రాణాంతకంగా కూడా మారుతున్నట్లు అధ్యయనాలు వెల్లడిస్తున్నాయి. భారత్‌లో ప్రతి ఏట 1.25 లక్షల కొత్త కేసులు బయట పడడం, అందులో 30 శాతం మంది 18 ఏండ్ల లోపు వారు ఉండడం ప్రమాదకర పరిణామంగా తీసుకోవాలి. కొన్ని అంటువ్యాధులు కూడా మూర్ఛరోగాలకు కారణం అవుతున్నాయని గమనించాలి. మన సమాజంలో నెలకొన్న మూఢవిశ్వాసాలు, అపోహలు, అనర్థాలతో రోగుల పరిస్థితి పెనెంలోంచి పొయ్యిలోకి తోసివేయబడుతున్నది. రోగ లక్షణాలను గుర్తించకపోవడం, సరైన సమయంలో చికిత్సలకు చొరవ తీసుకోకపోవడంతో మూర్ఛ రోగులు, ముఖ్యంగా మహిళలు, పిల్లలు తీవ్ర ఒత్తిడికి లోనవుతున్నారు. దీనికి తోడుగా భారత్ లాంటి అభివృద్ధి చెందుతున్న దేశాల్లో న్యూరాలజిస్టులు, సుశిక్షిత వైద్య సిబ్బంది, తగు మౌళిక వనరులు, సంరక్షకుల కొరత కూడా మూర్ఛరోగుల పాలిట శాపంగా మారుతున్నది. మూర్ఛ రోగాలకు కారణాలుగా జన్యుపరమైన సమస్యలు, మెదడు ఇన్‌ఫెక్షన్లు, స్ట్రోక్‌లు, ట్యూమర్స్, శిశు జనన సమయంలో గాయాలు, శారీరక అభివృద్ధి రుగ్మతలు, తలకు బలమైన గాయాలు కలగడం, కుటుంబ ఆరోగ్య చరిత్ర, జీవనశైలి మార్పులు, డిమెన్షియా, అధిక జ్వరం లాంటి రోగ లక్షణాలు కలుగుతాయి. మూర్ఛరోగ నివారణకు తీసుకోవలసిన జాగ్రత్తల్లో వైద్య చికిత్సలు, తొలి దశలోనే గుర్తించడం, సురక్షిత ఇంటి వాతావరణం, శారీరక శ్రమ పరిమితంగా చేయడం, ఇరుగు పొరుగుకు రోగం పట్ల అవగాహన కల్పించడం, జీవనశైలిని అనుకూలంగా మార్చుకోవడం, తగినంత నిద్ర పోవడం, నీటిని ఎక్కువగా తాగడం, ఆల్కహాల్‌కు దూరంగా ఉండడం, పోషకాహారాన్ని తీసుకోవడం, మానసిక శారీరక ఒత్తిడి లేకుండా చూసుకోవడం, తరుచుగా వైద్యుల సూచనలు తీసుకోవడం లాంటివి ప్రధానమైనవిగా నిర్ధారించారు. ప్రపంచ ప్రజారోగ్య వ్యవస్థలకు సవాళుగా నిలుస్తున్న ఎపిలెప్సీ వ్యాధిని కట్టడి చేయడానికి అవసరమైన అవగాహనను పొందడం, పౌరసమాజాన్ని జాగృత పరచడం, రోగుల్లో ధైర్యాన్ని నూరి పోయడం, ఆన్‌లైన్/ఆఫ్‌లైన్ వేదికల్లో విస్తృత ప్రచారాలు నిర్వహించడం, విద్యా సంస్థల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహించడం తరుచుగా జరిగినపుడు మూర్ఛరోగ కేసులు తగ్గడంతో పాటు రోగులు సమాజంలో గౌరవంతో జీవితాలను గడపడం జరుగుతుందని గమనిద్దాం, మన వారి యోగక్షేమాలను మనమే చూసుకుందాం.

## తిరుమలగిరిలో కాంగ్రెస్ జెండా ఎగరాలి..

**నకిరేకల్, ఫిబ్రవరి 9 పెన్ పవర్:** తిరుమలగిరి మండల కేంద్రంలో మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి డియా సమావేశంలో మాట్లాడుతూ తిరుమలగిరి మున్సిపాలిటీలో కాంగ్రెస్ పార్టీ జెండా ఎగరవేయాలని ప్రజలకు, కార్యకర్తలకు, నాయకులకు సూచించారు. బీఆర్ఎస్, బీజేపీ పార్టీలు రెండూ ఒకటేనని, వాటికి ఓట్లు వేయడం మురికి కాలువలో వేసినట్లేనని విమర్శించారు. తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా మున్సిపాలిటీలను కాంగ్రెస్ పార్టీ క్లీన్ స్వీప్ చేస్తుందని ధీమా వ్యక్తం చేశారు. ఈ సమావేశంలో ఎంపీ చామల, ఎమ్మెల్యే సామేలు పాల్గొన్నారు.

## కాంగ్రెస్, బీఆర్ఎస్.. రెండు పార్టీలు ఒక్కటే

**నల్గొండ, ఫిబ్రవరి 9 పెన్ పవర్:** రాష్ట్రంలో కాంగ్రెస్‌కి ఓటేసినా.. బీఆర్ఎస్‌కు వేసినా ఒక్కటేనని భాజపా రాష్ట్ర అధ్యక్షుడు రామచంద్రరావు ఎద్దేవా చేశారు. ఒకరు దొంగ అయితే.. మరొకరు దోపిడీ దొంగ అని ఆరోపించారు. బీఆర్ఎస్‌లో గెలిచిన ఎమ్మెల్యేలు ఇప్పుడు ఎక్కడున్నారని ప్రశ్నించారు. అదే భాజపా నేతలు ఓడినా.. గెలిచినా ఒకే పార్టీలో ఉంటారని తెలిపారు. గత ప్రభుత్వం చేసిన తప్పులనే ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తోందన్నారు. నల్గొండ క్లాక్ టవర్ సెంటర్లో ఏర్పాటు చేసిన కార్పొరేషన్

ఎన్నికల విజయ సంకల్ప సభలో ముఖ్య అతిథిగా ఆయన పాల్గొన్నారు. కేంద్రం నుంచి వచ్చే నిధులను కాంగ్రెస్ ప్రభుత్వం దారి మళ్లిస్తోందని విమర్శించారు. నల్గొండ మున్సిపల్ కార్పొరేషన్‌లో భాజపా జెండా ఎగరబోతోందని జోస్యం చెప్పారు.

## ఎన్నికల ప్రలోభాలపై అధికారుల ఉక్కుపాదం, నిఘా ముమ్మరం

**కరీంనగర్, ఫిబ్రవరి 9( పెన్ పవర్:** ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఎన్నికల ప్రలోభాలను అరికట్టేందుకు అధికారులు, పోలీసులు నిఘాను ముమ్మరం చేశారు. ప్రతి మున్సిపాలిటీ పరిధిలో ఫ్లయింగ్ స్క్వాడ్లు నిరంతరం గస్తీ కాస్తున్నాయి. జిల్లా సరిహద్దుల్లో చెక్ పోస్టులు ఏర్పాటు చేసి, వాహనాల తనిఖీని కఠినతరం చేశారు. ఫిబ్రవరి 28 వరకు జిల్లాలో పోలీసు యాక్ట్ అమలులో ఉంటుందని సీపీ తెలిపారు.

## హస్తం గుర్తుకు ఓటేద్దాం, వేములవాడ అభివృద్ధిని కొనసాగిద్దాం

**వేములవాడ, ఫిబ్రవరి 9 పెన్ పవర్:** వేములవాడ పట్టణంలోని 24వ వార్డులో మున్సిపల్ ఎన్నికల ప్రచారంలో రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ పాల్గొన్నారు. అన్నారం శ్రీనివాస్ కు మద్దతుగా ఇంటింటికీ వెళ్లి, చేతి గుర్తుపై ఓటు వేసి గెలిపించాలని ఆయన ఓటర్లను కోరారు. వేములవాడ అభివృద్ధిని కొనసాగించడమే లక్ష్యంగా ప్రచారం సాగింది.


# ఎక్స్ కిరణాల ఆవిష్కర్త రాంట్జెన్

**హైదరాబాద్ పెన్ పవర్:** 19 వ శతాబ్దం సంచలనాత్మక శాస్త్రీయ ఆవిష్కరణలకు స్వర్ణ యుగం. అలాంటి యుగంలో భౌతిక శాస్త్ర ప్రొఫెసర్ విల్హెల్మ్ కాన్రాడ్ రాంట్జెన్ ఒక వింతను కనుగొన్నాడు, దానిని చాలా మంది నమ్మలేదు. రాంట్జెన్ యొక్క ఆవిష్కరణ వార్తలు జనవరి 1896 ప్రారంభం నుండి ప్రపంచ వ్యాప్తంగా వ్యాపించాయి. శాస్త్రవేత్తలు సైతం నివేదికలను ప్రాక్టికల్ జోకర్ ఉపాయం అని కొట్టి పారేశారు.రోగ నిర్ధారణకు కొత్త ఒరవడిని సృష్టించి, ప్రపంచంలో వైద్య రంగంలో రోగ నిర్ధారణకు (రేడియోగ్రఫీ), రోగ నిర్మూలనకు (రేడియో థెరఫీ) కొరకు ఉపయోగించే ఎక్స్ కిరణాలను కనుగొన్న ప్రఖ్యాత శాస్త్రవేత్త విల్హెల్మ్ కన్రాడ్ రాంట్జెన్. ఆయన కనుగొన్న ఎక్స్ కిరణాలు వైద్యరంగం లోనే కాక భద్రతా రంగంలో ఉపయోగ పడుతున్నాయి. విల్హెల్మ్ కన్రాడ్ రాంట్జెన్ (మర్చి 27,1845 – 1923 ఫిబ్రవరి 10) జర్మన్ దేశ భౌతిక శాస్త్ర శాస్త్రవేత్త. 1895 నవంబరు 8 న విద్యుదయస్కాంత తరంగాలలో వివిధ తరంగ దైర్ఘ్యాలుల అవధులలో గల ఎక్స్- కిరణాలను కనుగొన్నాడు. ఈ పరిశోధన వల్ల 1991 లో భౌతిక శాస్త్రంలో మొదటి సారి నోబెల్ బహుమతి పొందాడు. ఆయన చేసిన కృషికి గాను ఆవర్తన పట్టిక లో 111 పరమాణు సంఖ్య గల మూలకానికి రాంట్ జీనియమ్ అనిపేరు పెట్టి గౌరవించారు. రాంట్జన్ 1845 మార్చి 27 న జర్మనీలోని లెన్నెస్ లో జన్మించాడు. ఈయన తండ్రి ఒక రైతు. తల్లి ఒక డచ్ మహిళ. హాలెండ్ లో విద్యాభ్యాసం జరిగింది. 1865 లో యుట్రెచ్ యూనివర్సిటీ లో చేరుటకు ప్రయత్నాలు ప్రారంభించాడు. కాని జూరిచ్ లో గల ఫెడెరల్ పాలిటెక్నిక్ సంస్థలో చేరి పరీక్షలను ఉత్తీర్ణుడయ్యాడు. అక్కడ మెకానికల్ ఇంజనీరుగా చేరాడు. 1869లో తత్వ శాస్త్రములో జూరిచ్ విశ్వ విద్యాలయం నుండి పి.హెచ్.డి పట్టాను పొందాడు. ఆ విశ్వ విద్యాలయంలో ప్రముఖ ప్రొఫెసర్ అయిన ఆగస్టు కుండ్త్ కు ప్రియమైన శిష్యుడయ్యాడు. 1874 లో స్టాన్ ఫర్డు విశ్వ విద్యాలయంలో అద్యాపకునిగా నియమించ బడ్డాడు. 1875 లో హోహెనీం విశ్వ విద్యాలయంలో ప్రొఫెసర్ గా, తర్వాత 1876 లో స్టాన్ ఫర్డు విశ్వ విద్యాలయంలో మరల అద్యాపకునిగా, 1888 లో గీసన్ విశ్వ విద్యాలయంలో భౌతిక శాస్త్ర ఆచార్యునిగా, తర్వాత వుర్జ్ బర్గ్ విశ్వ విద్యాలయంలో భౌతిక శాస్త్ర విభాగంలో విధులు నిర్వర్తించాడు. 1900లో ప్రభుత్వ అభ్యర్ధనపై మంచ్ యూనివర్సిటీలో చేరాడు. ఆయన కుటుంబం యు.ఎస్.ఎకు వలస వెళ్ళాలని నిర్ణయించు కున్నారు. న్యూయార్క్ లో కొలంబియా యూనివర్సిటీ వారు అవకాశం యిచ్చినప్పటికీ మొదటి ప్రపంచ

యుద్ధం కారణంగా తన శేష జీవితాన్ని మునిచ్ నందే గడిపాడు. 1895 వరకు ఉత్సర్గనాళ ప్రయోగాలలో హెర్జ్, జాన్ హిటార్ఫ్, విలియం క్రూక్స్, టెస్లా,లీనార్డో లతో పని చేశాడు. ఎక్స్ కిరణాలను రాయింట్ జన్ కిరణాలని అంటారు. కాని రాంట్జెన్ స్వయంగా వాటిని ఎక్స్ కిరణాలని పిలిచాడు.ఈ కిరణాలను కనుగొని లోకానికి పరోపకారం చేసినందుకు కృతజ్ఞతగా ఆయనకు 1901 లో భౌతిక శాస్త్రంలో నోబెల్ బహుమతి లభ్యమయింది. ఈ ఎక్స్ రే వెనుక ఎంతో ఆసక్తి కరమైన కథ ఉంది. రాయింట్ జన్ కేథోడ్ రే ట్యూబ్ (శూన్య గాజు నాళం) తో పరిశోధనలు చేసేవాడు. గది అంతా చీకటిగా ఉన్నప్పుడు యీ ట్యూబ్ గుండా కాంతి కిరణాలను పంపడం జరిగింది. పైగా ట్యూబ్ చుట్టూ నల్లని కాగితాన్ని కాంతి కిరణాలు ఏ కొంచెం కూడా వెలువడ కుండా కప్పి ఉంచాడు. ఇలా చేసినప్పటికి కాథోడ్ ట్యూబ్ కు సమీపంలో ఉన్న బేరియం ప్లాటినో సైనైడ్ స్ఫటికం వింత మెరుపులతో ప్రకాశించ సాగింది. నల్లటి కాగితాన్ని కప్పి ఉంచినప్పటికీ కాథోడ్ ట్యూబ్ నుంచి ఏవో అజ్ఞాత కిరణాలు వెలువడి బేరియం ప్లాటినో సైనైడ్ స్ఫటికం మీద పడి అది మెరిసేటట్లు చేసిందని ఆయన ఊహించగలిగాడు. ఈ కిరణాలను కాగితం గుండా, చెక్కగుండా, లోహపు పలకల గుండా ప్రయాణం చేయగలవని యాయన కనుగొన్నాడు. ఈ కిరణాలు కూడా ఓ రకమైన కాంతి కిరణాలే అని అయితే వీటి తరంగ దైర్ఘ్యం చాలా తక్కువ కావటం వల్ల మనుషుల కళ్ళకు కనిపించవని రాయింట్జన్ వెల్లడించాడు. మామూలు కాంతి కిరణాలే ఫోటోగ్రాఫిక్ ప్లేట్ల మీద ప్రభావం చూపుతూ ఉండగా, యీ కిరణాలు మాత్రం చూపకుండా ఉంటాయా అనే ఆలోచన రాయింట్ జెన్ కి రావటం – శాస్త్ర ప్రపంలో ఒక సరికొత్త అధ్యాయానికే కారణ భూతమైనది. ప్రయోగం చేయటం కోసం రాంట్జెన్ ఫోటో గ్రాఫిక్ ప్లేటు మీద తన భార్య చేతిని ఉంచి యీ కిరణాలను ప్రసారం చేసి ఫోటోను డెవలప్ చేసి చూసి ఆశ్చర్య పోయాడు. చేతి ఎముకలు ఉంగరంతో సహా ఆ ఫోటో లో వచ్చింది. చుట్టూ మాంసం ఉన్నట్లు మసక మసకగా ఉంది. అంటే సజీవంగా ఉన్న మనిషి కంకాళాన్ని ఈ కిరణాల ద్వారా ఫోటో తీయవచ్చని స్పష్టంగా తేలింది. దురదృష్ట వశాత్తు రాంట్జెన్, ఆయనతో కలిసి పనిచేసిన మరో ఇద్దరు పరిశోధకులు యీ ఎక్స్ కిరణాల తాకిడికే క్రమ క్రమంగా మరణించాడు. ఈ ఎక్స్–కిరణాల వల్ల ఎంతో ప్రయోజనం కలుగుతున్నప్పటికీ వాటిని మితిమీరి వాడితే మాత్రం ప్రమాదం తప్పదని,యీ కారణంగానే ఎక్స్–కిరణాలను నిరంతరం గురి కాబట్టే రాంట్జెన్ ఆ కిరణాల ప్రభావంగానే చని పోయాడని రుజువైంది. రేడియో ధార్మికత నుండి రక్షించు కొనుటకు సీసపు కవచాలు వాడే కొద్దిమంది మార్గ నిర్దేశకులో ఆయన ఒకరు.ఆయన చేసిన ఆవిష్కరణలకు పేటెంట్ హక్కులు కూడా తీసుకోలేదు. నోబెల్ బహుమతిగా వచ్చిన ధనమును వర్జ్ బర్గ్ విశ్వ విధ్యాలయమునకు విరాళంగా యిచ్చాడు. మొదటి ప్రపంచ యుద్ధం వల్ల యేర్పడే ద్రవ్యోల్బణం వల్ల రాంట్జెన్ చాలా పేదరికంలో మగ్గాడు. తన శేష జీవితాన్ని మునిచ్కి సమీపంలో గల విల్ హెల్మ్ లో గల యింటిలో గడిపాడు. ఆయన కోరిక ప్రకారం ఆయన వ్యక్తిగత, శాస్త్రమునకు సంబంధించిన ఉత్తర ప్రత్యుత్తరాలు ఆయన మరణం తర్వాత నాశనం చేయటం జరిగింది. 1901 లో రాంట్జెన్ కు మొదటి భౌతిక శాస్త్రంలో నోబెల్ బహుమతి వచ్చింది. ఈ బహుమతి ఆయన ఎక్స్ కిరణాలు కనుగొని విశేష సేవలందించినందుకు గాను యివ్వ బడింది. కాని రాంట్ జెన్ ఆ బహుమతికి వచ్చిన ఆర్థిక ప్రతిఫలాన్ని తన విశ్వ విద్యాలయమునకు దానమిచ్చాడు. పియరీ క్యూరీ వలే రాంట్జెన్ తన పరిశోధనకు పేటెంట్ హక్కులను తిరస్కరించాడు. మానవాళికి తన పరిశోధన యొక్క ఫలితాలు ఉపయోగకరంగా ఉండాలని, ఈ కిరణాలకు తన పేరు కూడా పెట్టరాదని కోరుకున్నాడు.

# మళ్లీ ఎలక్షన్ ఫీవర్.. స్థానిక సంస్థలకు ఎన్నికలు.

**విజయవాడ, ఫిబ్రవరి 9, పెన్ పవర్:**
ఆంధ్రప్రదేశ్‌లో స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణ కసరత్తు ప్రారంభమైంది. ఓటర్ల జాబితా తయారీ కోసం రాష్ట్ర ఎన్నికల సంఘం జిల్లా కలెక్టర్లకు ఆదేశాలు జారీ చేసింది. జనవరి ఒకటో తేదీ ప్రామాణికంగా ఓటర్ల జాబితా నవీకరించాలని.. మార్చి 9వ తేదీ నాటికి ఓటర్ల తుది జాబితా ప్రకటించాలని కలెక్టర్లను ఎన్నికల సంఘం ఆదేశించింది. మరోవైపు ఏపీలో మున్సిపాలిటీ, కార్పొరేషన్ల పదవీకాలం మార్చి 17తో ముగియనుంది. అలాగే గ్రామ పంచాయతీలో పదవీకాలం ఏప్రిల్ 2వ తేదీతో ముగియనుంది.ఏపీలో మళ్లీ ఎన్నికల హడావిడి మొదలు కానుంది. స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణకు కసరత్తు మొదలైంది. ఒకటి రెండు నెలల్లో ఏపీలోని పంచాయతీలు, మున్సిపాలిటీ, కార్పొరేషన్ల పదవీకాలం ముగియనుంది. ఈ నేపథ్యంలో రాష్ట్ర ఎన్నికల సంఘం స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణకు కసరత్తు ప్రారంభించింది. ఇందులో భాగంగా కొత్త ఓటర్ల జాబితా రూపకల్పన కోసం ఏపీ రాష్ట్ర ఎన్నికల సంఘం శనివారం నోటిఫికేషన్లు జారీ చేసింది. ఓటర్ల జాబితా తయారీని వెంటనే ప్రారంభించాలని.. మార్చి నెల 9వ తేదీన ఫోటోలతో సహా ఓటర్ల తుది జాబితాను ప్రచురించాలని జిల్లా కలెక్టర్లకు ఎస్ఈసీ నీలం సాహ్ని ఆదేశాలు జారీ చేశారు. మరోవైపు సీఈవో కార్యాలయం నుంచి అసెంబ్లీల వారీగా ఓటర్ల జాబితాలు సేకరించిన రాష్ట్ర ఎన్నికల సంఘం.. ఆ వివరాలను సర్వర్లలో రికార్డు చేసింది.మరోవైపు మున్సిపల్ కమిషనర్లు, జిల్లా పంచాయతీ అధికారులకు లాగిన్లు ఇచ్చారు. ఈ లాగిన్ల ద్వారా జాబితాలు సేకరించుకుని.. వాటిలో నుంచి




మున్సిపాలిటీలు, కార్పొరేషన్లు, పంచాయతీల వారీగా ఓటర్ల జాబితా సిద్ధం చేయాలని ఎన్నికల సంఘం ఆదేశించింది. స్థానిక సంస్థల ఎన్నికలకు ముందస్తు ఏర్పాట్లలో భాగంగానే ఓటర్ల జాబితా తయారు చేయనున్నట్లు తెలిపింది. 2026 జనవరి ఒకటో తేదీని ప్రామాణికంగా తీసుకుని ఓటర్ల జాబితా అప్ డేట్ చేయాలని సూచించింది.ఏపీలో 123 పట్టణ స్థానిక సంస్థలు ఉన్నాయి. 87 నగర పంచాయతీలు, మున్సిపాలిటీ, కార్పొరేషన్ల పదవీకాలం మార్చి 17తో ముగుస్తుంది. ఇక 36 పట్టణ స్థానిక సంస్థలలో కోర్టు కేసులు, ఇతర కారణాలతో ఎన్నికలు జరగలేదు. ఈ నేపథ్యంలోనే ఈ రెండూ కలిపి 123 పట్టణ స్థానిక సంస్థలలో ఎన్నికల నిర్వహణకు ఏర్పాట్లు జరుగుతున్నాయి.వీటిలోని వార్డులు, డివిజన్ల వారీగా ఓటర్ల జాబితా తయారు కానుంది. అలాగే ఏపీలోని 13,098 పంచాయతీల పదవీ కాలం ఏప్రిల్ రెండో తేదీతో ముగియనుంది. 253 పంచాయతీల్లో వివిధ కారణాలతో ఎన్నికలు నిర్వహించలేదు. తాజాగా మొత్తంగా 13,351 పంచాయతీలలోనూ ఎన్నికల నిర్వహణ కోసం ఓటర్ల జాబితా సిద్ధం చేయనున్నారు. ఈ నేపథ్యంలో త్వరలోనే ఏపీలో స్థానిక సంస్థల ఎన్నికలు జరిగే అవకాశాలు ఉన్నాయి

# సాఫ్ట్ గా మాధవ్.. ఇక పెరిగేది ఎలా

**విశాఖపట్టణం, ఫిబ్రవరి 9, పెన్ పవర్:**
దక్షిణాదిలో ఏపీలో మాత్రమే బీజేపీకి చెప్పుకోదగ్గ గ్రెంథ్ లేదు. ఒంటరిగా పోటీ చేస్తే ఒక్క సీటు కూడా వచ్చే సీన్ లేదు. అందుకే కూటమిలో భాగంగా ఉంటూనే..నవ్యాంధ్రలో కమల వికాసం కోసం ఎత్తులు వేస్తున్నారు జాతీయ పార్టీ ఇచ్చిన కార్యక్రమాలను నిర్వహించడం తప్ప.. గ్రామస్థాయి నుంచి పార్టీ నిర్మాణం కోసం, క్యాడర్ బలోపేతం కోసం అధ్యక్షుడిగా మాధవ్ కొత్తగా చేస్తున్నదేమి లేదన్న గుసగుసలు వినిపిస్తున్నాయి. అధ్యక్షుడు చేపడుతున్న కొద్దిపాటి యాక్టివిటీకి కూడా పార్టీ నేతలు, ప్రజాప్రతినిధుల నుంచి కోఆపరేషన్ లేదని క్యాడర్ ఆవేదన వ్యక్తం చేస్తోంది. 2019లో ఒంటరిగా పోటీ చేసి ఓట్లు తెచ్చుకోవడం తప్ప..ఒక్క సీటు కూడా గెల్వలేకపోయింది బీజేపీ. 2024కు వచ్చే సరికి కూటమిగా జత కట్టి..అసెంబ్లీతో పాటు పార్లమెంట్ ఉభయ సభల్లో ఏపీ నుంచి ప్రాతినిధ్యం దక్కించుకుంది.కమలనాథులు.ఇప్పటికంటే ఇంకింత బలంగా..మరింత స్ట్రాంగ్‌గా నిలబడేందుకు సరికొత్త స్ట్రాటజీస్ ప్లే చేస్తున్నారు. అందుకే ఓ చేతిలో బీజేపీ జెండా..ఇంకో చేతిలో కూటమి అజెండాతో..కలిసి నడుద్దామ్. పార్టీ కోసం కష్టపడుదామంటూ ఏపీ బీజేపీ చీఫ్ పీవీఎన్ మాధవ్ పిలుస్తున్నారు. కానీ సీనియర్ లీడర్లలో మాత్రం ఆ దూకుడు కనిపించట్లేదట.అదే కూటమిలో భాగస్వామిగా ఉన్న టీడీపీ, జనసేన నేతలు, కార్యకర్తలు దూసుకెళ్తున్న స్పీడుగా..కమలనాథులు ప్రజల్లోకి వెళ్లలేకపోతున్నారట. దీంతో ఏపీలో బీజేపీ మినహా మిగతా రాజకీయ పార్టీలన్నీ యాక్టీవ్‌గానే ఉన్నాయన్న చర్చ జరుగుతోంది. అధికార కూటమి కీలకంగా ఉన్న టీడీపీ..మళ్లీ పవర్‌లోకి రావాలని ఎత్తులు వేస్తున్న వైసీపీ..ఎక్కడా తగ్గట్లేదు. రేపే ఎలక్షన్స్ ఉన్నాయన్నట్లుగా ఆ రెండు పార్టీలు ఎప్పుడూ సూపర్ యాక్టీవ్‌గా ఉంటున్నాయి.జనసేన కూడా అటు పార్టీ



నిర్మాణంలోనూ ఇటు పొలిటికల్‌గాను దూకుడు మీదుంది. చివరికి కాంగ్రెస్ పార్టీ కూడా ఏదొక హడావుడి చేస్తూనే ఉంటుంది. పార్టీకి క్యాడర్, లీడర్లు లేకపోయినా షర్మిల చేసే పొలిటికల్ కామెంట్స్ నిత్యం ప్రజల్లో చర్చనీయాంశం అవుతున్నాయి. కానీ ఏపీలో బీజేపీ మాత్రం అంత యాక్టీవ్‌గా కనిపించట్లేదన్న చర్చ ఉంది.ఏపీలో కూటమిలో భాగస్వామిగా ఉన్నా అటు ప్రభుత్వంలోనూ ఇటు పొలిటికల్ గాను పార్టీ యాక్టివిటీ చాలా తక్కువ. ఇక పార్టీ బలోపేతం కోసం, పార్టీని ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు బలమైన ప్రయత్నాలేమి జరగడం లేదని కార్యకర్తలే చర్చించుకుంటున్న పరిస్థితి. దీనికి కారణం బీజేపీ కీలక నేతలు సైలెంట్ మోడ్‌లో ఉండటమే అంటున్నారు.కేంద్రంలో అధికారంలో ఉంటూ..చాలా రాష్ట్రాల్లో పవర్‌లో కొనసాగుతూ..ఏపీ ప్రభుత్వంలో కీరోల్ ప్లే చేస్తున్నప్పటికీ..ఏపీలో మాత్రం ఆశించినంతగా కమలం లీడర్లు దూకుడు ప్రదర్శించడం లేదంటున్నారు. పక్కనే ఉన్న తెలంగాణలో బీజేపీ లీడర్లు అధికారంలోకి వచ్చేది తామేనని చెప్పుకుంటూ..అటు కాంగ్రెస్, ఇటు బీఆర్ఎస్‌ను ఢీకొడుతూ ముందుకెళ్తుంటే..ఏపీ బీజేపీ లీడర్లు పార్టీని గాలికి వదిలేశారని క్యాడర్ బాణాలు ఎక్కుపెడుతోంది.ఏపీలో బీజేపీకి 12 మంది ఎమ్మెల్యేలు, ముగ్గురు ఎంపీలు, ఇద్దరు రాజ్యసభ సభ్యులు, ఒక ఎమ్మెల్సీతో పాటు రాష్ట్ర ప్రభుత్వంలో ఒక మంత్రి ఉన్నారు. ఏపీ నుంచి గెలిచిన ముగ్గురు బీజేపీ ఎంపీల్లో భూపతిరాజు శ్రీనివాసవర్మ కేంద్రమంత్రిగా ఉన్నారు. వీరికి తోడు పార్టీలో సీనియర్ నేతలు ఉన్నారు. వీరెవరూ పార్టీ బలోపేతం కోసం ప్రత్యేక చొరవ చూపట్లేదని కార్యకర్తలే ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.కేంద్రం చేస్తున్న అభివృద్ధి సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించేలా ఎలాంటి యాక్టివిటీ చేపట్టకపోవడంతో పాటు..పొలిటికల్ ఇష్యూస్‌పై కూడా ఒక్కరూ నోరెత్తకపోవడం చర్చనీయాంశంగా మారింది. లీడర్లే సైలెంట్ మోడ్‌లో ఉండటంతో ఏపీ బీజేపీపై ప్రజల్లో చర్చకే ఆస్కారం లేకుండా పోయిందంటున్నారు. అధ్యక్షుడిగా మాధవ్ ఉన్నప్పటికీ ఆయన వాయిస్ పెద్దగా ప్రజలోకి వెళ్లడం లేదనేది రాజకీయ వర్గాల్లో చర్చ.ఇలాంటి పరిస్థితుల్లో మెల్లగా పార్టీని బలోపేతం చేసుకుంటూ పోతే చట్టసభల్లో తమ ప్రాతినిధ్యాన్ని ఇంకా పెంచుకునే అవకాశం ఉంటుంది. కానీ ఆ దిశగా ఏపీ బీజేపీ నేతలు చేస్తున్న ప్రయత్నాలేమి లేవంటున్నారు కార్యకర్తలు. త్వరలోనే స్థానిక, మున్సిపోల్స్ ఎన్నికలు రాబోతున్నాయి. స్థానిక, పురపోరు కోసం పార్టీని సన్నద్ధం చేసేందుకు ఇప్పటివరకు ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదని ద్వితీయ శ్రేణి నేతలు కూడా అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారుఅధికారంతో సంబంధం లేకుండా పార్టీ కోసం పనిచేస్తున్న సీనియర్ కార్యకర్తలు..నేతలు..ఏపీ బీజేపీ నేతల తీరుపై తీవ్ర అసహనంతో ఉన్న పరిస్థితి. కూటమిలో టీడీపీ, జనసేన తమ పార్టీలను మరింత బలోపేతం చేసుకునే దిశగా అడుగులు వేస్తుంటే బీజేపీ లీడర్లు మాత్రం పార్టీని పట్టించుకోవడమే మానేశారన్న విమర్శలు కమలం పార్టీలో కాక పుట్టిస్తున్నాయి.

## టీడీపీలో ఫైర్ బ్రాండ్ మహిళా లీడర్లు

**విజయవాడ, ఫిబ్రవరి 9, పెన్ పవర్:** ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో తెలుగుదేశం పార్టీ విజయ పరంపరకు మహిళా నేతలు నేడు అసలైన పిల్లర్లుగా నిలుస్తున్నారు. ముఖ్యంగా రెడ్డప్పగారి మాధవీరెడ్డి, మంత్రి సవిత, హోంమంత్రి వంగలపూడి అనిత, గుంటూరు పశ్చిమ ఎమ్మెల్యే గల్లా మాధవి, మంత్రి సంధ్యారాణి వంటి నేతలు నేడు అసెంబ్లీలోనూ, బయటా తమ గళాన్ని వినిపిస్తూ ప్రత్యర్థులకు కంటిమీద కునుకు లేకుండా చేస్తున్నారు. వీరిలో కొందరు రాజకీయ వారసత్వంతో వచ్చినా, మరికొందరు సామాన్యులుగా రాజకీయాల్లోకి వచ్చినా.. తమదైన శైలిలో అరాచక శక్తులపై పోరాడుతూ పార్టీలో తిరుగులేని స్థానాన్ని సంపాదించుకున్నారు.రాయలసీమ గడ్డపై భూమా అఖిలప్రియ, గౌరు చరిత రెడ్డి వంటి వారు చూపుతున్న తెగువ రాజకీయాన్ని మరో స్థాయికి తీసుకువెళ్లింది. అరాచక పార్టీగా ముద్రపడిన వైసీపీ నాయకుల బెదిరింపులకు వెరవకుండా, క్షేత్రస్థాయిలో ప్రజలకు అండగా నిలవడంలో వీరు ముందుంటున్నారు. అలాగే గౌతు శిరీష, యువ నేత బండారు శ్రావణి శ్రీ వంటి వారు తమ వాగ్ధాటితో, కార్యదక్షతతో మెరుస్తున్నారు. వీరంతా కేవలం పదవుల కోసం కాకుండా, ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం పోరాడుతున్న తీరు టీడీపీని మహిళా పక్షపాత పార్టీగా గట్టిగా నిలబెట్టింది. గత ప్రభుత్వ హయాంలో వీరు ఎదుర్కొన్న వేధింపులు, పెట్టిన అక్రమ కేసులు వీరిని మరింతగా రాటుదేల్చాయే తప్ప ఎక్కడా వెనక్కి తగ్గించలేకపోయాయి.చంద్రబాబు నాయుడు దూరదృష్టితో టీడీపీలో మహిళలకు లభిస్తున్న ప్రాధాన్యత నేడు ఫలితాలను ఇస్తోంది. నారీ శక్తి ని కేవలం ఓటు బ్యాంకుగా చూడకుండా, నిర్ణయాధికారాల్లో భాగస్వాములను చేయడం వల్లే వీరు స్వతంత్రంగా , ధైర్యంగా తమ నిర్ణయాలను వెల్లడించగలుగుతున్నారు. ఈ ఫైర్ బ్రాండ్ మహిళా నేతలు చూపిస్తున్న చురుకుదనం సోషల్ మీడియాలో సైతం సెన్సేషన్ సృష్టిస్తోంది. తమ మీద దాడి జరిగినా, వ్యక్తిత్వ హననానికి పాల్పడినా.. రెట్టింపు వేగంతో కౌంటర్ ఇస్తూ ప్రత్యర్థి పార్టీలకు చుక్కలు చూపిస్తున్నారు.ఏపీ రాజకీయాల్లో ఈ మహిళా నేతలు ఒక కొత్త ఒరవడిని సృష్టిస్తున్నారు. వీరంతా రాబోయే రోజుల్లో రాష్ట్ర రాజకీయాలను శాసించే స్థాయికి ఎదుగుతారనడంలో ఎలాంటి సందేహం లేదు. టీడీపీ బలోపేతానికి వీరు చేస్తున్న కృషి, పార్టీకి ఇస్తున్న నైతిక బలం వెలకట్టలేనిది. ధైర్యానికి నిలువుటద్దంలా నిలుస్తూ, ప్రజాసేవలో దూసుకుపోతున్న ఈ మహిళా మణులు తెలుగు జాతి గర్వించదగ్గ నాయకురాళ్లుగా గుర్తింపు పొందుతున్నారు. అరాచకంపై వీరు సాగిస్తున్న ఈ ధర్మ యుద్ధం రాష్ట్ర ప్రగతికి , మహిళా సాధికారతకు ఒక గొప్ప నిదర్శనం.

## స్థానిక ఎన్నికలు బహిష్కరణ ఆలోచనలు?

**విజయవాడ, ఫిబ్రవరి 9, పెన్ పవర్:** ఆంధ్రప్రదేశ్‌లో స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణకు కూటమి ప్రభుత్వం వేగంగా అడుగులు వేస్తోంది. మున్సిపల్, పంచాయతీ పాలకవర్గాల పదవీకాలం ముగియగానే, వాటిని స్పెషల్ ఆఫీసర్ల పాలనలోకి వెళ్లనివ్వకుండా వెంటనే ఎన్నికలు జరిపించాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కృతనిశ్చయంతో ఉన్నారు. ముందుగా గ్రామ పంచాయతీలకు, ఆపై పరిషత్ ఎన్నికలకు, చివరగా మున్సిపల్ కార్పొరేషన్లకు ఎన్నికలు నిర్వహించేలా షెడ్యూల్‌ను సిద్ధం చేస్తున్నారు. క్షేత్రస్థాయిలో ప్రజాస్వామ్య వ్యవస్థను బలోపేతం చేయడమే లక్ష్యమని ప్రభుత్వం చెబుతున్నప్పటికీ, ఈ నిర్ణయం ప్రతిపక్ష వైసీపీని తీవ్ర ఆందోళనలోకి నెట్టింది.ప్రస్తుత రాజకీయ పరిస్థితుల్లో ఈ ఎన్నికలు వైసీపీకి పెను సవాలుగా మారాయి. అసెంబ్లీ ఎన్నికల్లో ఓటమి తర్వాత పార్టీ క్యాడర్ ఇంకా కోలుకోలేదు. ఈ తరుణంలో ఎన్నికలకు వెళ్తే పరాభవం తప్పదనే భయం పార్టీ నేతల్లో కనిపిస్తోంది. ఇప్పటికే పార్టీలోని కొన్ని వర్గాలు ఈ ఎన్నికలను బహిష్కరించాలనే తీవ్ర ఆలోచన చేస్తున్నట్లు రాజకీయ వర్గాల్లో ప్రచారం జరుగుతోంది. అయితే, ఒకసారి ఎన్నికలను బహిష్కరిస్తే గ్రామస్థాయిలో క్యాడర్ పూర్తిగా నిస్తేజమైపోతుందని, అది పార్టీ ఉనికికే ప్రమాదమని రాజకీయ విశ్లేషకులు హెచ్చరిస్తున్నారు.పోటీ చేస్తే ఓటమి భయం, తప్పుకుంటే క్యాడర్ దూరం.. ఈ విచిత్ర పరిస్థితి నుంచి బయటపడటానికి వైసీపీ న్యాయపోరాటాన్ని ఆశ్రయించే అవకాశం ఉందని భావిస్తున్నారు. వార్డుల పునర్విభజన, రిజర్వేషన్ల ఖరారు లేదా ఓటర్ల జాబితాలో అవకతవకలు జరిగాయంటూ కోర్టుల్లో పిటిషన్లు వేసి ఎన్నికల ప్రక్రియను నిలిపివేయడానికి ప్రయత్నాలు జరుగుతున్నట్లు ఆరోపణలు వస్తున్నాయి. గతంలో ఎన్నికలను వాయిదా వేయడానికి చేసిన ప్రయత్నాలు బెడిసికొట్టిన అనుభవం ఉన్నప్పటికీ, ప్రస్తుతానికి ఎన్నికలను ఆలస్యం చేయడమే శ్రేయస్కరమని ఆ పార్టీ అగ్రనాయకత్వం భావిస్తున్నట్లు తెలుస్తోంది.మరోవైపు తెలుగుదేశం, జనసేన, బీజేపీ కూటమి శ్రేణులు ఈ ఎన్నికల కోసం ఉత్సాహంగా ఎదురుచూస్తున్నాయి. గ్రామాల్లో పట్టు పెంచుకోవడానికి ఇది సువర్ణావకాశమని భావిస్తున్న కూటమి నేతలు, క్షేత్రస్థాయిలో ప్రచారానికి సిద్ధమవుతున్నారు. వైసీపీ తన వ్యూహాలను మార్చుకోకపోతే, పంచాయతీ నుంచి మున్సిపాలిటీ వరకు ఏకపక్ష ఫలితాలు వచ్చే అవకాశం ఉంది. మొత్తానికి ఏపీ స్థానిక ఎన్నికలు కేవలం పదవుల కోసం కాకుండా, రాష్ట్రంలో ప్రధాన ప్రతిపక్షం తన ఉనికిని కాపాడుకోవడానికి చేసే జీవన్మరణ పోరాటంగా మారనున్నాయి.

## సామాజిక వర్గాన్ని నమ్ముకున్న వైసీపీ...



**విశాఖపట్టణం, ఫిబ్రవరి 9, పెన్ పవర్:** ఏదైనా ఒక్కసారి చేస్తేనే వర్క్ అవుట్ అవుతుంది. పదే పదే అదే మాట అంటే ప్రజలు వినరు. తెలంగాణలో కెసిఆర్ ని తీసుకుందాం. రెండుసార్లు తెలంగాణ సెంటిమెంట్తో ఎన్నికలకు వెళ్లి గెలిచారు. కానీ మూడోసారి మాత్రం సెంటిమెంట్ తగ్గించి.. జాతీయ భావాలతో వెళ్లారు. అయినా సరే అక్కడి ప్రజలు గుర్తించలేదు. ఏపీలో కూడా అటువంటి సీన్ ఉంది. ఎందుకంటే జగన్మోహన్ రెడ్డి వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ఏర్పాటు చేసిన నాటి నుంచి ఎన్నో రకాల ప్రయోగాలు చేశారు. అందులో కులప్రయోగం ఒకటి. 2014లో కాపులకు రిజర్వేషన్లు ఇస్తానని ప్రకటించారు చంద్రబాబు. ఆ ఒక్క అంశాన్ని పట్టుకొని ముద్రగడ పద్మనాభం పెద్ద ఉద్యమమే చేశారు. అది అంతిమంగా వైయస్సార్ కాంగ్రెస్ పార్టీకి లాభం చేకూర్చింది. కానీ అదే ముద్రగడ పద్మనాభం వైయస్సార్ కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత ఉద్యమాన్ని వదిలేశారు. అదే ముద్రగడ వైయస్సార్ కాంగ్రెస్ పార్టీలో చేరినా మొన్నటి ఎన్నికల్లో కాపులు ఇటువైపు చూడలేదు.కాపు రిజర్వేషన్ ఉద్యమాన్ని పతాక స్థాయికి తీసుకెళ్లారు ముద్రగడ పద్మనాభం. 2016 జనవరి 31న తుని కేంద్రంగా ముద్రగడ నేతృత్వంలో కాపు గర్జన సభ ఏర్పాటు చేశారు. చివరకు ఆ ఉద్యమం రైలు తగలబెట్టే వరకు వచ్చింది. ముద్రగడపై కేసులు నమోదయ్యాయి. అదే సమయంలో జగన్మోహన్ రెడ్డి రాజకీయంగా తీసుకున్న కొన్ని రకాల నిర్ణయాలు కాపులను ఆకర్షించాయి. నాడు ముద్రగడపై తెలుగుదేశం ప్రభుత్వం పెట్టిన కేసులను కాపు కులం పై జరిగిన దాడిగా చిత్రీకరించడంలో జగన్మోహన్ రెడ్డి సక్సెస్ అయ్యారు. తద్వారా అప్పట్లో టిడిపి పొలిటికల్ గా భారీ డ్యామేజ్ కు గురైంది.అయితే తాజాగా అంబటి రాంబాబు అరెస్టు ఎపిసోడ్ ను కాపులపై జరుగుతున్న దాడిగా చిత్రీకరించేందుకు మరోసారి ప్రయత్నాలు మొదలుపెట్టారు. కాపులంటే చంద్రబాబుకు ఎందుకంత కక్ష? కాపు సామాజిక వర్గం నేతల మీద టిడిపి దాడులు ఏంటి? నాడు ముద్రగడపై అలా? నేడు అంబటి రాంబాబు పై ఇలా? అంటూ మాజీ మంత్రి గుడివాడ అమర్నాథ్ విశాఖ నుంచి సంఘీభావ యాత్ర మొదలు పెట్టేసారు. 300 కార్లతో యాత్రగా బయలుదేరారు. “ నాడు ముద్రగడ మాదిరిగా అంబటి రాంబాబు ఎపిసోడ్ వర్కౌట్ కాదు. కూటమి పార్టీల తరఫున ఉన్న కాపు నేతలు మౌనం మరోసారి డ్యామేజ్ కు గురి చేసే అవకాశం ఉంది. ముద్రగడ రిజర్వేషన్ ఉద్యమాన్ని.. అంబటి రాంబాబు వ్యాఖ్యలను ఒకే గాటిలో కట్టలేం. కానీ ఎలాగైనా కాపులను మరోసారి తనవైపు తిప్పుకోవాలన్న జగన్మోహన్ రెడ్డి ఆలోచనలను కూటమి కాపు ఎమ్మెల్యేలు, మంత్రులు గుర్తించాల్సిన అవసరం ఉంది. తిప్పి కొట్టాల్సిన పరిస్థితి ఉంది. సామాజిక వర్గానికి చెందిన వంగవీటి రంగాను హత్య చేశారని, ముద్రగడ పద్మనాభాన్ని అనేక రకాలుగా వేధించారని, ఇపుడు అంబటి రాంబాబు మీద దాడి చేసి తిరిగి ఆయన మీద తప్పుడు కేసులు పెట్టారంటూ“ కాపు నేతలు ఆవేదన వ్యక్తం చేస్తున్న

Printed by Published by GANTYADA APPARAO on behalf of GANTYADA APPARAO, printed at SRI SAI GANGA PRINTERS AND PUBLICATIONS D.NO: 49-1-35, MIRIYALAPALEM CENTER, RAILWAY STATION ROAD, PRAKASAM, ANDHRA PRADESH - 523001 and published at Plot No: 29, H.NO: 1-24-725, Sri Gayatri Nilayam, Dwaraka Nagar, Tirumalagiri, Secundrabad, Telangana. Editor : GANTYADA APPARAO. PRGI Registration No. "TGTEL/25/A3106". e-mail : editorpenpower@gmail.com, Mobile: 9059465965

# బంగ్లా జైలులో మాజీ ఎంపీ రమేశ్ చంద్రసేన్ మృతి



**హైదరాబాద్ పెన్ పవర్:** బంగ్లాదేశ్‌లోని దినాజ్‌పుర్ సెంట్రల్ జైలులో అవా లీగ్ పార్టీ సీనియర్ నేత, మాజీ మంత్రి రమేశ్ చంద్రసేన్ (85) మృతి చెందారు. ఐదు సార్లు పార్లమెంటు సభ్యుడిగా ఎన్నికైన సేన్.. 2024 ఆగస్టు 16 నుంచి జైలులోనే ఉన్నారు. షేక్ హసీనా ప్రభుత్వం రద్దైన వెంటనే ఆయనపై జమాత్-ఎ-ఇస్లా, బంగ్లాదేశ్ నేషనలిస్టు పార్టీ కార్యకర్తలు దాడి చేశారు. తర్వాత పోలీసులు అరెస్టు చేశారు. హత్య సహా పలు నేరాలను ఆయనపై మోపి జైలుకు తరలించారు. అప్పటి నుంచి ఎలాంటి విచారణ లేకుండా కటకటాలకే పరిమితమయ్యారు. ఇటీవల జైలులో సేన్ ఆరోగ్యం క్షీణించింది. సరైన వైద్యం ఆయనకు అందలేదు. దీంతో జైలులోనే శనివారం తెల్లవారుజామున తుదిశ్వాస విడిచారు. బంగ్లాదేశ్‌లో గురువారం సార్వత్రిక ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో సేన్ మృతి కలకలం సృష్టిస్తోంది. అవా లీగ్ పార్టీలో రమేశ్ క్రియాశీలంగా ఉండేవారు. షేక్ హసీనా బంగ్లాదేశ్ నుంచి భారత్‌కు వచ్చేశాక అవా లీగ్ పార్టీ నాయకులు, కార్యకర్తలు తాత్కాలిక ప్రభుత్వం నడుపుతున్న మహమ్మద్ యూనస్ సలహామండలికి లక్ష్యంగా మారారు. ఒక్క 2025 సంవత్సరంలోనే బంగ్లాదేశ్ జైళ్లలో దాదాపు 107 మంది చనిపోయారని, ఇందులో ఎక్కువ మంది అవా లీగ్ పార్టీ నేతలేనని ఓ స్వచ్ఛంద సంస్థ పేర్కొంది.

## నోబెల్ గ్రహీత నర్గెస్‌కు మరో ఏడున్నరేళ్ల జైలు

**హైదరాబాద్ పెన్ పవర్:** నోబెల్ శాంతి పురస్కార గ్రహీత నర్గెస్ మొహమ్మది (53)కి ఇరాన్‌లోని న్యాయస్థానం మరో ఏడున్నరేళ్ల జైలు శిక్ష విధించింది. దీంతోపాటు దేశం విడిచి వెళ్లకుండా రెండేళ్ల పాటు నిషేధం విధించినట్లు ఆమె న్యాయవాది వెల్లడించారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా నిరాహార దీక్ష ప్రారంభించిన నేపథ్యంలో ఈ నిర్ణయం వెలువడింది.ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఫిబ్రవరి 2 నుంచి నర్గెస్ నిరాహార దీక్ష చేస్తున్నట్లు ఆమె మద్దతుదారులు వెల్లడించారు. ప్రజలను రెచ్చగొట్టినందుకు ఆరేళ్లు, ప్రభుత్వంపై వ్యతిరేక ప్రచారం చేసినందుకు మరో ఏడాదిన్నర శిక్ష పడినట్లు ఆమె న్యాయవాది మోస్తాఫా నిలీ వెల్లడించారు. అయితే, దీనిపై ఇరాన్ ప్రభుత్వం నుంచి ఎటువంటి ప్రకటన రాలేదు. మహిళా హక్కుల కోసం ఇరాన్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా పోరాడుతున్న నర్గెస్ మొహమ్మది ఇప్పటికే అనేక సార్లు జైలుకు వెళ్లారు. పలుమార్లు శిక్షను కూడా అనుభవించారు. ఎన్నో కొరడా దెబ్బలను సైతం ఓర్చుకున్నారు. మూడు దశాబ్దాలకుపైగా ఆమె చేస్తోన్న ఈ పోరాటానికి గుర్తింపుగా 2023లో నోబెల్ శాంతి బహుమతి వరించింది. జైల్లో ఉండగానే ఆమె నోబెల్‌కు ఎంపికయ్యారు.

# రఫా క్రాసింగ్ నుంచి వచ్చే పాలస్తీనియన్లపై దాడులు

**హైదరాబాద్ పెన్ పవర్:** ఈజిప్ట్‌తో గల రఫా సరిహద్దు క్రాసింగ్ గుండా గాజాలోకి తిరిగి వచ్చే పాలస్తీనియన్లపై దారుణంగా జరుగుతున్న దాడుల పట్ల ఐక్యరాజ్య సమితి మానవతా వ్యవహారాల విభాగం తీవ్రంగా ఆందోళన వ్యక్తం చేసింది. గాజావ్యాప్తంగా పౌర ప్రాంతాల్లో ఇజ్రాయిల్ వైమానిక దాడులను, కాల్పులను, బాంబు దాడులను కొనసాగిస్తోందని ఐక్యరాజ్య సమితి మానవతా వ్యవహారాల సమన్వయ కేంద్రం (ఓసీహెచ్ఏ) పేర్కొంది. ఫలితంగా అనేకమంది మరణిస్తున్నారని, విధ్వంసం కూడా తీవ్రంగానే వుందని పేర్కొంది. పాలస్తీనా శరణార్థుల కోసం ఐక్యరాజ్య సమితి ఏర్పాటు చేసిన జబలయా బాలుర స్కూలును గురువారం ఇజ్రాయిల్ బలగాలు ధ్వంసం చేశాయని ఓసీహెచ్ఏ తెలిపింది. ఆరు పాఠశాలలు గల ఆ కాంపౌండ్‌లో ఇది చివరి పాఠశాల, దీంతో మొత్తంగా ఆ కాంపౌండ్ అంతా నాశనమైంది. పౌరులు, పౌర మౌలిక వసతులను ఎప్పుడూ రక్షించాలని, వాటిని లక్ష్యంగా చేసుకోరాదని, లేదా మిలటరీ కార్యకలాపాలకు వాడుకోరాదని ఐక్యరాజ్య సమితి పేర్కొంది. గాజాకు తిరిగివస్తున్న పాలస్తీనియన్ల పట్ల అత్యంత దారుణంగా వ్యవహరిస్తున్నారని, వారిని అసభ్యంగా దూషించడం, వారిపై దాడులు చేయడం వంటి దారుణాలకు దిగుతున్నారని వీటన్నింటికి ఇజ్రాయిల్ మిలటరీ మద్దతు వుంటోందని ఐక్యరాజ్య సమితి మానవ హక్కుల కార్యాలయం పేర్కొంది. ఇజ్రాయిల్ చెక్ పాయింట్ నుండి తిరిగి వస్తున్న కొంతమంది సాయుధ పాలస్తీనియన్లకు చేతులు బేడీలు వేసి, కండ్లకు గంతలు కట్టి, వారిని బెదిరింపులకు గురిచేస్తున్నారని, వారిని తనిఖీ చేస్తూ వారి వద్ద గల డబ్బు, ఇతర వస్తువులను లాక్కుంటున్నారని కార్యాలయం తెలిపింది.గురు, శుక్రవారాల్లో మొత్తంగా 11 మానవతా మిషన్‌లు సమన్వయం చేసుకుంటూ వ్యవహరిం చాయని, 98మందిని వెనక్కి తీసుకువచ్చాయని కార్యాలయం తెలిపింది.

## వలసదారులకు రక్షణ కల్పిస్తాం



**హైదరాబాద్ పెన్ పవర్:** వలసదారులకు రక్షణ కల్పించే ఉత్తర్వుపై న్యూయార్క్ నగర మేయర్ జోహ్రాన్ మమ్దానీ శుక్రవారం సంతకం చేశారు. న్యూయార్క్ పబ్లిక్ లైబ్రరీలో మత పెద్దలతో జరిగిన సమావేశంలో ఈ ఉత్తర్వుపై ఆయన సంతకం చేశారు. ఇమ్మిగ్రేషన్ అండ్ కస్టమ్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ (ఐసీఈ) వంటి సమాఖ్య సంస్థలు, గ్యారెజీలు, పాఠశాలలు లేదా ఆస్పత్రులు వంటి ప్రయివే టు ఆస్తులను వారెంట్ లేకుండా యాక్సెస్ చేయలేవని ఈ ఉత్తర్వు పేర్కొంది. కాగా, ప్రధాన నగర ఏజెన్సీలు.. ఫెడరల్ ఇమ్మిగ్రేషన్ అధికారులతో ఎలా వ్యవహరించాలో ఉద్యోగులందరికీ శిక్షణ అందిస్తాయి. ప్రతి విభాగంలో గోప్యతా అధికారిని నియమించడానికి, నిర్దిష్ట శిక్షణా కార్యక్రమాలను అభివృద్ధి చేయడానికి, సమాఖ్య సంస్థలతో.. ముఖ్యంగా ఐసీఈతో డేటా భాగస్వామ్యాన్ని పరిమితం చేయడం ద్వారా రక్షణ చర్యలకనుగుణంగా ఉన్నట్టు ధ్రువీకరించడానికి నగర పరిపాలనకు రెండు వారాల సమయం ఇస్తున్నట్టు ఈ ఉత్తర్వు వెల్లడించింది. ముఖ్యంగా న్యూయార్క్ పోలీస్ డిపార్ట్‌మెంట్, కరెక్షన్స్ డిపార్ట్‌మెంట్, పిల్లలు, కుటుంబ సేవల విభాగం, ఫెడరల్ ఇమ్మిగ్రేషన్ అధికారులతో పరస్పర చర్యలకు సంబంధించి వారి అంతర్గత విధానాల ఆడిట్‌లను నిర్వహించడం, వారి ప్రోటోకాల్‌ను నవీకరించడం, ఈ విధానాలలో పారదర్శకతను పెంచడం అవసరమని ఈ ఉత్తర్వు పేర్కొంది. వలస రంగంలో సంక్షోభ నిర్వహణను సమన్వయం చేయడానికి ఒక ప్రత్యేక కమిటీని ఏర్పాటు చేసినట్టు ఈ ఉత్తర్వు పేర్కొంది. ప్రత్యేకించి పారిస్‌వాసులకు వారి హక్కుల గురించి తెలియజేయడానికి పది భాషల్లో 32 వేల కరపత్రాలను మమ్దానీ పంపిణీ చేశారు.


# అమెరికాలో చలి బీభత్సం

**హైదరాబాద్ పెన్ పవర్:** అమెరికాలో గత పది–ఇరవై ఏళ్లలో ఎన్నడూ లేనంతగా కనిష్ఠ ఉష్ణోగ్రతలు పడిపోయాయి. ఈ వీకెండ్ లో 3 డిగ్రీల ఫారెన్ హీట్ కు ఉష్ణోగ్రతలు పడిపోవడంతో, బలమైన చలిగాలుల కారణంగా మైనస్ 14 డిగ్రీల వరకు చలి అనిపిస్తోంది.న్యూయార్క్, ఫిలడెల్ఫియా వంటి నగరాల్లో 4.3 కోట్ల మంది ప్రజలు తీవ్ర అవస్థలు పడుతున్నారు. ఆర్కిటిక్ గాలులే దీనికి కారణమని వాతావరణ శాఖ హెచ్చరించింది. ఈ ఏడాదిలో ఇప్పటివరకు వాతావరణ పరిస్థితుల కారణంగా 17 మంది మరణించగా, అందులో 13 మంది చలి కారణంగానే ప్రాణాలు విడిచినట్లు అధికారులు తెలిపారు.న్యూయార్క్ నగరంలో మైనస్ ఉష్ణోగ్రతల వల్ల బయట నివసించే ఐదుగురు వ్యక్తులు మృతి చెందారు. అలాగే టెక్సాస్, లూసియానాలో హైపోథెర్మియా వల్ల పలువురు మృతి చెందారు.మిస్సిసిపీలో సంభవించిన చారిత్రక ఐస్ స్టార్మ్ వల్ల భారీగా చెట్లు విరిగిపడటంతో పాటు రోడ్లు అత్యంత ప్రమాదకరంగా తయారయ్యాయి. దీంతో రవాణాకు తీవ్ర ఇబ్బందులు ఎదురయ్యాయి.ఇకపోతే మంచు భారం వల్ల పలు ప్రాంతాల్లో విద్యుత్ లైన్లు తెగిపోయాయి. అనేక రాష్ట్రాల్లో పవర్ గ్రిడ్లు పూర్తిగా దెబ్బతిన్నాయి. ఒక్క టెన్నెస్సీలోనే 3లక్షల మంది కరెంట్ లేక అవస్థలు పడుతున్నారు. మిస్సిసిపీలో 1.5 లక్షల మంది అంధకారంలో ఉన్నారు. ఇలా అనేక లక్షలాది మంది అంధకారంలో కొట్టుమిట్టాడుతున్నారు.దేశంలోని 2000



మైళ్ల విస్తీర్ణంలో ఒక అడుగు కంటే ఎక్కువ ఎత్తులో దట్టమైన మంచు వ్యాపించింది. రహదారులను మూసేసింది.అంతేకాదు రవాణా శాఖపై దీని ప్రభావం తీవ్రంగా పడింది. 15కి పైగా రాష్ట్రాల్లో ఎమర్జెన్సీ ప్రకటించారు. తుఫాను ప్రభావంతో విమానయాన రంగం కుప్పకూలింది. ఇప్పటివరకు 19,000 విమానాలు రద్దు కాగా, వేలాది మంది ప్రయాణికులు ఎయిర్‌పోర్టుల్లోనే చిక్కుకుపోయారు.


# ఎప్‌స్టీన్ 'సూపర్ హ్యూమన్' కల.. బేబీ రాంచ్ వెనుక ఉన్న నమ్మలేని నిజాలు



**హైదరాబాద్ పెన్ పవర్:** ప్రపంచవ్యాప్తంగా సంచలనం సృష్టించిన సెక్స్ ట్రాఫికర్ జెఫ్రీ ఎప్‌స్టీన్ కేవలం నేరాలకు మాత్రమే పరిమితం కాకుండా, వికృతమైన శాస్త్రీయ ఆలోచనలతో ఒక సొంత సామ్రాజ్యాన్ని నిర్మించాలని భావించినట్లు తెలుస్తోంది.తన సొంత ఆఔంను ఉపయోగించి అసాధారణమైన మేధస్సు కలిగిన పిల్లలను సృష్టించాలని, తద్వారా ఒక 'సూపర్ హ్యూమన్ రేస్' (అత్యున్నత మానవ జాతి)ను పుట్టించాలని అతను కలలు కన్నట్లు న్యూయార్క్ మ్స్ నివేదిక వెల్లడించింది. ఈ క్రమంలోనే అతను తన సంపదను ఉపయోగించి అనేకమంది శాస్త్రవేత్తలతో సంప్రదింపులు జరిపి, తన వింత కోరికలను నెరవేర్చుకోవడానికి ప్రణాళికలు సిద్ధం చేసుకున్నాడు. న్యూమెక్సికోలో ఎప్‌స్టీన్‌కు ఉన్న భారీ పశువుల పాక కేవలం ఒక విలాసవంతమైన భవనం మాత్రమే కాదని, అది ఒక రహస్య ప్రయోగశాలగా మార్చాలని అతను ప్రయత్నించినట్లు సమాచారం. అక్కడ అనేకమంది మహిళలకు తన ఆఔం ద్వారా గర్భం దాల్చేలా చేసి, ఒకేసారి వందలాది మంది పిల్లలను కనాలని అతను పథకం వేశాడు. ఈ ప్రదేశాన్ని అక్కడ పనిచేసే వారు మరియు సన్నిహితులు 'బేబీ రాంచ్' అని పిలిచేవారంటే, అతని ఆలోచనలు ఎంతటి తీవ్ర స్థాయిలో ఉండేవో అర్థం చేసుకోవచ్చు. మానవ పరిణామాన్ని తన చేతుల్లోకి తీసుకోవాలనే అతని అహంకారం ఈ చర్యల వెనుక స్పష్టంగా కనిపిస్తుంది. ఈ వింత ప్రయోగాల కోసం ఎప్‌స్టీన్ అత్యున్నత స్థాయి శాస్త్రవేత్తలను, మేధావులను తన దారిలోకి తెచ్చుకోవడానికి ప్రయత్నించాడు. కృత్రిమ గర్భధారణ మరియు జన్యు మార్పిడి వంటి అంశాలపై అతను నిరంతరం చర్చలు జరిపేవాడని, తన వారసత్వాన్ని ఒక ప్రత్యేక జాతిగా మార్చాలనేది అతని అంతిమ లక్ష్యమని తెలుస్తోంది. మరణానికి ముందు కూడా అతను తన ఆఔం భద్రపరచడం మరియు దాని ద్వారా భవిష్యత్తు తరాలను సృష్టించడం గురించి వింత కోరికలను వెలిబుచ్చినట్లు విచారణలో వెల్లడైంది. సైన్స్ మరియు టెక్నాలజీని తన స్వార్థం కోసం ఎలా వాడుకోవాలని చూశాడో ఈ ఉదంతం నిరూపిస్తోంది. అధికారం, ధనం ఉంటే ప్రకృతి నియమాలను కూడా మార్చవచ్చని భావించిన ఎప్‌స్టీన్ ఉదంతం ఇప్పుడు ప్రపంచవ్యాప్తంగా చర్చనీయాంశమైంది. ఒక నేరస్తుడు సమాజంలోని అగ్రశ్రేణి వ్యక్తులతో సంబంధాలు కలిగి ఉండి, ఇలాంటి అనైతిక ప్రయోగాలకు సిద్ధపడటం నైతిక విలువలకు పాతర వేయడమే. అతని మరణం తర్వాత బయటకు వస్తున్న ఈ చేదు నిజాలు, తెర వెనుక అతను నడిపిన చీకటి సామ్రాజ్యం ఎంత భయంకరమైనదో స్పష్టం చేస్తున్నాయి. శాస్త్రీయ విజ్ఞానాన్ని మానవ కల్యాణం కోసం కాకుండా, వికృత చేష్టల కోసం వాడాలనుకోవడం ఎప్పటికీ క్షమించరాని నేరం.

# గౌరవ్ గొగొయ్ కుటుంబంపై అస్సాం సీఎం సంచలన ఆరోపణలు..

**హైదరాబాద్ పెన్ పవర్:** అస్సాం రాజకీయాల్లో మరోసారి తీవ్ర దుమారం రేగింది. కాంగ్రెస్ ఎంపీ గౌరవ్ గొగొయ్ కుటుంబానికి పాకిస్థాన్ ఏజెంట్లతో సంబంధాలు ఉన్నాయంటూ ముఖ్యమంత్రి హిమంత బిశ్వ శర్మ విస్తుపోయే ఆరోపణలు చేశారు.పాక్ ఏజెంట్ అలీ తౌఖీర్‌తో గౌరవ్ గొగొయ్ మాత్రమే కాకుండా, ఆయన భార్య ఎలిజబెత్ కూడా సన్నిహితంగా ఉన్నారని ముఖ్యమంత్రి పేర్కొన్నారు. ఈ వ్యవహారం ఇప్పుడు రాష్ట్ర రాజకీయాల్లోనే కాకుండా దేశవ్యాప్తంగా చర్చనీయాంశంగా మారింది.ఈ ఆరోపణల వెనుక 44 పేజీల సుదీర్ఘ ఎస్ఐటీ (ఎ౹ఎ) నివేదిక ఉందని ముఖ్యమంత్రి వెల్లడించారు. గౌరవ్ భార్య ఎలిజబెత్, ఆమె బ్రిటిష్ పౌరురాలు అయినప్పటికీ, కీలక సమాచారాన్ని పాక్ ఏజెంట్లతో పంచుకున్నట్లు ఆ నివేదికలో పేర్కొన్నారని ఆయన వివరించారు. పాకిస్థాన్‌కు చెందిన ఒక సంస్థ నుంచి ఆమె క్రమం తప్పకుండా జీతం కూడా అందుకున్నారని, దీనికి సంబంధించిన ఆధారాలు తమ వద్ద ఉన్నాయని హిమంత బిశ్వ శర్మ స్పష్టం చేశారు.మరింత లోతుగా ఆరోపణలు చేస్తూ, గౌరవ్ గొగొయ్‌తో వివాహం జరిగిన తర్వాత



ఎలిజబెత్ సుమారు తొమ్మిది సార్లు పాకిస్థాన్‌లో పర్యటించారని సీఎం పేర్కొన్నారు. ఒక సామాన్య పౌరురాలు పాకిస్థాన్‌కు ఇన్నిసార్లు ఎందుకు వెళ్లాల్సి వచ్చిందని ఆయన ప్రశ్నించారు. కేవలం భార్యాభర్తలే కాకుండా, గొగొయ్ కుటుంబంలోని మరొక వ్యక్తి కూడా పాకిస్థాన్‌కు సహకరిస్తున్నారని, దేశ ప్రయోజనాలకు భంగం కలిగించేలా వారి ప్రవర్తన ఉందని ఆయన ఆరోపించారు. ఈ వ్యాఖ్యలు రాజకీయ వర్గాల్లో పెను సంచలనం సృష్టిస్తున్నాయి. దేశ భద్రతకు సంబంధించిన విషయంలో ఒక ఎంపీ కుటుంబంపై ఇలాంటి ఆరోపణలు రావడం తీవ్రమైన అంశమని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు. అయితే ఈ ఆరోపణలపై గౌరవ్ గొగొయ్ గానీ, కాంగ్రెస్ పార్టీ గానీ ఇంకా అధికారికంగా స్పందించాల్సి ఉంది. అస్సాం అసెంబ్లీ వేదికగా లేదా బహిరంగ సభల్లో ఈ అంశంపై మరింత వాడివేడి చర్చ జరిగే అవకాశం కనిపిస్తోంది.

# తమిళనాడు ఎన్నికల్లో పోటీ.. డీఎంకే, ఎన్డీయే మధ్య ఉంటుంది



**హైదరాబాద్ పెన్ పవర్:** తమిళనాడు అసెంబ్లీ ఎన్నికల్లో డీఎంకేకు ఎన్డీఏ గట్టి పోటీ ఇవ్వనుందని కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ అన్నారు. ఎన్డీటీవీ ప్రాఫిట్ సదస్సు 2026లో పాల్గొన్న నిర్మలమ్మ మాట్లాడుతూ..జాతీయ ప్రజాస్వామ్య కూటమి (ఎన్డి?) బలంగా, చెక్కుచెదరకుండా ఉందని, చాలా సమన్వయంతో ముందుకు సాగుతోందని తెలిపారు..'హోరాహోరీ పోరు తప్పదు.. విజయంపై అధికార డీఎంకే నమ్మకంగా లేదు.. గతేడాది నుంచి మేము చేపట్టిన ప్రదర్శనలు, సభలతో ఒత్తిడికి గురవుతుంది' అని సీతారామన్ వ్యాఖ్యానించారు. నటుడు విజయ్ పార్టీ తమిళ వెట్రి కళగం కూడా తొలిసారి ఎన్నికల్లో పోటీకి దిగుతోంది. 'వారు ఓడీఎంకేరి మంత్రుల చేస్తున్న వ్యాఖ్యలు, ప్రకటనలు, ఉచిత వాగ్దానాలు, ఆలయాల పర్యటనలు వంటివి ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ నేతృత్వంలోని అధికార పార్టీ ఎన్నికలను ఎదుర్కోవడానికి ఆందోళన చెందుతోందని స్పష్టం చేస్తున్నాయి' అని కేంద్ర ఆర్థిక మంత్రి అన్నారు. తమిళనాడు, అభివృద్ధి గురించి మాట్లాడితే ఇకపై ఓట్లు పొందలేమని డీఎంకే గ్రహించినట్టు ఉందన్నారు. డీఎంకే పరిధి పరిమితమని, రాష్ట్రం వెలుపల దానికి ఆదరణ లేదని ఆమె అన్నారు. ఐదు రాష్ట్రాల్లో అసెంబ్లీ ఎన్నికలు జరగనున్న వేళ.. సంక్షేమం, అభివృద్ధి మధ్య సమతుల్యతను సాధించేలా కేంద్ర ఆర్థిక మంత్రి హోదాలో నిర్మలా సీతారామన్ , బడ్జెట్‌ను ప్రవేశపెట్టిన సంగతి తెలిసిందే. ఆదాయ పంపిణీ విషయంలో దక్షిణ రాష్ట్రాలపై వివక్ష చూపుతోందన్న స్టాలిన్ తరుచూ చేసే ఆరోపణలకు నిర్మలమ్మ గట్టి సమాధానం ఇచ్చారు. 'కేంద్రం కేవలం బీజేపీ పాలిత రాష్ట్రాల కోసమే కాకుండా, అందరి కోసం పనిచేస్తుంది. రాష్ట్రాలు చేస్తున్న అప్పులు సుస్థిరం కాదని మేము వారికి చెప్పాం' అని ఆమె అన్నారు. త్వరలోనే తమిళనాడులో శాసనసభ ఎన్నికలు జరగనుండగా.. అన్నాడీఎంకేతో కలిసి బీజేపీ కూటమిగా ఏర్పడింది. ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ మదురైలో పర్యటించనున్నారు. ఆయన పర్యటనకు ముందు తమ కూటమిలో కొన్ని పార్టీలు చేరుతాయని తమిళనాడు బీజేపీ అధ్యక్షుడు నయానర్ నాగేంద్రన్ అన్నారు.

## మళ్లీ షాకిచ్చిన బంగారం, వెండి భారీగా పెరిగిన రేట్లు



బంగారం వెండి ధరలు గడిచిన పదిరోజుల్లో భారీ హెచ్చుతగ్గులు నమోదు చేశాయి. బంగారం, వెండి ధరల పతనం కంటిన్యూ అవుతుందని ఊహాగానాలు వ్యక్తమవుతున్న వేళ.. కొనుగోలుదారులకు మళ్లీ షాకిచ్చాయి. హైదరాబాద్ బులియన్ మార్కెట్లో సోమవారం 24 క్యారెట్ల బంగారం 10 గ్రాముల ధర రూ.2240 పెరిగి రూ.1,58,840కి చేరింది. 22 క్యారెట్ల బంగారం 10 గ్రాముల రేటు రూ.2050 పెరిగి రూ.1,45,600 వద్ద కొనసాగుతోంది. 18 క్యారెట్ల బంగారం 10 గ్రాముల ధర రూ.1680 పెరిగి రూ.1,19,130కి చేరింది. వెండి కూడా బంగారంతో పోటీగా పెరిగింది. కిలో వెండి ధరపై రూ.15000 పెరగడంతో.. ప్రస్తుత ధర రూ.3,00,000లకు చేరింది. పెరిగిన బంగారం, వెండి ధరలకు జీఎస్టీ, తరుగు అదనంగా ఉంటుంది. ప్రాంతాలను బట్టి ఈ ధరల్లో స్వల్ప మార్పులు ఉండవచ్చు. కొద్దిరోజుల్లో శుక్రమూఢం ముగిసి పెళ్లిళ్లు ప్రారంభం కానున్నాయి. వరుసగా ధరల పెరుగుదల తర్వాత.. బంగారం, వెండి ధరలు తగ్గుతూ వస్తుండటంతో మరింత తగ్గుతాయని ఎదురుచూస్తున్నవారికి మళ్లీ ఊహించని షాక్ తగులుతోంది. బంగారం జ్యూవెలరీ కొనేటపుడు 22 క్యారెట్లలో వస్తుంది. దానిప్రకారం చూస్తే.. ఫిబ్రవరి 7, 9 తేదీల్లో 22 క్యారెట్ల బంగారం 10 గ్రాముల ధర రూ.4700 (జీఎస్టీ, తరుగు లేకుండా) పెరిగింది. ఫిబ్రవరి 6న 10 గ్రాముల రేటు రూ.1,40,900 ఉంటే.. నేటికి దాదాపు రూ.5 వేల మేర పెరిగింది. ఇది కొనుగోలుదారులకు లాస్ అనే చెప్పాలి. బంగారం ధర ఇంకా తగ్గుతుందని ఎదురుచూడకుండా ఇప్పుడే కొనుగోలు చేయడం మంచిదని, మార్కెట్లు ఎప్పుడెలా ఉంటాయో అంచనా వేయడం కష్టమని నిపుణులు చెప్తున్నారు.

## గూగుల్ ఉద్యోగుల ఆగ్రహం




గూగుల్ సంస్థలో అంతర్గత అలజడి. అమెరికా ప్రభుత్వ విభాగాలైన హోమ్‌ల్యాండ్ సెక్యూరిటీ, ఇమ్మిగ్రేషన్ అండ్ కస్టమ్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్, కస్టమ్స్ అండ్ బోర్డర్ ప్రొటెక్షన్ లతో గూగుల్ ఒప్పందాలను వ్యతిరేకిస్తూ దాదాపు వెయ్యి మంది ఉద్యోగులు పిటిషన్ దాఖలు చేశారు. గూగుల్ సాంకేతికత హింసకు, నిఘాకు, అణచివేతకు సాధనంగా మారుతోందని, ముఖ్యంగా క్లౌడ్, ఏఐ వినియోగం వలసదారులను ట్రాక్ చేయడానికి, సరిహద్దు నిఘా వ్యవస్థలను బలోపేతం చేయడానికి ఉపయోగపడుతోందని వారు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వ విభాగాలతో ఉన్న అన్ని ఒప్పందాలను బహిర్గతం చేసి, తక్షణమే వాటి నుంచి గూగుల్ వైదొలగాలని ఉద్యోగులు డిమాండ్ చేస్తున్నారు.కేవలం క్లౌడ్ సేవలే కాకుండా.. గూగుల్ జనరేటివ్ ఏఐ కూడా ప్రభుత్వ విభాగాల సామర్థ్యాన్ని పెంచేందుకు వాడటంపై వారు విస్మయం వ్యక్తం చేశారు. యూట్యూబ్‌లో ఐసీఈ రిక్రూట్‌మెంట్ ప్రకటనలు రావడం, అలాగే ఇమ్మిగ్రెంట్ల రక్షణ కోసం రూపొందించిన ట్రాకింగ్ యాప్‌లను ప్లే స్టోర్ నుండి తొలగించడం వంటి చర్యలను ఉద్యోగులు తప్పుబట్టారు. ఈ టెక్నాలజీలను రూపొందిస్తున్న ఉద్యోగులుగా.. తమ శ్రమ ఇలాంటి హింసాత్మక పనులకు ఉపయోగపడటం మమ్మల్ని భయపెడుతోందని లేఖలో పేర్కొన్నారు.

## ప్రభుత్వానికి టెలికాం కంపెనీలు చెల్లించాల్సిన బకాయి రూ. 1.77 లక్షల కోట్లు




2024-25 ఆర్థిక సంవత్సరం నాటికి భారత ప్రభుత్వానికి టెలికాం కంపెనీలు చెల్లించాల్సిన సర్దుబాటు చేసిన స్థూల రాబడి(ఏజీఆర్) బకాయిలు రూ. 1.77 లక్షల కోట్లకు పైగా ఉన్నాయి. ఈ మేరకు అధికారిక డేటా వివరాలను ప్రభుత్వం పార్లమెంటుకు తెలియజేసింది. దీని ప్రకారం, అప్పుల ఊబిలో ఉన్న ప్రైవేట్ రంగ వొడాఫోన్ ఐడియా (వీఐ) మొత్తం రూ. 89,952 కోట్లు, భారతీ గ్రూప్ రూ. 51,091 కోట్లు, టాటా గ్రూప్‌పై రూ. 20,426 కోట్లు, ఎంటీఎన్ఎల్‌పై రూ. 14,462 కోట్లు, రిలయన్స్ జియో ఇన్ఫోకామ్‌పై రూ. 1,984 కోట్ల బకాయి చెల్లించాల్సి ఉంది. ఇందులో వొడాఫోన్ ఐడియాకు చెందిన 2006-07 ఆర్థిక సంవత్సరం నుంచి 2018-19 ఆర్థిక సంవత్సరం వరకు ఉన్న ఏజీఆర్ బకాయిలు రూ. 87,695 కోట్లను ఫ్రీజ్ చేశారు. అంటే, చెల్లింపు ప్రక్రియ వాయిదాలో ఉంది. దీనికి సంబంధించి వీఐ బకాయిలను పునఃపరిశీలన కోసం జనవరి 30న టెలికాం విభాగం ఓ కమిటీని ఏర్పాటు చేసిందని ప్రభుత్వం పార్లమెంటుకు తెలియజేసింది. ఈ కమిటీలో భారత ప్రభుత్వానికి చెందిన రిటైర్‌మెంట్ కార్యదర్శి స్థాయి అధికారి, కంప్ట్రోలర్ అండ్ ఆడిటర్ జనరల్ ఆఫ్ ఇండియా (కాగ్) నామినేట్ చేసిన ఓ ప్రతినిధి ఉంటారు. ఈ కమిటీ తీసుకున్న నిర్ణయమే తుది ఫలితం కానుంది. అందుకు అనుగుణంగా నిర్ణయం ఉంటుందని ప్రభుత్వం వెల్లడించింది.

# ఎస్బీఐలో 10.05 శాతం వడ్డీకే




మనకు ఎప్పుడు ఏ అవసరం పడుతుందో చెప్పలేం. పెళ్లి కోసమో లేదా వెకేషన్ కోసమో.. లేదా ఉన్నట్లుండి ఆస్పత్రిలో చేరాల్సి వస్తే ఖర్చులకు, ఇతర ఎమర్జెన్సీ అవసరాలకు డబ్బు కావాల్సి వస్తుంది.మన దగ్గర లేకపోతే బంధువులనో.. స్నేహితులనో అడుగుతుంటాం. అక్కడ దొరక్కపోతే ఇక బ్యాంకుల్లో లోన్ తీసుకోవడానికే చూస్తుంటామని చెప్పొచ్చు. ఒకప్పటితో పోలిస్తే ఇప్పుడు చాలా మంది చిన్న అవసరాల కూడా బ్యాంకుల్ని ఆశ్రయిస్తున్నారు. ప్రాసెస్ కూడా ఒకప్పటితో పోలిస్తే వేగంగా జరుగుతుంది. పెద్దగా డాక్యుమెంటేషన్ పని లేకుండానే క్షణాల్లో అకౌంట్లో డబ్బులు జమ చేస్తున్నాయి. కొన్ని బ్యాంకులు ప్రీఅప్రూవ్డ్ లోన్స్ ఆఫర్ చేస్తూ.. బ్యాంకుకు వెళ్లాల్సిన అవసరం లేకుండానే లోన్స్ అందిస్తున్నాయి. కొంత కాలంగా ఆర్బీఐ కీలక రెపో రేట్లను తగ్గిస్తూ వచ్చిన సంగతి తెలిసిందే. గతేడాది ఏకంగా 125 బేసిస్ పాయింట్ల మేర రెపో రేటును తగ్గించగా.. బ్యాంకులు అందుకు అనుగుణంగా రెపో ఆధారిత వడ్డీ రేట్లను తగ్గించాయి. రెపోకు లింక్ అయి ఉన్న పర్సనల్ లోన్, హోం లోన్, వెహికిల్ లోన్ వంటి వాటి వడ్డీ రేట్లు తగ్గుముఖం పట్టాయి. ఈ క్రమంలో ఎస్బీఐలో కూడా లోన్ వడ్డీ రేట్లు తగ్గాయి. గతంలో కంటే తక్కువ వడ్డీ రేటుకే ఇప్పుడు లోన్లు లభిస్తున్నాయని చెప్పొచ్చు. ఎస్బీఐలో పర్సనల్ లోన్ అనేది రెండేళ్ల టెన్యూర్ ఎంసీఎల్ఆర్‌కు లింక్ అయి ఉంటుంది. ఈ బ్యాంకులో ఇప్పుడు పర్సనల్ లోన్ వడ్డీ రేట్లు కనీసం 10.05 శాతం నుంచే ప్రారంభమవుతున్నాయి. గరిష్ఠ వడ్డీ రేటు 15.05 శాతంగా ఉంది. ప్రభుత్వ ఉద్యోగులు, డిఫెన్స్, పారా మిలిటరీ, ఇండియన్ కోస్ట్ గార్డ్స్ సిబ్బందికి చాలా తక్కువ వడ్డీకే లోన్లు లభిస్తాయి. ఇంకా మెరుగైన సిబిల్ స్కోరు ఉన్న ప్రైవేట్ ఉద్యోగులకు కూడా కనీస వడ్డీ రేటుకే లోన్ లభించే అవకాశం ఉంటుంది. స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా వెబ్‌సైట్ ప్రకారం.. రూ. 35 లక్షల వరకు పర్సనల్ లోన్ పొందొచ్చు. ప్రాసెసింగ్ ఫీజులు కూడా ఎక్కువేం ఉండవు. పెద్దగా డాక్యుమెంటేషన్ ఉండదు. హిడెన్ కాస్ట్స్ ఏం లేవు. ఇప్పుడు మనం ప్రారంభ వడ్డీ రేటుతో అలాగే.. 11 శాతం, 12 శాతం వడ్డీ రేటుతో రూ. 5 లక్షల పర్సనల్ లోన్ తీసుకుంటే ఈఎంఐ ఎంత చెల్లించాలో చూద్దాం. రూ. 5 లక్షల లోన్ తీసుకుంటే.. మూడేళ్లకు 10.05 శాతం ప్రారంభ వడ్డీ రేటు చొప్పున నెలకు ఈఎంఐ రూ. 16,145 చొప్పున పడుతుంది. మొత్తం టెన్యూర్‌కు రూ. 81,232 వడ్డీ చెల్లించాల్సి వస్తుంది. ఇదే 11 శాతం వడ్డీ రేటుకు చూస్తే నెలకు ఈఎంఐ రూ. 16,369 గా ఉండగా.. మొత్తం వడ్డీ రూ. 89,297 చెల్లించాలి. 12 శాతానికి చూస్తే మూడేళ్లలో నెలకు ఈఎంఐ రూ. 16,607 పడుతుంది. మొత్తం వడ్డీ రూ. 97,858 పడుతుంది.

# రష్యా ముడిచమురు దిగుమతులకు బ్రేక్!



గత ఏడాది కాలంగా భారత ఇంధన మార్కెట్‌లో రష్యా గుత్తాధిపత్యం స్పష్టంగా కనిపిస్తూ వచ్చింది. 2025 జూన్ నాటికి భారత్‌కు రష్యా నుంచి వచ్చే క్రూడాయిల్ ఇంపోర్ట్స్ రికార్డు స్థాయిలో రోజుకు 20 లక్షల బ్యారెళ్లకు చేరుకున్నాయి.ఆ సమయంలో భారత మొత్తం చమురు దిగుమతుల్లో రష్యా వాటా దాదాపు 44 శాతంగా నమోదై అగ్రగామిగా నిలిచింది. తక్కువ ధరకు చమురు లభిస్తుండటంతో భారతీయ రిఫైనరీలు రష్యా వైపే మొగ్గు చూపాయి.అయితే, 2025 నవంబర్ తర్వాత పరిస్థితి ఒక్కసారిగా తలకిందులైంది. అంతర్జాతీయ స్థాయిలో అమెరికా విధించిన కఠినమైన ఆర్థిక ఆంక్షలు మరియు మారుతున్న అంతర్జాతీయ వాణిజ్య నిబంధనలు భారత చమురు దిగుమతులపై తీవ్ర ప్రభావాన్ని చూపాయి. ముఖ్యంగా రష్యా నుంచి వచ్చే చమురు రవాణాపై ఉన్న పరిమితులు మరియు లాజిస్టిక్స్ సమస్యల కారణంగా భారతీయ కంపెనీలు తమ వ్యూహాన్ని మార్చుకోవాల్సి వచ్చింది. దీనివల్ల గతంలో ఉన్న జోరు కాస్తా తగ్గడం ప్రారంభమైంది.తాజా గణాంకాల ప్రకారం, జనవరి 2026 నాటికి రష్యా చమురు వాటా సగానికి సగం పడిపోయి
22 శాతానికి పరిమితమైంది. ప్రస్తుతం రోజువారీ దిగుమతులు 11.6 లక్షల బ్యారెళ్లకు చేరుకున్నాయంటే, మార్కెట్‌లో వచ్చిన మార్పు ఎంత తీవ్రంగా ఉందో అర్థం చేసుకోవచ్చు. గతంలో ఎన్నడూ లేని విధంగా అతి తక్కువ కాలంలోనే ఇంతటి భారీ పతనం సంభవించడం ఇంధన రంగంలో చర్చనీయాంశంగా మారింది. ఇది ఇతర దేశాల నుంచి చమురు దిగుమతులు పెరిగేందుకు దారితీసింది. దిగుమతులు భారీగా తగ్గినప్పటికీ, ఇప్పటికీ భారత ఇంధన అవసరాల సరఫరాలో రష్యా ఒక కీలక భాగస్వామిగానే కొనసాగుతోంది. అంతర్జాతీయ ఒత్తిళ్లు ఉన్నప్పటికీ, భారత్ తన ఇంధన భద్రతను కాపాడుకోవడానికి ప్రత్యామ్నాయ మార్గాలను వెతుకుతోంది. భవిష్యత్తులో ధరల వ్యత్యాసం మరియు అంతర్జాతీయ పరిణామాలను బట్టి ఈ దిగుమతుల శాతంలో మరిన్ని మార్పులు వచ్చే అవకాశం ఉందని విశ్లేషకులు భావిస్తున్నారు.

# మ్యూచువల్ ఫండ్స్‌లో మరో 8 కొత్త స్కీమ్స్




ఈక్విటీ మ్యూచువల్ ఫండ్స్‌లో పెట్టుబడి పెట్టి హైరిటర్న్స్ అందుకోవాలని కోరుకుంటున్న వారి సంఖ్య నానాటికీ పెరుగుతోంది. స్టాక్ మార్కెట్లు తీవ్ర ఒడుదొడుకులకు లోనవుతున్న క్రమంలో మ్యూచువల్ ఫండ్స్ వైపు మళు ్లతున్నారు. అలాగే ఇప్పటికే ఇన్వెస్ట్ చేస్తున్న వారిలోనూ చాలా మంది కొత్త ఫండ్స్ కోసం ఎదురుచూస్తున్నారు. అలాంటి వారందరికీ ఈ వారం పండగే అని చెప్పాలి. ఎందుకంటే ఈ వారం ఏకంగా 8 కొత్త ఈక్విటీ మ్యూచువల్ ఫండ్స్ లాంచ్ అవుతున్నాయి. నాలుగు ప్రముఖ అసెంట్ మేనేజ్మెంట్ కంపెనీలు ఈ 8 న్యూ ఫండ్ ఆఫర్ తో వస్తున్నాయి. ఈ వారమే సబ్‌స్క్రిప్షన్ మొదలవుతోంది. వారి ఏ స్కీమ్ తేదీలు ఎప్పుడో తెలుసుకుందాం. కొత్తగా వస్తున్న 8 ఫండ్స్‌లో మూడు ఫండ్ ఆఫ్ ఫండ్స్ (డొమెస్టిక్), రెండు థెమాటిక్ ఫండ్స్, ఒక ఈటీఎఫ్, ఒక లో డురేషన్ ఫండ్ ఉన్నాయి. ఫండ్ ఆఫ్ ఫండ్ కేటగిరీలో మిరే అసెట్ నిఫ్టీ మెటల్ ఈటీఎఫ్ ఫండ్ ఆఫ్ ఫండ్ సబ్‌స్క్రిప్షన్ ఫిబ్రవరి 10వ తేదీన మొదలవుతోంది. ఫిబ్రవరి 23వ తేదీ వరకు అందుబాటులో ఉంటుంది. అలాగే గ్రో బీఎస్ఈ హాస్పిటల్ ఈటీఎఫ్ ఫండ్ ఆఫ్ ఫండ్ సబ్‌స్క్రిప్షన్ సైతం ఫిబ్రవరి
10న మొదలై ఫిబ్రవరి 25వ తేదీ వరకు కొనసాగుతుంది. ఇక ఏంజెల్ వన్ సిల్వర్ ఈటీఎఫ్ ఫండ్ ఆఫ్ ఫండ్ సబ్‌స్క్రిప్షన్ ఫిబ్రవరి 9వ తేదీన మొదలై ఫిబ్రవరి 23వ తేదీ వరకు కొనసాగుతుంది. ఇక థెమాటిక్ ఫండ్ కేటగిరీలో బరోడా బీఎన్‌పీ పరిబాస్ ఈఎస్‌జీ బెస్ట్ ఇన్ క్లాస్ స్ట్రాటజీ ఫండ్ సబ్‌స్క్రిప్షన్ ఫిబ్రవరి 12వ తేదీన మొదలవుతోంది. ఫిబ్రవరి 26వ తేదీ వరకు సబ్‌స్క్రైబ్ చేసుకోవచ్చు. ఇక ఐటీఐ బిజినెస్ సైకిల్ ఫండ్ సబ్‌స్క్రిప్షన్ ఫిబ్రవరి 13న ప్రారంభమై ఫిబ్రవరి 27వ తేదీ వరకు కొనసాగుతుంది. అలాగే ఇండెక్స్ ఫండ్ కేటగిరీలో గ్రో బీఎస్ఈ హాస్పిలట్ ఈటీఎఫ్ ఫండ్ సబ్‌స్క్రిప్షన్ ఫిబ్రవరి 11న మొదలై ఫిబ్రవరి 25వ తేదీ వరకు కొనసాగనుంది. ఏంజెల్ వన్ సిల్వర్ ఈటీఎఫ్ సబ్‌స్క్రిప్షన్ ఫిబ్రవరి 9వ తేదీన మొదలై ఫిబ్రవరి 19వ తేదీ వరకు అందుబాటులో ఉంటుంది. ఇక బజాజ్ ఫిన్‌సర్వ్ లో డ్యూరేషన్ ఫండ్ సబ్‌స్క్రిప్షన్ సైతం ఫిబ్రవరి 9వ తేదీనే మొదలవుతోంది. ఫిబ్రవరి 16వ తేదీ వరకు మాత్రమే ఈ స్కీమ్ అందుబాటులో ఉంటుంది.

# వాణిజ్య ఒప్పంద ప్రభావం పడొచ్చు



మధ్యంతర వాణిజ్య ఒప్పందంపై వెలువడిన భారత్-అమెరికా సంయుక్త ప్రకటన ప్రభావం ఈవారం మన స్టాక్ మార్కెట్లపై ఉంటుంది. మన వస్తువులపై అమెరికా టారిఫ్‌లు 50% నుంచి 18 శాతానికి తగ్గుతాయి. సముద్ర ఉత్పత్తులు, జౌళి, ఇతర కార్మిక ఆధారిత రంగాలకు ప్రయోజనం కలగనుంది. సాంకేతికంగా చూస్తే నిఫ్టీ-50కి 25,500 పాయింట్ల వద్ద మద్దతు, 25,750 వద్ద నిరోధం కనిపించొచ్చు. ఐడీబీఐ బ్యాంక్‌లో మెజారిటీ వాటా కొనుగోలుకు కోటక్ మహీంద్రా బ్యాంక్, ఫెయిర్‌ఫాక్స్ వంటివి ఆర్థిక బిడ్‌లు
సమర్పించనున్న నేపథ్యంలో, ఈ పరిణామాలపై మదుపర్లు దృష్టి సారించొచ్చు. టాటా స్టీల్ మెరుగైన ఫలితాల నేపథ్యంలో ఆ సంస్థ షేర్లు వెలుగులోకి రావొచ్చు. విదేశీ మదుపర్ల ధోరణి కీలకం కానుంది. వరుసగా 3 నెలల పాటు భారీగా విక్రయాలు జరిపిన విదేశీ పోర్టుఫోలియో మదుపర్లు, ఈ నెల తొలివారంలో రూ.8,129 కోట్ల నికర కొనుగోళ్లు జరపడం గమనార్హం.

# ఒక్క లవంగం తిన్నా చాలు బోలెడు లాభాలు

లవంగాలలో ఎన్నో పోషకాలతోపాటు.. ఔషధ గుణాలు దాగున్నాయి.. లవంగాలు వంటలకు మంచి రుచి, సువాసనను ఇస్తాయి. కానీ వాటి వినియోగంపై అపోహలున్నాయి. నిజానికి, తగిన మోతాదులో వాడితే పొట్ట, అన్నవాహిక అల్సర్‌లను నివారించడంలో అద్భుతంగా సహాయపడతాయి. అయితే, మోతాదు మించితే మంట, ఇతర సమస్యలు రావచ్చని 2014 పరిశోధనలు తెలుపుతున్నాయి. లవంగాలలో ఎన్నో ఔషధ గుణాలు దాగున్నాయి.. లవంగాలు మాంగనీస్, విటమిన్ ఐ, విటమిన్ అ, ఫైబర్‌తో కూడిన అత్యంత పోషకమైన సుగంధ ద్రవ్యాలుగా పరిగణిస్తారు. దీనిలోని యూజెనాల్ అనే యాంటీఆక్సిడెంట్ ఎన్నో సమస్యలను దూరం చేస్తుందని ఆయుర్వేద నిపుణులు చెబుతున్నారు. అయితే.. వంటకాలకు సువాసన, రుచిని అందించే లవంగాలు మన దైనందిన ఆహారంలో ఒక భాగం.. అయితే, లవంగాలు ఎక్కువైతే పొట్టలో మంట, అసౌకర్యం, అల్సర్‌లు వంటి సమస్యలు వస్తాయని చాలామంది భయపడుతుంటారు. ఇది కొంతమందిలో వేడి చేసిన అనుభూతిని కూడా కలిగిస్తుంది. అయితే, లవంగాలపై జరిగిన శాస్త్రీయ పరిశోధనలు ఈ అపోహను పాక్షికంగా తొలగిస్తూ ఒక కీలకమైన వాస్తవాన్ని వెల్లడించాయి. లవంగాలు సరైన మోతాదులో ఉపయోగించినప్పుడు, అవి పొట్టలో, అన్నవాహికలో (ఆహార నాళం) అల్సర్‌లు ఏర్పడకుండా అద్భుతంగా రక్షించగలవని ఆరోగ్య నిపుణులు చెబుతున్నారు.లవంగాలలో ఉండే ప్రత్యేకమైన ఘాటుకు కారణమైన రసాయన సమ్మేళనాలు.. మనం తీసుకున్నప్పుడు జీర్ణవ్యవస్థలోని జిగురు పొరలను (ఎబీఇ-నీబీబ ఎవఎఎతీజీనివబ) ఉత్తేజపరుస్తాయి. ఈ ప్రేరణ వల్ల జిగురును ఉత్పత్తి చేసే కణజాలం క్రియాశీలమై, కడుపు, అన్నవాహిక గోడలపై రక్షణ కవచంలా పనిచేసే జిగురు ఎక్కువగా స్రవించేలా చేస్తుంది. ఈ జిగురు పెరగడం వల్ల కడుపులో మంటలు, అల్సర్‌లు వంటివి రాకుండా అడ్డుకుంటుంది. ఎర్ర కారం వంటి వాటి ఘాటుకు ఇలాంటి రక్షణ యంత్రాంగం ఉండదు.. కానీ లవంగాల ఘాటుకు ఈ విశిష్ట ప్రయోజనం ఉంది. అయితే, ఈ ప్రయోజనం



మోతాదుకు లోబడి ఉంటుంది. మూడు లేదా నాలుగు లవంగాలను మించి వాడకుండా ఉంటేనే పొట్టలో, అన్నవాహికలో అల్సర్‌ల నుండి రక్షణ లభిస్తుందని పరిశోధనలు సూచిస్తున్నాయి. ఈ మోతాదుకు మించి, అనగా నాలుగైదు లవంగాల కంటే ఎక్కువ వాడినప్పుడు, లవంగాలలో ఉండే రసాయన ప్రభావం అధికమై రివర్స్ సైడ్ ఎఫెక్ట్‌లకు దారితీస్తుంది. ఈ అధిక ప్రభావం వల్ల మంట, ఇరిటేషన్ ఎక్కువైపోయి అసౌకర్యం కలుగుతుంది. ఈ పరిశోధనల వివరాలను 2014వ సంవత్సరంలో బ్రెజిల్‌లోని యూనివర్సిటీ ఆఫ్ సావోపాలో అందించింది. అందుకనే, లవంగాలు రోజూ వాడితే మంటలు, అల్సర్‌లు వస్తాయనే అపోహ ఉన్నప్పటికీ, సరైన మోతాదులో ఉపయోగించడం వల్ల అనేక లాభాలు పొందవచ్చు. చాలామంది వెజిటేరియన్ వంటకాల్లో లవంగాలు లేకుండా మసాలాలు వాడతారు.. అయితే ప్రత్యేక వంటకాల్లో, ముఖ్యంగా నాన్-వెజ్ వంటకాల్లో గుమగుమలాడే రుచి కోసం లవంగాలు వాడుతుంటారు. కానీ, తగు రీతిలో వాడుకున్నప్పుడు మాత్రమే లవంగాల వల్ల కలిగే అద్భుత ఆరోగ్య ప్రయోజనాలను పూర్తిగా పొందగలమని ఈ పరిశోధనలు స్పష్టం చేస్తున్నాయి. ఆరోగ్య ప్రయోజనాలను పొందాలంటే మోతాదుకు మించకుండా లవంగాలను వాడకూడదు..

# ఎవ్వరికీ తెలియని అద్భుతమైన ఔషధ రహస్యం



మెంతులు మన వంటింటి దినుసులలో దాగున్న అద్భుత ఔషధం. ఇవి ముఖ్యంగా మహిళల ఆరోగ్యానికి, తల్లిపాలు పెంచడానికి, ప్రసవాన్ని సులభతరం చేయడానికి ఉపకరిస్తాయి. అధిక కొలెస్ట్రాల్, మధుమేహం నియంత్రణకు, మలబద్ధకం, జ్వరం, గొంతునొప్పి నుండి ఉపశమనం పొందడానికి మెంతులు ఎంతగానో సహాయపడతాయి. రోజువారీ ఆహారంలో మెంతులను చేర్చుకోవడం ద్వారా ఎన్నో ఆరోగ్య ప్రయోజనాలను పొందవచ్చు. మన వంటింట్లో ప్రతిరోజు వాడే దినుసులలో మెంతులు ఒకటి.. కేవలం వంటకు రుచిని ఇవ్వడమే కాదు, మెంతులు అద్భుతమైన ఔషధ గుణాలతో నిండి ఉన్నాయని చాలామందికి తెలియదు. ఆరోగ్యానికి, ముఖ్యంగా మహిళల ఆరోగ్యానికి ఇవి ఎంతో మేలు చేస్తాయి. నిత్యం వీటిని సరైన పద్ధతిలో తీసుకోవడం వల్ల అనేక ఆరోగ్య ప్రయోజనాలను పొందవచ్చని ఆరోగ్య నిపుణులు చెబుతున్నారు. అయితే.. ఉదయాన్నే పరగడుపున మెంతుల నీరు తాగడం వల్ల అనేక ఆరోగ్య ప్రయోజనాలను పొందవచ్చని డైటీషియన్లు చెబుతున్నారు. మెంతుల నీరు.. ఫైబర్, ఐరన్, మెగ్నీషియం, ప్రోటీన్, పొటాషియం వంటి ముఖ్యమైన పోషకాలతో కూడిన శక్తివంతమైన పానీయం. రాత్రి నానబెట్టిన మెంతుల నీటిని ఉదయం పరగడుపున తాగడం వల్ల జీర్ణశక్తి మెరుగుపడుతుంది.. రక్తంలో చక్కెర స్థాయిలు అదుపులో ఉంటాయి.. బరువు తగ్గుదలకు సహాయపడుతుందని డైటీషియన్లు చెబుతున్నారు.మెంతులు, మెంతుల నీరు బాలింతలలో తల్లిపాలు పెంచడానికి ఎంతగానో సహాయపడతాయి. మెంతికూరను ఆహారంలో చేర్చడం లేదా మెంతులతో చేసిన దోసెలు, ఇడ్లీలు తీసుకోవడం ద్వారా పాల ఉత్పత్తి పెరుగుతుంది.గర్భధారణ సమయంలో, ప్రసవాన్ని సులభతరం చేయడానికి, గర్భాశయ సంబంధ సమస్యలను తగ్గించడానికి మెంతులు ఉపయోగపడతాయి. ప్రసవం తర్వాత పేగుల కదలికను మెరుగుపరచి, నడుము నొప్పి వంటి సమస్యలను నివారిస్తాయి.అధిక కొలెస్ట్రాల్‌తో బాధపడేవారు రోజుకు 10-20 గ్రాముల మెంతులను నీటిలో లేదా మజ్జిగలో కలిపి తీసుకుంటే కొవ్వు కరిగి బరువు తగ్గుతారు.మధుమేహం నియంత్రణకు మెంతులు, మెంతుల నీరు అద్భుత ఔషధం. ప్రతిరోజూ ఒక టీస్పూన్ మెంతి పొడిని మూడు సార్లు తీసుకోవడం లేదా నానబెట్టిన మెంతులను నీటితో పాటు సేవించడం వల్ల డయాబెటిస్ అదుపులో ఉంటుంది.మలబద్ధకం సమస్య ఉన్నవారు 2-3 చెంచాల నానబెట్టిన మెంతులను తింటే విరేచనం సాఫీగా అవుతుంది.జ్వరం, గొంతునొప్పి తగ్గించడానికి మెంతులు, తేనె, నిమ్మరసం కలిపిన కషాయం ఉపశమనం ఇస్తుంది. ఈ విధంగా మెంతులు మనకు తెలియని ఎన్నో ఆరోగ్య ప్రయోజనాలను అందిస్తాయి. వాటిని సరైన రీతిలో ఆహారంలో భాగం చేసుకోవడం ద్వారా అనేక సమస్యల నుండి విముక్తి పొందవచ్చు. ఆరోగ్యకరమైన జీవనం కోసం మెంతులను మీ దినచర్యలో చేర్చుకోవాలని ఆయుర్వేద నిపుణులు సూచిస్తున్నారు.. ముందుగా రాత్రి పూట మెంతులను నానబెట్టి ఉదయాన్నే ఆ నీటిని తాగడంతోపాటు.. తినవచ్చు.. లేదా మెంతుల పొడిని నీటిలో మరిగించి తీసుకోవచ్చు.. లేకపోతే.. మెంతికూరను మీ ఆహారంలో జోడించుకోండి..

# షుగర్ ఉన్నవారు స్వీట్ కార్న్ తింటే ఏమవుతుంది?

మనం సాయంత్రం పూట చిరుతిండిగా తీసుకునే స్వీట్ కార్న్ రుచిగా ఉండటమే కాదు ఆరోగ్యానికి కూడా మేలు చేస్తుంది. కానీ షుగర్ ఉన్నవారు మాత్రం దీని విషయంలో గందరగోళానికి గురవుతుంటారు. మొక్కజొన్నలో సహజంగానే చక్కెరలు ఉంటాయని.. అది ఆరోగ్యానికి హాని చేస్తుందని కొందరు నమ్ముతారు. ఆహారపు అలవాట్లలో చిన్న మార్పులు కూడా షుగర్ పేషెంట్లకు రక్తంలో చక్కెర స్థాయిలపై తీవ్ర ప్రభావం చూపుతాయి. ఈ క్రమంలోనే చాలా మందికి వచ్చే సందేహం.. స్వీట్ కార్న్ తినవచ్చా? నిజానికి చిన్నా పెద్దా తేడా లేకుండా అందరూ ఇష్టపడే ఈ స్నాక్ ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తుంది. అయితే ఇది తింటే షుగర్ పేషెంట్లకు రక్తంలో చక్కెర స్థాయిలను పెంచుతుందా..? అనే ప్రశ్న చాలా మందిని వేధిస్తుంటుంది. తక్కువ గ్లైసెమిక్ ఇండెక్స్ : స్వీట్ కార్న్ ఉఎ స్కోరు 52-55 మధ్య ఉంటుంది. ఇది తక్కువ నుండి మితమైన కేటగిరీ కిందకు వస్తుంది. అంటే ఇతర పిండి పదార్థాల ఆహారాలతో పోలిస్తే, ఇది రక్తంలో గ్లూకోజ్ స్థాయిలను ఒక్కసారిగా పెంచదు.డైటరీ ఫైబర్: ఇందులో పీచు పదార్థం ఎక్కువగా ఉండటం వల్ల జీర్ణక్రియ నెమ్మదిగా సాగుతుంది.



ఫలితంగా చక్కెర శోషణ నిదానంగా జరిగి ఇన్సులిన్ స్పైక్స్ రాకుండా ఉంటాయి.అద్భుతమైన యాంటీఆక్సిడెంట్స్: ఇందులో ఉండే లుటీన్, జియాక్సంతిన్ కంటి చూపును మెరుగుపరుస్తాయి. మధుమేహం వల్ల వచ్చే కంటి సమస్యల నుంచి రక్షణ కల్పిస్తాయి. అధిక కార్బోహైడ్రేట్లు: స్వీట్ కార్న్‌లో పిండి పదార్థాలు సహజంగానే ఎక్కువగా ఉంటాయి. కాబట్టి మోతాదు మించితే రక్తంలో చక్కెర పెరగడం ఖాయం.ప్రాసెస్ చేసిన ఉత్పత్తులు: డబ్బాలో నిల్వ చేసిన లేదా స్వీటెనర్లు కలిపిన స్వీట్ కార్న్ ఉత్పత్తులు మధుమేహులకు అత్యంత ప్రమాదకరం. వీటిలో సోడియం, షుగర్ కంటెంట్ ఎక్కువగా ఉంటుంది. మోతాదు ముఖ్యం: రోజువారీ ఆహారంలో ఒక చిన్న కప్పు తీసుకోవడం సురక్షితం. ఉడికించడం ఉత్తమం: నూనెలో వేయించడం కంటే ఉడికించిన లేదా కాల్చిన మొక్కజొన్న ఆరోగ్యకరం. కాంబినేషన్: స్వీట్ కార్న్ తినేటప్పుడు దాంతో పాటు ప్రోటీన్ ఎక్కువగా ఉండే ఆహారంలేదా పీచు పదార్థం ఉన్న కూరగాయలు తీసుకుంటే షుగర్ కంట్రోల్‌లో ఉంటుంది.

## బాడీలోని చెడుకొవ్వును తరిమికొట్టే సూపర్ సీడ్స్



నేటి ఆధునిక జీవనశైలి, ఆహారపు అలవాట్ల వల్ల చాలామంది ఎదుర్కొంటున్న ప్రధాన సమస్య చెడు కొలెస్ట్రాల్. రక్తనాళాల్లో కొవ్వు పేరుకుపోవడం వల్ల గుండెపోటు వంటి తీవ్రమైన ఆరోగ్య సమస్యలు తలెత్తుతున్నాయి. అయితే ఖరీదైన మందుల కంటే మన వంటగదిలో ఉండే కొన్ని రకాల విత్తనాలు కొలెస్ట్రాల్‌ను తగ్గించడంలో అద్భుతంగా పనిచేస్తాయని ఆరోగ్య నిపుణులు సూచిస్తున్నారు. చియా గింజలు: పోషకాల గని అయిన చియా గింజల్లో ఫైబర్ పుష్కలంగా ఉంటుంది. ఇది జీర్ణక్రియను మెరుగుపరచడమే కాకుండా శరీరంలో కొలెస్ట్రాల్ శోషణను అడ్డుకుంటుంది. వీటిని నీటిలో లేదా పండ్ల రసాల్లో నానబెట్టి తీసుకోవడం వల్ల పూర్తి ప్రయోజనం ఉంటుంది. అవిసె గింజలు: ఒమేగా-3 ఫ్యాటీ యాసిడ్స్ కావాలంటే అవిసె గింజలే బెస్ట్ ఛాయిస్. ఇందులోని కరిగే ఫైబర్ చెడు కొలెస్ట్రాల్‌ను శరీరం నుండి బయటకు పంపేస్తుంది. అవిసె గింజలను నేరుగా మింగకూడదు. వీటిని దోరగా వేయించి, పొడి చేసుకుని తింటేనే పోషకాలు అందుతాయి. గుమ్మడికాయ గింజలు: మెగ్నీషియం, యాంటీ ఆక్సిడెంట్లు వీటిలో మెండుగా ఉంటాయి. ఇవి చెడు కొలెస్ట్రాల్ తగ్గించి, మంచి కొలెస్ట్రాల్ పెంచడంలో సహాయపడతాయి. వీటిని లైట్‌గా వేయించి స్నాక్స్‌లా తినవచ్చు లేదా సూప్‌లు, సలాడ్‌లలో గార్నిష్‌గా వాడుకోవచ్చు. నువ్వులు: నువ్వులలో ఉండే లిగ్నన్లు, ప్లాంట్ స్టెరాల్స్ కొలెస్ట్రాల్‌ను నియంత్రించడమే కాకుండా రక్తపోటును అదుపులో ఉంచుతాయి. నువ్వులను లడ్డూల రూపంలో లేదా రోజువారీ వంటల్లో పొడి రూపంలో చేర్చుకోవచ్చు. పొద్దుతిరుగుడు విత్తనాలు: వీటిలో ఉండే ఫైటోస్టెరాల్స్ కొలెస్ట్రాల్‌ను అడ్డుకుంటాయి. అలాగే ఇందులోని విటమిన్-ఇ రక్తనాళాలు దెబ్బతినకుండా కాపాడుతుంది. మందులతో పనిలేకుండా సహజంగా కొలెస్ట్రాల్ తగ్గించుకోవాలనుకునే వారికి ఈ ఐదు రకాల విత్తనాలు అద్భుతమైన వరం.

## నారింజ తొక్కలను పారేస్తున్నారా?



సాధారణంగా మనం నారింజ పండ్లను తిని, వాటి తొక్కలను పనికిరానివిగా భావించి పారేస్తుంటాం. కానీ అసలు సిసలైన పోషకాలు ఆ తొక్కల్లోనే ఉన్నాయని మీకు తెలుసా..? నారింజ తొక్కల్లో విటమిన్ సి, ఫైబర్, యాంటీఆక్సిడెంట్లు, సహజ నూనెలు పుష్కలంగా ఉంటాయి. ఇవి కేవలం ఆరోగ్యానికే కాదు, చర్మ సౌందర్యానికి, ఇంటి అలంకరణకు కూడా అద్భుతంగా పని చేస్తాయని నిపుణులు చెబుతున్నారు.రోగనిరోధక శక్తి: నారింజ తొక్కల్లో ఉండే ఫ్లేవనాయిడ్లు, విటమిన్ సి రోగనిరోధక శక్తిని బలోపేతం చేస్తాయి. ముఖ్యంగా సీజన్ మారినప్పుడు వచ్చే జలుబు, దగ్గు, వైరల్ ఇన్ఫెక్షన్ల నుండి ఇవి మనల్ని రక్షిస్తాయి. తొక్కలను ఎండబెట్టి పొడి చేసి లేదా టీగా మరిగించి తాగడం వల్ల మంచి ఫలితం ఉంటుంది.జీర్ణ సమస్యలకు చెక్: ఇందులోని అధిక ఫైబర్ కంటెంట్ మలబద్ధకం, గ్యాస్, అజీర్తి వంటి సమస్యలను దూరం చేస్తుంది. పేగులను శుభ్రం చేసి, జీర్ణవ్యవస్థను ఆరోగ్యంగా ఉంచడంలో నారింజ తొక్కల పొడి కీలక పాత్ర పోషిస్తుంది. గుండె ఆరోగ్యం - బరువు నియంత్రణ: నారింజ తొక్కలు శరీరంలోని చెడు కొలెస్ట్రాల్‌ను తగ్గించి, మంచి కొలెస్ట్రాల్‌ను పెంచుతాయి. దీనివల్ల రక్తపోటు నియంత్రణలో ఉండి గుండె జబ్బుల ముప్పు తగ్గుతుంది. ఇవి శరీర మెటబాలిజంను పెంచి, కొవ్వు పేరుకుపోకుండా చూస్తాయి. బరువు తగ్గాలనుకునే వారికి ఇది ఒక సహజసిద్ధమైన పరిష్కారం. అలెర్జీల నుండి ఉపశమనం: నారింజ తొక్కల్లోని సహజ సమ్మేళనాలు హిస్టామిన్ చర్యను తగ్గిస్తాయి. తద్వారా తుమ్ములు, శ్వాసకోశ సమస్యలు, వివిధ రకాల అలెర్జీల నుండి ఉపశమనం లభిస్తుంది. ఇంటి అలంకరణలో నేచురల్ టచ్: నారింజ తొక్కలను పారేయకుండా వాటితో పర్యావరణ అనుకూలమైన అలంకరణలు చేయవచ్చు. తొక్కలను సగానికి కోసి, అందులో నూనె లేదా మైనం వేసి విక్ పెడితే అద్భుతమైన సువాసననిచ్చే కొవ్వొత్తులు తయారవుతాయి. ఎండిన తొక్కలను దాల్చిన చెక్క, లవంగాలతో కలిపి గదిలో ఉంచితే ఇల్లంతా తాజా సువాసన వెదజల్లుతుంది.

## చెరుకు రసం వీరికి విషంతో సమానం

చలికాలం, ఎండకాలంలో రోడ్డు పక్కన చెరకు రసం దుకాణాలు కిటకిటలాడుతుంటాయి. తియ్యగా, చల్లగా ఉండే ఈ రసం తక్షణ శక్తిని ఇస్తుందనడంలో సందేహం లేదు. యాంటీఆక్సిడెంట్లు, కాల్షియం, పొటాషియం వంటి పోషకాలు ఉన్నప్పటికీ.. ఇది అందరికీ ఆరోగ్యకరం కాదు. ముఖ్యంగా కొన్ని రకాల ఆరోగ్య సమస్యలు ఉన్నవారు చెరకు రసం తాగడం వల్ల లాభం కంటే నష్టమే ఎక్కువని వైద్య పరిశోధనలు హెచ్చరిస్తున్నాయి. మధుమేహ వ్యాధిగ్రస్తులు: చెరకు రసం అంటేనే సహజ చక్కెరల నిధి. ఒక గ్లాసు రసంలో సుమారు 40-50 గ్రాముల చక్కెర ఉంటుంది. దీని గ్లైసెమిక్ ఇండెక్స్ చాలా ఎక్కువ. ఇది రక్తంలో గ్లూకోజ్ స్థాయిలను ఒక్కసారిగా పెంచుతుంది. కాబట్టి టైప్-1, టైప్-2 డయాబెటిస్ ఉన్నవారు దీనికి దూరంగా ఉండాలి.బరువు తగ్గాలనుకునే వారు: ఒక గ్లాసు చెరకు రసంలో దాదాపు 180 కేలరీలు ఉంటాయి. ఇవన్నీ చక్కెర నుండే వస్తాయి. బరువు తగ్గాలనుకునే వారు దీనిని క్రమంగా తాగడం వల్ల ఫలితం రివర్స్ అవుతుంది. ఇది శరీరంలో కొవ్వు పెరగడానికి దారితీస్తుంది. రోడ్డు పక్కన విక్రయించే చెరకు రసం తయారీలో పరిశుభ్రత తక్కువగా ఉండే అవకాశం ఉంది. శుభ్రం చేయని యంత్రాలు, కలుషితమైన మంచు వాడటం వల్ల ఇన్ఫెక్షన్లు వచ్చే ప్రమాదం ఉంది. వృద్ధులు, చిన్న పిల్లలు, రోగనిరోధక శక్తి తక్కువగా ఉన్నవారు దీనిని తాగితే విరేచనాలు, ఫుడ్ పాయిజనింగ్ బారిన పడే అవకాశం ఉంది. కాలేయ సమస్యలు: ఆయుర్వేదం కామెర్లకు చెరకు రసాన్ని సూచించినప్పటికీ, ఫ్యాటీ లివర్ లేదా సిర్రోసిస్ వంటి తీవ్రమైన కాలేయ వ్యాధులు ఉన్నవారికి ఈ చక్కెర భారం కాలేయంపై ఒత్తిడిని పెంచుతుంది. కాబట్టి కాలేయ రోగులు వైద్యుల సలహా మేరకే దీనిని తీసుకోవాలి. దంత సమస్యలు: చెరకు రసం దంతాలకు సులభంగా అంటుకుంటుంది. దీనివల్ల బాక్టీరియా పెరిగి దంత క్షయం, చిగుళ్ల సమస్యలకు దారితీస్తుంది. సెన్సిటివ్ దంతాలు ఉన్నవారు దీనిని తాగిన వెంటనే నోటిని నీటితో శుభ్రం చేసుకోవాలి. జీర్ణ సమస్యలు: బలహీనమైన జీర్ణవ్యవస్థ ఉన్నవారిలో చెరకు రసం గ్యాస్, ఉబ్బరం కలిగించవచ్చు. గ్యాస్ట్రైటిస్ లేదా అసిడిటీ ఉన్నవారికి ఇది చికాకు కలిగిస్తుంది. ఇలాంటి వారు మజ్జిగ లేదా కొబ్బరి నీళ్లు తీసుకోవడం ఉత్తమం.

# ప్రేక్షకాదరణలో ఫుట్‌బాల్ కింగ్.. రెండో స్థానంలో క్రికెట్

**ప్రేక్షకాదరణలో ఫిఫా ప్రపంచకప్ ఫైనల్‌దే అగ్రస్థానం**

**150 కోట్ల వీక్షణలతో ఫుట్‌బాల్ తిరుగులేని ఆధిపత్యం**

**రెండో స్థానంలో క్రికెట్ ప్రపంచకప్.. నాలుగో స్థానానికి పడిపోయిన సూపర్ బౌల్**

**డిజిటల్ వీక్షణలో సరికొత్త రికార్డులు సృష్టిస్తున్న ఐపీఎల్**

**అమెరికాలో సూపర్ బౌల్‌కు క్రేజ్ ఉన్నా.. ప్రపంచవ్యాప్తంగా వెనుకంజ**




**హైదరాబాద్ పెన్ పవర్:** ప్రతి ఏటా అమెరికాలో జరిగే సూపర్ బౌల్ ఈవెంట్ రాగానే, సోషల్ మీడియాలో ఓ పెద్ద చర్చ మొదలవుతుంది. ప్రపంచంలో అత్యంత ప్రజాదరణ పొందిన క్రీడా ఈవెంట్ ఇదేనంటూ పాశ్చాత్య అభిమానులు వాదిస్తుంటారు. కానీ, వాస్తవ లెక్కలు చూస్తే ఈ వాదనలో వాస్తవం లేదని స్పష్టమవుతోంది. ప్రపంచవ్యాప్తంగా చూస్తే ఫుట్‌బాల్ (సాకర్) తిరుగులేని రాజుగా నిలుస్తుండగా, డిజిటల్ వీక్షణలో క్రికెట్ వేగంగా దూసుకొస్తోంది. అమెరికాలో సూపర్ బౌల్‌కు ఎంత క్రేజ్ ఉన్నప్పటికీ, ప్రపంచవ్యాప్త ప్రేక్షకాదరణలో దాని స్థానం చాలా వెనుక ఉంది.

**ఫిఫా ప్రపంచకప్.. తిరుగులేని ఆధిపత్యం**

ప్రపంచంలో అత్యధిక మంది చూసిన ఫైనల్స్‌లో ఫిఫా ప్రపంచకప్‌దే అగ్రస్థానం. 2022లో ఖతార్ వేదికగా అర్జెంటీనా, ఫ్రాన్స్ మధ్య జరిగిన ఫైనల్ మ్యాచ్‌ను ప్రపంచవ్యాప్తంగా సుమారు 150 కోట్ల మంది వీక్షించారు. ఫిఫా అధికారిక లెక్కల ప్రకారమే ఈ సంఖ్య నమోదైంది. యూరప్, దక్షిణ అమెరికా, ఆసియా, ఆఫ్రికా ఖండాల్లో ఏకకాలంలో ఇంత భారీ సంఖ్యలో వీక్షకులను ఆకట్టుకున్న ఏకైక ఈవెంట్ ఇదే.

**రెండో స్థానంలో క్రికెట్ ప్రపంచకప్**

ఫిఫా ప్రపంచకప్ స్థాయిలో కాకపోయినా, అత్యధిక వీక్షకులను సంపాదించుకున్న రెండో అతిపెద్ద ఈవెంట్‌గా క్రికెట్ ప్రపంచకప్ నిలిచింది. 2023లో భారత్, ఆస్ట్రేలియా మధ్య జరిగిన ఫైనల్‌ను సుమారు 50 కోట్ల మంది చూశారని ఐసీసీ, దాని అధికారిక ప్రసార భాగస్వాములు అంచనా వేశాయి. ముఖ్యంగా దక్షిణాసియా దేశాల్లోని అపారమైన జనాభా ఈ సంఖ్యకు కారణమైంది. బార్క్ (దీూ=జ) డేటా ప్రకారం కేవలం భారత్‌లోనే డిస్నీ స్టార్ నెట్‌వర్క్‌పై ఈ మ్యాచ్‌కు 422 బిలియన్ల వీక్షణ నిమిషాలు నమోదయ్యాయి.

**ఐపీఎల్, సూపర్ బౌల్ స్థానం ఎక్కడ?**

ఇక, ఇండియన్ ప్రీమియర్ లీగ్ (ఐపీఎల్) కేవలం దేశీయ లీగ్‌గా పరిమితం కాలేదు. 2025లో రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు, పంజాబ్ కింగ్స్ మధ్య జరిగిన ఫైనల్‌ను టీవీ, డిజిటల్ ప్లాట్‌ఫామ్‌లలో కలిపి దాదాపు 30 కోట్ల మంది వీక్షించారు. ఇది ప్రపంచంలోనే అత్యధికంగా వీక్షించిన టీ20 మ్యాచ్‌గా నిలిచింది.

మరోవైపు 2025లో ఫిలడెల్ఫియా ఈగల్స్, కాన్సాస్ సిటీ చీఫ్స్ మధ్య జరిగిన సూపర్ బౌల్ ఫైనల్ అమెరికన్ టెలివిజన్‌లో రికార్డులు సృష్టించింది. కానీ, ప్రపంచవ్యాప్తంగా దీని వీక్షకుల సంఖ్య 19 కోట్లకు మాత్రమే పరిమితమైంది. ఇందులో 12.7 కోట్లు అమెరికా నుంచే ఉండగా, అంతర్జాతీయ వీక్షకులు 6.2 కోట్లు మాత్రమే. వాణిజ్యపరంగా, ప్రకటనల పరంగా సూపర్ బౌల్ బంగారు గని అయినప్పటికీ, ప్రపంచ ప్రేక్షకాదరణలో మాత్రం ఫుట్‌బాల్, క్రికెట్‌ల కంటే చాలా వెనుకబడి ఉంది.

# ప్రపంచకప్‌లో మ్యాచ్ వదులుకుంటారా?.. గంగూలీ

**టీ20 ప్రపంచకప్‌లో భారత్‌తో మ్యాచ్‌ను బహిష్కరించిన పాకిస్థాన్**

**పాక్ నిర్ణయం విస్మయానికి గురి చేసిందన్న గంగూలీ**

**ప్రపంచకప్‌లో ప్రతీ పాయింట్ కీలకమని గంగూలీ వ్యాఖ్య**



**హైదరాబాద్ పెన్ పవర్:** ఐసీసీ టీ20 ప్రపంచకప్ 2026లో భాగంగా భారత్‌తో జరగాల్సిన మ్యాచ్‌ను బహిష్కరించాలన్న పాకిస్థాన్ నిర్ణయంపై బీసీసీఐ మాజీ అధ్యక్షుడు, భారత మాజీ కెప్టెన్ సౌరవ్ గంగూలీ ఆశ్చర్యం వ్యక్తం చేశాడు. ఈ నెల 15న కొలంబో వేదికగా ఈ మ్యాచ్ జరగాల్సి ఉండగా, పాక్ ఈ నిర్ణయం తీసుకోవడం తనను విస్మయానికి గురి చేసిందని ఆయన అన్నాడు.ఆదివారం విలేకరులతో మాట్లాడిన గంగూలీ.. "ప్రపంచకప్ నుంచి ఎందుకు తప్పుకుంటున్నారు? ఎలాగూ వాళ్లు శ్రీలంకలోనే ఆడుతున్నారు. పాకిస్థాన్ ఇలా వెనక్కి తగ్గడం నన్ను ఆశ్చర్యపరిచింది. ప్రపంచకప్ లాంటి టోర్నీలో ప్రతీ పాయింట్ ఎంతో ముఖ్యం" అని స్పష్టం చేశాడు. తటస్థ వేదికపై మ్యాచ్ జరుగుతున్నప్పటికీ పాకిస్థాన్ ఆడకపోవడాన్ని దాదా తప్పుబట్టాడు.ఈ టోర్నమెంట్ కోసం భారత్‌కు వెళ్లకూడదని బంగ్లాదేశ్ తీసుకున్న నిర్ణయానికి మద్దతుగా, టీమిండియాతో తమ మ్యాచ్‌ను బహిష్కరిస్తున్నట్లు పాకిస్థాన్ క్రికెట్ బోర్డు ప్రకటించిన విషయం తెలిసిందే. ఈ ప్రపంచకప్‌లో డిఫెండింగ్ ఛాంపియన్ అయిన భారత్.. గ్రూప్-ఏలో ఉంది. ఇదే గ్రూపులో పాకిస్థాన్‌తో పాటు నమీబియా, నెదర్లాండ్స్, యూఎస్ఏ జట్లు కూడా ఉన్నాయి.

# రంగంలోకి దిగిన ఐసీసీ.. భారత్‌తో మ్యాచ్‌పై 24 గంటల్లో పీసీబీ నిర్ణయం




**లాహోర్‌లో ఐసీసీ, పీసీబీ అధికారుల మధ్య 5 గంటలకు పైగా చర్చలు**

**పాక్ ప్రభుత్వంతో సంప్రదించిన తర్వాతే తుది నిర్ణయం**


**ఈ చర్చల్లో పాకిస్థాన్‌కు మద్దతుగా నిలిచిన బంగ్లాదేశ్**

**ఈ నెల 15న జరగనున్న హై-వోల్టేజ్ మ్యాచ్‌పై వీడని అనిశ్చితి**

**హైదరాబాద్ పెన్ పవర్:** టీ20 ప్రపంచ కప్ 2026లో భాగంగా భారత్‌తో జరగాల్సిన మ్యాచ్‌ను బాయ్‌కాట్ చేసే ప్రతిపాదనపై పాకిస్థాన్ క్రికెట్ బోర్డు (పీసీబీ) తన వైఖరిని రాబోయే 24 గంటల్లో స్పష్టం చేయనున్నట్లు తెలుస్తోంది. లాహోర్‌లో అంతర్జాతీయ క్రికెట్ కౌన్సిల్ (ఐసీసీ) ఉన్నతాధికారులతో పీసీబీ సుదీర్ఘంగా జరిపిన సమావేశం అనంతరం ఈ పరిణామం చోటుచేసుకుంది. ఈ నెల 15న జరగనున్న ఈ హై-వోల్టేజ్ మ్యాచ్‌పై నెలకొన్న అనిశ్చితి ప్రపంచ క్రికెట్‌లో తీవ్ర చర్చనీయాంశంగా మారింది.లాహోర్‌లోని గడ్డాఫీ స్టేడియంలో ఐసీసీ డిప్యూటీ ఛైర్మన్ ఇమ్రాన్ ఖ్వాజా, బంగ్లాదేశ్ క్రికెట్ బోర్డు అధ్యక్షుడు అమీనుల్ ఇస్లాంతో కలిసి పీసీబీ ఛైర్మన్ మోహ్సిన్ నఖ్వీ ఐదు గంటలకు పైగా చర్చలు జరిపారు. టోర్నమెంట్‌కే తలమానికమైన మ్యాచ్‌పై నీలినీడలు కమ్ముకోవడంతో సమస్యను త్వరగా పరిష్కరించాలని ఐసీసీ భావిస్తోంది. తుది నిర్ణయం తీసుకునే ముందు తమ దేశ ఫెడరల్ ప్రభుత్వాన్ని సంప్రదించాలని పీసీబీ యోచిస్తున్నట్లు సమాచారం. ఈరోజు నఖ్వీ మీడియా సమావేశంలో మాట్లాడే అవకాశం ఉందని, త్వరలోనే స్పష్టత వస్తుందని అంచనా వేస్తున్నారు.కొలంబో వేదికగా ఈ నెల 15న భారత్‌తో జరగాల్సిన గ్రూప్ మ్యాచ్ ఆడబోమని ఈ నెల 2న పీసీబీ ప్రకటించడంతో వివాదం మొదలైంది. దీంతో ఐసీసీ రంగంలోకి దిగి అత్యవసరంగా చర్చలు ప్రారంభించింది. ఈ చర్చల్లో బంగ్లాదేశ్ బోర్డు పాల్గొనడం ప్రాధాన్యం సంతరించుకుంది. ఈ చర్చల్లో పాకిస్థాన్, బంగ్లాదేశ్ ఒకే వైఖరితో ఉన్నాయని ఇండియా టుడే తన కథనంలో పేర్కొంది.టోర్నమెంట్ షెడ్యూల్, పాలన, వాణిజ్యపరమైన ఒప్పందాలపై ప్రభావం పడకుండా చూడటమే ఐసీసీ ప్రధాన లక్ష్యంగా ఉంది. మరోవైపు చర్చల్లోని అంశాలను పీసీబీ ఛైర్మన్ నఖ్వీ, పాక్ ప్రధాని షెహబాజ్ షరీఫ్‌కు వివరించనున్నారు. ఇది కేవలం క్రికెట్‌కే పరిమితమైన అంశం కాదని ఈ పరిణామం స్పష్టం చేస్తోంది.

# 3 నెలల తేడా.. రెండు చిత్రాలతో రౌడీ హీరో.. ఫ్యాన్స్ కి పండగే!





విజయ్ దేవరకొండ అభిమానులకు 2026 నిజంగా ఒక మెమొరబుల్ ఇయర్ కాబోతోంది. తనదైన మేనరిజంతో 'రౌడీ హీరో'గా ముద్ర వేయించుకున్న విజయ్, ఈ ఏడాది కేవలం మూడు నెలల వ్యవధిలోనే రెండు భారీ పాన్ ఇండియా చిత్రాలతో బాక్సాఫీస్ వద్ద సందడి చేయనున్నారు. భిన్నమైన కథా నేపథ్యాలు, క్రేజీ కాంబినేషన్లతో రాబోతున్న ఈ సినిమాల అప్‌డేట్స్ ఇప్పుడు సోషల్ మీడియాను షేక్ చేస్తున్నాయి. ఈ ఏడాదంతా రౌడీ మేనియా కొనసాగడం ఖాయంగా కనిపిస్తోంది.

**'రణబాలి'తో మళ్ళీ టాక్సీవాలా మ్యాజిక్:**

విజయ్ దేవరకొండ మరియు దర్శకుడు రాహుల్ సంకృత్యన్ కాంబినేషన్లో గతంలో వచ్చిన 'టాక్సీవాలా' ఎంతటి విజయాన్ని అందుకుందో మనందరికీ తెలిసిందే. ఇప్పుడు వీరిద్దరూ కలిసి మైత్రీ మూవీ మేకర్స్ నిర్మాణంలో 'రణబాలి' అనే ప్రతిష్టాత్మక సినిమాతో రాబోతున్నారు. ఈ సినిమాపై అంచనాలు పెరగడానికి మరో ప్రధాన కారణం, ఇందులో విజయ్ సరసన రష్మిక మందన్న హీరోయిన్‌గా నటిస్తుండటం. వీరిద్దరి ఆన్-స్క్రీన్ కెమిస్ట్రీకి ఉన్న క్రేజ్ గురించి ప్రత్యేకంగా చెప్పక్కర్లేదు. ఇప్పటికే విడుదలైన టైటిల్ గ్లింప్స్ మరియు టీజర్ యూట్యూబ్‌లో రికార్డులు సృష్టిస్తూ ఫ్యాన్స్‌కు గూస్‌బంప్స్ తెప్పిస్తున్నాయి. పక్కా కమర్షియల్ మరియు ప్యాషనేట్ ఎలిమెంట్స్‌తో రూపొందుతున్న ఈ చిత్రం సెప్టెంబర్ 11న థియేటర్లలో సందడి చేయనుంది.

**'రౌడీ జనార్థన'.. రవికిరణ్ కోలా డ్రీమ్ ప్రాజెక్ట్:**

సెప్టెంబర్‌లో రణబాలి అల్లరి ముగియకముందే, డిసెంబర్ నెలలో 'రౌడీ జనార్థన' సినిమాతో విజయ్ మరోసారి థియేటర్లకు రాబోతున్నారు. శ్రీ వెంకటేశ్వర క్రియేషన్స్ బ్యానర్‌పై రూపొందుతున్న ఈ చిత్రానికి రవికిరణ్ కోలా దర్శకత్వం వహిస్తున్నారు. ఇది రవికిరణ్ కోలాకు ఒక డ్రీమ్ ప్రాజెక్ట్ కావడంతో, ఆయన ఈ సినిమాను ఒక బ్లాక్ బస్టర్ ప్రామిస్‌తో తెరకెక్కిస్తున్నారు. ఇటీవల విడుదలైన ఈ సినిమా టీజర్ కూడా పాన్ ఇండియా స్థాయిలో అందరి దృష్టిని ఆకర్షించింది. రణబాలిలో ఒకలా కనిపిస్తే, రౌడీ జనార్థనలో విజయ్ పూర్తి వైవిధ్యమైన పాత్రలో కనిపించబోతున్నారు. ఇలా స్వల్ప వ్యవధిలో రెండు విభిన్నమైన పాత్రలతో మెప్పించడం విజయ్ దేవరకొండకే సాధ్యమని సినీ విశ్లేషకులు భావిస్తున్నారు.

**బాక్సాఫీస్ వద్ద రౌడీ హీరో ప్రభంజనం**

మొత్తానికి 2026లో విజయ్ దేవరకొండ తన సినిమాలతో టాలీవుడ్ బాక్సాఫీస్ వద్ద జాతర చేయబోతున్నారు. మూడు నెలల గ్యాప్‌లో రెండు భారీ ప్రాజెక్టులను రిలీజ్ చేయడం సాహసమే అయినా, ఆ సినిమాల కంటెంట్ మీద ఉన్న నమ్మకంతో చిత్ర యూనిట్ ముందుకు వెళ్తోంది. రాహుల్ సంకృత్యన్ మేకింగ్ స్టైల్, రవికిరణ్ కోలా విజన్.. ఈ రెండూ విజయ్ కెరీర్‌కు మరో మైలురాయిగా నిలిచేలా ఉన్నాయి. సెప్టెంబర్ మరియు డిసెంబర్ నెలలు రౌడీ ఫ్యాన్స్‌కు నిజమైన పండగను తీసుకురాబోతున్నాయి. ఈ రెండు చిత్రాలు విజయవంతమైతే విజయ్ దేవరకొండ పాన్ ఇండియా మార్కెట్ మరో స్థాయికి చేరుకోవడం ఖాయం.



Printed by Published by GANTYADA APPARAO on behalf of GANTYADA APPARAO, printed at SRI SAI GANGA PRINTERS AND PUBLICATIONS D.NO: 49-1-35, MIRIYALAPALEM CENTER, RAILWAY STATION ROAD, PRAKASAM, ANDHRA PRADESH - 523001 and published at Plot No: 29, H.NO: 1-24-725, Sri Gayatri Nilayam, Dwaraka Nagar, Tirumalagiri, Secundrabad, Telangana. Editor : GANTYADA APPARAO. PRGI Registration No. "TGTEL/25/A3106". e-mail : editorpenpower@gmail.com, Mobile: 9059465965